ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-9-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 230 పేజీలు: 10+4 వెల: 6.50

నాంపల్లి కోర్టుకు హాజరైన కెటిఆర్, అర్వింద్, మరో ఇద్దరు 3
నాటో తూర్పు దేశాలపై దాడులకు రష్యా స్కెచ్ 5



మమతకు షాక్
ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తు ఇచ్చిన ఇసి
రితబ్రతకు గుర్తు.. ఎన్వలప్ 5లో



నిఠారి హత్యల కేసు
నిర్దోషి సురేందర్ ఆత్మహత్య
టీస్టాల్‌లో ఉరికి వేలాడిన మృతదేహం 5లో



యాదగిరిగుట్టకు రోప్‌వే.. కొండగట్టుకు ఘాట్‌రోడ్
హడ్కో రుణాలతో హ్యామ్ రోడ్లు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 6లో



## దానం నాగేందర్‌పై అనర్హత వేటు

- స్పీకర్ నిర్ణయాన్ని తప్పుపట్టిన హైకోర్టు
- ఖైరతాబాద్ స్థానం ఖాళీ: సిఇ
- హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు: కిషన్ రెడ్డి
- ఉప ఎన్నికల్లో మాదే గెలుపు : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు18:** ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. దానం నాగేందర్‌పై అసెంబ్లీ స్పీకర్ అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ ఇచ్చిన నిర్ణయాన్ని కోర్టు తప్పుబట్టింది. కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఆయన ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా పరిగణించాలని కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బిఆర్‌ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాకుండా సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి >>2

### పోరాటం నాకు కొత్తేమీ కాదు: దానం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** యుద్ధంచేయడం తనకేమి కొత్తకాదని, పోరాటం చేసి మళ్లీ విజయం సాధిస్తానని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల >>2



## అసెంబ్లీ నిరవధిక వాయిదా

### 51.52 గంటలు సాగిన సభ

**హైదరాబాద్,సెప్టెంబరు18,ప్రభాతవార్త:** ఎనిమిది రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం సాయంత్రం నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే >>2

# సాయం చేయండి

### ఎల్‌నినో వల్ల పరిస్థితులు దారుణం
### వర్షాభావంతో పంటలు ఎండుతున్నాయి..
### తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాం
### కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విన్నవించిన సిఎం రేవంత్



శుక్రవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఎం రేవంత్, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు18:** ఎల్‌నినో ప్రభావం కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనడంలో కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌నుకోరారు. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో పాల్గొనడానికి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మాదాపూర్‌లో ముఖ్యమంత్రి వారిని కలిసి వర్షాభావం, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్ర మంత్రికి వివరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వివరాలతో వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయరంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. >>2

కేంద్రం 20వేల కోట్ల ప్యాకేజి మంజూరు చేయాలి 7లో

# భూకబ్జాలు బయటపెడతాం

### ప్రజలకు వాస్తవాలు చెప్పడానికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాం
### హరీష్ కొనుగోలు చేసిన భూమిపై ఇడి విచారణ జరపాలి
### రంగనాయక్ సాగర్ భూమి దుర్వినియోగం
### హరీష్ ఫాంహౌస్‌ను పరిశీలించిన ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్



శుక్రవారం హరీష్‌రావు ఫాంహౌస్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్

**సిద్దిపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ఆ పార్టీకి చెందిన మంత్రులు, నాయకులు చేసిన అవినీతి, భూకబ్జాలపై నిజా నిర్ధారణ చేసి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడానికే క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులుగా పర్యటన చేస్తున్నట్లు ఎంపిలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు అన్నారు. సిద్దిపేటజిల్లా చిన్నకోడూరు మండలం రామంచ శివారులోని రంగనాయకసాగర్ వద్దగల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు ఫాం హౌస్‌ను ఎంపిలు సురేష్‌శెట్కార్, బల్‌రాం నాయక్, వేం నరేందర్ రెడ్డి, కడియం కావ్య. అనిల్‌కుమార్ యాదవ్, రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, శంకర్‌నాయక్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న గ్లోబెల్ ప్రచారానికి పులిస్టాప్‌పెట్టడానికే ఇక్కడికి వచ్చామని తెలిపారు. అప్పటి నీటిపారుదశాఖ మంత్రి హరీష్‌రావు రంగనాయకసాగర్ నిర్మాణంలో భాగంగా 2 వేల 212 ఏకరాల భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదలచేసి 2వేల 183ఏకరాల భూమిని ఎందుకు సేకరించారని మిగితా భూమిని నోటిఫికేషన్ నుంచి ఎందుకు తొలిగించారని ప్రశ్నించారు. రంగనాయకసాగర్ నిర్మాణంకోసం సేకరిం >>2

## మసీదు వద్ద బాంబు పేలుడు

### 20 మంది దుర్మరణం
### పాక్‌లో దారుణం



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 18:** పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. మసీదువద్ద కారు బాంబు పేలడంతో 20 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన పాకిస్థాన్, ఖైబర్ ఫఖ్తుంఖ్వాలోని ఓల్డ్ పోలీసు లైన్స్‌లో శుక్రవారం ఉదయం జరిగింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం ప్రార్థనల సమయంలో ఈ పేలుడుజరిగింది. పేలుడు >>2



శుక్రవారం సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

## తేడా ఉంటే 13 ఎకరాలు సర్కార్‌కు రాసిచ్చేస్తా

### కబ్జా ఆరోపణలు అసత్యమని తేలితే సిఎం, మంత్రులు రాజీనామా చేస్తారా?: మాజీమంత్రి హరీష్‌రావు సవాల్

**సిద్దిపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** కాంగ్రెస్ బూటకపు యాత్రలు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని....ధైర్యం ఉంటే నా సవాల్ స్వీకరించాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దొంగే... దొంగ దొంగ అని అరిచినట్లుగా ఉందని కాంగ్రెస్ వ్యహారశైలి అని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సర్కార్ 22ఏలో భూములు పెట్టి లక్షలాది మందికి నరకం చూపిస్తుందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ బండారం బయటపడుతుందనే బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెన్షన్ చేశారని పేర్కొన్నారు. నా వ్యవసాయ భూమిలో విలాసవంతమైన ఫామ్ హౌస్ లేదు కనీసం బాత్రూం కూడా లేదన్నారు. ఒక చిన్న తప్పు ఉన్నా నా 13 ఎకరాల >>2

### లక్షకోట్లు పేదల ఖాతాల్లో వేస్తామంటే ప్రతి ఇంచు రాసిస్తాం : కెటిఆర్



**హైదరాబాద్, సెప్టెంబరు18, ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఒక్కశాతం కూడా నిజం లేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. తమ కుటుంబానికి రూ.లక్ష >>2

## రివాల్వర్ మిస్‌ఫైర్ ఆర్‌ఐ మృతి

### నిజామాబాద్‌లో విషాదం



మృతిచెందిన సతీష్ (ఫైల్)

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాత వార్త:** నిజామాబాద్ జిల్లాలో విషాదం నెలకొంది. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం ఉదయం రివాల్వర్ మిస్ ఫైర్ అవడంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ)గా పనిచేస్తున్న హెచ్ సతీష్ (41) తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మరణించారు. గురువారం రాత్రి పెట్రోలింగ్ వాహనంలో సహచరులతో కలిసి నైట్ డ్యూటీకి వెళ్లిన సతీష్ వర్షం కురవడంతో రివాల్వర్ కొంత తడిచింది. దీనిని శుభ్రం >>2

నిషేధిత భూములు 'పట్టా'లెక్కితే ఎలా? 3లో
భూముల ప్రస్తుత స్థితిపై రెవెన్యూ అధికారుల ఆరా

## వేడెక్కిన తెలంగాణం

### 33 జిల్లాల్లో పెరిగిన ఉష్ణోగ్రతలు
### ఖమ్మంలో అత్యధికంగా 39.6°

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** వర్షాకాలంలో ఉష్ణోగ్రతలు వేసవి పరిస్థితులను తలపిస్తున్నాయి. ప్రస్తుత వర్షాకాలం సీజనులో రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే మించి ఉష్ణోగ్రతలు చోటు చేసుకోవడంతో ఎండలు మండుతున్నాయి. పగలు,రాత్రిఉష్ణోగ్రతలు రెండూ సాధారణం కంటే ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. గడచిన 24 గంటల్లో తెలంగాణ వ్యాప్తంగా సగటున 32.2 డిగ్రీలసాధారణ ఉష్ణోగ్రతలకుగాను, 36.9 డిగ్రీలు నమోదయింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 35.1 డిగ్రీల నుండి 38.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి. 18 జిల్లాల్లో 37 డిగ్రీల పైబడి నమోదు కాగా, మిగిలిన అన్ని జిల్లాల్లో 35.1 డిగ్రీల నుండి 36.9 డిగ్రీల వరకూ రికార్డయ్యాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజెర్లలో రికార్డు స్థాయిలో 39.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక్కడే కని >>2



# చలికాలమూ మాయమేనా?

*ఎల్ నినో ధర్మమా అని వానల్లేకుండానే 'వర్షాకాలం' గడిచిపోయింది. ఇక శీతాకాలమూ అంతేనా? చలికి వణికే అవసరం లేకుండా ఎల్ నినో దానినీ మింగేస్తుందా! అవుననే అంటున్నారు వాతావరణ శాస్త్రజ్ఞులు.*

### ఈ యేడాది భారత్‌లో శీతాకాలం కనుమరుగు!
### గాడ్జిల్లా ఎల్‌నినో 2027 ఫిబ్రవరిదాకా కొనసాగే అవకాశం
### దేశంలో తీవ్రమైన కరవు పరిస్థితులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు18:** ఉష్ణమండల పసిఫిక్ అంతటా ఎల్ నినో వేగంగా బలపడింది. ఈ యేడాది చివర్లో ఇది చాలా బలమైన ప్రభావంగా మారే అవకాశం ఉందని, 2027 ఫిబ్రవరి వరకు ఇది కొనసాగేందుకు 100శాతం అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఒ) పేర్కొంది. ఈ హెచ్చరిక కేవలం కొనసాగింపునకు మాత్రమే పరిమితం కాదు. ప్రస్తుత ఉష్ణోగ్రతల పెరుగుదల ధోరణి ఈ యేడాది >>2



బ్రిటన్‌లోని బిజినెస్ స్కూళ్లకు చెందిన ప్రతినిధులు శుక్రవారం సిఎం రేవంత్‌తో భేటీ దృశ్యం

# ఆర్ఐ మృతి

>> చేసేందుకు ఉదయం ఆరు గంటల సమయంలో విధులు ముగియగానే హెడ్ క్వార్టర్స్‌కు వచ్చారు. అనంతరం రివాల్వర్‌ను సహచర సిబ్బంది సమక్షంలో శుభ్రం చేస్తుండగా అది ఒక్కసారిగా మిస్‌ఫైర్ అయ్యింది. ఈ ఘటనలో తల, మెడ భాగంలో తీవ్రంగా గాయపడ్డ సతీష్ అక్కడే కుప్పకూలిపోయారు. సహచరులు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించారు. 2009 బ్యాచ్ సాయుధ బల గం ఎస్ఐగా పోలీసుశాఖలో చేరిన సతీష్ స్వస్థలం ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం. ఆయనకు భార్య కుమారుడు, కుమార్తె వున్నారు. కాగా ఘటనా స్థలాన్ని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య సందర్శించారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదుచేసుకుని విచారణ చేబట్టారు. కాగా సతీష్ మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన మృతదేహానికి సాయంత్రం ఇల్లందులో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ఆర్ఐ సతీష్ మరణంపై అనుమానాలు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనది ఆత్మహత్యగా వార్తలు రాగా ఇది నిజం కాదని పోలీసు అధికారులు చెబుతున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు.

# సాయం చేయండి

>> అలాగే, తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్నిగుర్తించి రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్న ఆలోచనతో 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చెప్పారు. పిఎంఎవైజి పథకంలో భాగంగా మొదటి విడతగా రాష్ట్రానికి 2 లక్షల ఇండ్లను కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ అందుకు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతిపత్రం అందించిన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి గారిని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, అలాగే సన్న వడ్లకు రూ. 500 బోనస్‌ను అందించి ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

# వేడెక్కిన తెలంగాణం

>> ష్టంగా 32.1 డిగ్రీలు చోటు చేసుకోవడం విశేషం. ఇక హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని బాచుపల్లెలో 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలు, తేమ కారణంగా పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. వర్షాకాలంలో విద్యుత్ డిమాండ్ కొత్త శిఖరాలకు చేరింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17వ తేదీన 16,962 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగ్గా, 2390 మెగావాట్లను విద్యుత్ సంస్థలు ఎక్ఛేంజి నుండి కొనుగోలు చేశాయి. అదే శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు 16809 మెగావాట్లకు విద్యుత్ వినియోగం జరగ్గా, 3176 మెగావాట్లను రాష్ట్ర పంపిణీ సంస్థలు యూనిట్‌కు రూ.2.64 చొప్పున ఎక్ఛేంజిలో కొనుగోలు చేశాయి. హైదరాబాద్‌లో కూడా గరిష్ట విద్యుత్ డిమాండ్ 4022 మెగావాట్లకు చేరుకుంది. గత యేడాదితో పోలిస్తే గరిష్ట డిమాండ్ దాదాపు 600 మెగావాట్లు పెరిగినట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

# మసీదు వద్ద బాంబు పేలుడు

>> పదార్థాలతో ఉన్న ఒక కారు అక్కడి పోలీస్ లైన్స్ గేటు వద్దకు దూసుకువచ్చి పేలిపోయింది. ఈ పేలుడు తీవ్రత అధికంగా ఉండటంతో భారీగా ప్రాణ నష్టం జరిగింది. మొత్తం 20 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. మృతుల్లో ఐదుగురు పోలీసులు కూడా ఉన్నారు. మసీదు పక్కనే ఈ పేలుడు జరిగింది. దీంతో మసీదు కూడా భారీగా దెబ్బతిన్నది. మసీదుగోడలుకూడా కూలిపోయాయి. చుటుపక్కల భవనాలు కూడా దెబ్బతిన్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని కోహట్ జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మొత్తం 25 మంది వరకు గాయపడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని భద్రతా బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. ఈ ప్రాంతంలో ఇంకా ఎవరైనా దుండగులు ఉన్నారా అనే కోణంలో ప్రాంతం మొత్తాన్ని గాలిస్తున్నారు. రోడ్డు మార్గాన్ని పూర్తిగా మూసేసి, తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ పేలుడు ఎలా జరిగింది.. ఎవరు చేశారు.. కారణమేంటి అనే అంశాలపై విచారణ జరుగుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

# అసెంబ్లీ నిరవధిక వాయిదా

>> అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల టీషర్టులతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు. 50 ప్రశ్నలకు మంత్రుల నుంచి మౌఖిక సమాధానాలు వచ్చాయి. 9 స్టార్‌డ్ ప్రశ్నలకు సమాధానాలు, ఒక అన్‌స్టార్‌డ్ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సభలో సభ్యులు అడిగిన సప్లిమెంటరీ ప్రశ్నలు 86 వరకు నమోదు అయ్యాయి. సభలో సభ్యులు చేసిన ప్రసంగాలు 105, మంత్రులు 2 ప్రకటనలు చేశారు. నాలుగు స్వల్పకాలిక చర్చలకు ముఖ్యమంత్రి, మంత్రులు సమాధానాలు ఇచ్చారు.

# దానం నాగేందర్‌పై అనర్హత వేటు

>> కాంగ్రెస్ అభ్యర్థిగా బీఫామ్‌పై పోటీ చేశారు. బిఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని పార్టీ ఫిరాయింపుగా పేర్కొంటూ ఆయనపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ నేతలు, బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. దానం నాగేందర్‌తో పాటు పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. అనంతరం దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ తిరస్కరించారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దానం నాగేందర్ కాంగ్రెస్ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడమే ఆయన పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిరూపించే కీలక అంశమని పిటిషనర్లు వాదించారు. ఈ కేసులో హైకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పులో కీలక అంశాన్ని స్పష్టం చేసింది. కాంగ్రెస్ పార్టీ బీఫామ్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినప్పటి నుంచే దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హుడిగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. 2024లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన సమయం 2024 ఏప్రిల్ 23వ తేదీనుంచి దానం నాగేందర్‌పై అనర్హత వేటు వర్తించనుంది. స్పీకర్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం కాకపోవడంతో సిజె ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బిఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు.

**దానంపై అనర్హత వేటు వేసిన హైకోర్టు**

స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బిఆర్ఎస్‌కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసనసభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు. దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రిబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాని కోరారు. దానం ఇప్పటికీ బిఆర్ఎస్‌లోనే ఉన్నారని శాసనసభలోనూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజక వర్గ అభివృద్ధి కోసమే సిఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు ఖరారు చేసింది.

**మిగిలిన 8 మందిపైనా అనర్హతవేటు పడేవరకు పోరాటం: కెటిఆర్**

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలపైనా అనర్హత వేటు పడటం ఖాయమని ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బిఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

**కాంగ్రెస్ పార్టీ నేతలకు హరీశ్ రావు సవాల్**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీరును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. దానం నాగేందర్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ రక్షణ కల్పించారని మండిపడ్డారు. రాజ్యాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరి బయటపడిందని విమర్శించారు. నిబద్ధత ఉంటే ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. మరోసారి ప్రజల తీర్పు కోరాలంటూ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆయన సవాల్ విసిరారు.

**హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు గుణపాఠం, చెంపపెట్టు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర మంత్రి, బిజెపి నేత జి. కిషన్‌రెడ్డి స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్‌కు గుణపాఠం, చెంపపెట్టు వంటిదని ఆయన వ్యాఖ్యానించారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరడం ప్రజాభీష్టానికి వ్యతిరేకమని కిషన్‌రెడ్డి అన్నారు. దానం నాగేందర్ కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే పార్టీ మారారని పేర్కొన్నారు. ప్రజల తీర్పుతో ఒక పార్టీ తరఫున గెలిచిన తర్వాత.. మరో పార్టీలో చేరే విషయంలో ప్రజల అభిప్రాయాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకుని ప్రజాకోర్టులో సమాధానం చెప్పాలని సూచించారు.

# పోరాటం నాకు కొత్తేమీ కాదు: దానం

>> అనర్హత పిటిషన్ విషయంలో హైకోర్టు వెలువరించిన తీర్పుపై శుక్రవారం ఆయన నివాసం వద్ద మీడియాతో స్పందించారు. నాకు పోరాటం కొత్త కాదని, తప్పకుండా పోరాడి విజయం సాధిస్తానని అన్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని అన్నారు.

మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మళ్లీ పోరాడి గెలుస్తానని అన్నారు. ఎన్నికల్లో కొట్లాడటానికి తాను సిద్దంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. సుప్రీం కోర్టుకు వెళ్లే విషయంలో ఇంకా ఆలోచించలేదన్నారు. ఇక మళ్లీ ఎన్నికలు వస్తే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారంటూ ఒక మహిళా రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఎలాంటి సమాధానం చెప్పకుండానే వెళ్లిపోయారు. మరోవైపు దానంపై హైకోర్టు తీసుకున్న నిర్ణయంతో కాంగ్రెస్ శ్రేణులు పెద్దెత్తున ఆయన ఇంటి వద్దకు చేరుకున్నాయి. దానం తీసుకొనే నిర్ణయంతో తామంత వెంట ఉంటామని స్పష్టం చేశారు.

# సర్కార్‌కు రాసిచ్చేస్తా

>> భూమిని ప్రభుత్వానికే రాసిచ్చేస్తానని తెలిపారు. దళితుల భూములను కెసిఆర్ కబ్జా చేయలేదని తేలితే సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజీనామాకు సిద్ధమా అని ప్రశ్నించారు. మాపై రాజకీయ కక్షసాధింపు యాత్రలు మాని రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై దండయాత్ర చేయాలని హితవుపలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. గత మూడు నాలుగు రోజులుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహార శైలి చూస్తుంటే ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే అన్నట్లు ఉందన్నారు. ఏకంగా 30 లక్షల ఎకరాలను 22ఏలో పెడితే అవస్థలు పడుతున్నారని లక్షలాది కుటుంబాల సమస్యలు పరిష్కరించమని అడిగితే.... రేవంత్‌రెడ్డి రాచరిక పోకడలతో అహంకార ధోరణితో మమ్మల్ని ప్రశ్నిస్తారా అంటూ ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. 22ఏలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను బిఆర్ఎస్ లేవనెత్తిందో...సిఎం తమ్ముళ్ల భూ కుంభకోణాలను ఎప్పుడైతే బయటపెట్టిందో.. మంత్రి పొంగులేటి ఆయన కుమారుడు చేస్తున్న భూ దందాలను ఎప్పుడైతే ఎండగట్టిందో..అప్పుడే కుళ్లు బుద్ధితో కక్షకటి ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. ఎపి అక్రమంగా ప్రాజెక్టులు కడుతూ గోదావరి నీళ్లను ఎత్తుకుపోవాలని చూస్తుంటే సిడబ్ల్యుసిపై కాంగ్రెస్ ఎంపిలు దండయాత్ర చేయాలన్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ దగ్గర మోటార్లు ఆన్ చేసి రంగనాయకసాగర్‌లో నీళ్లు నింపమని సిఎంకు చెప్పాలని ఎంపి, ఎమ్మెల్సీల బృందానికి సూచించారు. రైతులు నీళ్లు అడిగితే...నీళ్లకు బదులు పోలీసులతో ప్రాజెక్టులను నింపుతున్నారని చెప్పాలన్నారు. ప్రభుత్వాలు వాస్తవాలను దాచిపెట్టినప్పుడు ప్రతిపక్షాలు నిజనిర్ధారణకు వెళ్తాయి కానీ అధికారంలో ఉండి ప్రభుత్వమే యాత్రలకు రావడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ఎంపిల బృందం సిద్దిపేటకు వస్తుందని పెద్ద హంగామా చేశారని...ఎవరూ వచ్చినా అతిథి మర్యాదలు చేయడం సిద్దిపేట సంస్కృతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా వారిని స్వాగతించి భోజనానికి ఆహ్వానించానని కావాలంటే దగ్గరుండి నేనే నా వ్యవసాయ భూమిని చూపిస్తానని అనుమానాలు నివృత్తి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌లో పడే ప్రసక్తే లేదని ఇక నుంచి ప్రజా సమస్యలపై మళ్లీ పోరాటం చేస్తామన్నారు. సిఎం పగబట్టి దండయాత్రలు చేసినా అక్రమ కేసులు పెట్టి బురద రాజకీయాలు చేసినా నిన్ను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. మా పోరాటం ఎప్పుడూ ప్రజల పక్షమేనని తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గుండు భూపేష్, రాజనర్సు, రాధాకృష్ణశర్మ, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

# భూకబ్జాలు బయటపెడతాం

>> చిన భూమిలోంచి సుడాకు 10 ఏకరాలు ఏలా కేటాయిస్తారని ప్రశ్నించారు. సుడా పార్కు పక్కనే హరీష్‌రావు 13 ఏకరాల12 గుంటల స్థలం కొనుగోలు చేసి ఫాం హౌస్ నిర్మించుకున్నారని తెలిపారు. రంగనాయకసాగర్‌లో భూ నిర్వాసితులకు ఏకరాకు రూ.6 లక్షల నుంచి రూ.13 లక్షలు చెల్లించిన ప్రభుత్వం హరీష్‌రావు కొనుగోలు చేసిన భూమికి ఏకరాకు రూ.2 లక్షలు చెల్లించడం వెనుక అంతర్యమేమిటన్నారు. పక్కనే రంగనాయకసాగర్ పెట్టుకొని రైతులు రూ.6 లక్షల నుంచి రూ.13 లక్షలకు ఇవ్వాల్సిన భూమికి హరీష్‌రావు కేవలం రెండు లక్షలు చెల్లించడం పై ఈడి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

హరీష్‌రావు హౌస్ పక్కనే సుడా పార్కు ఎందుకు నిర్మించారని ఇక్కడికి ఎవరు వస్తారని ప్రశ్నించారు. దీనికి తోడు ఎలాంటి టెండర్ పిలువకుండా ఫాం హౌస్‌కు రూ.5 కోట్ల 33 లక్షలతో బిటి రోడ్డు నిర్మించుకున్నారని తెలిపారు. బిటి రోడ్డు నిర్మాణం ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో చేయించడం విచిత్రంగాఉందన్నారు. బిఆర్ఎస్ నాయకుల అవినీతి తెలంగాణసమాజానికి తెలియల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం బిఆర్ఎస్ నాయకుల అవినీతి మూలంగానే అప్పులపాలైందన్నారు.

## వారం - వర్జ్యం

19-09-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి.అష్టమి మ.3.27, న.మూల రా.1.42
వ.రా.11.55 - రా.1.42
దు.తె.5.55 - ఉ.7.32
రాహు.ఉ.9.00 - ఉ.10.30
శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** గౌరవనీయ స్థానాలలోని వారితో సాన్నిహిత్యం ఏర్పడుతుంది.ఇతరుల నుండి వాగ్దానాలను తీసుకుంటారు.

**వృషభం :** ధైర్యసాహసాలను కనబరుస్తారు. దృఢసంకల్పంతో అడుగులు ముందుకు వేస్తారు.ఉన్నతాధికారుల మెప్పును సాధిస్తారు.

**మిథునం :** న్యాయ వ్యవహారాలు, కోర్టు తీర్పులు అనుకూలం. ధన వ్యయాన్ని కలిగి ఉంటారు. కీళ్లనొప్పులు బాధించే సూచనలు.

**కర్కాటకం :** బదిలీ సూచనలు. అధికంగా శ్రమిస్తారు. మానసిక వత్తిడిని కలిగి ఉంటారు.సంతాన పురోభివృద్ధి బాగుంటుంది.

**సింహం :** వైరివర్గాన్ని ఇరకాటంలో పెట్టగలుగుతారు. మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి.

**కన్య :** ఆనందోత్సాహాలతో కాలాన్ని గడుపుతారు. కరస్పాండెన్స్ విషయంలో జాగ్రత్తలు అవసరం. చర్చాగోష్ఠులను సాగిస్తారు.

**తుల :** కొద్దిపాటి పెట్టుబడితో అధిక లాభాలు కలిగే తాత్కాలిక వ్యాపారాలపైన దృష్టిని సారిస్తారు. మరుపు ఎక్కువగా ఉంటుంది.

**వృశ్చికం :** మీ ఆలోచనలు మెరుగ్గా, చురుగ్గా ఉంటాయి. అవకాశవాదులతోటి జాగ్రత్తగా మెలగండి.దైవ దర్శనం చేసుకుంటారు.

**ధనుస్సు :** ముఖ్యవిషయాలలో రాజీ ధోరణిని కనబరుస్తారు. మీ మేధస్సు పలువురి ప్రశంసలను అందుకుంటుంది.

**మకరం :** ఇష్టంలేని వారికి దూరంగా ఉంటారే తప్ప వివాదాలకు పోరు. మీ వైఖరికి భిన్నంగా వ్యవహరిస్తారు.

**కుంభం :** వ్యాపార పరంగా మీ వ్యూహాలు, అంచనాలు ఊహలకు అనుగుణంగా ఉంటాయి. వ్యాపారాలలో మార్పులు.

**మీనం :** ఒకానొక సందర్భంలో మంచికి పోయి చెడ్డవారవుతారు. స్వగృహ యోగ సూచన. పనిభారం అధికంగా ఉంటుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం ముంబయిలో మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్ నివాసంలోని గణేశుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

# చలికాలమూ మాయమేనా?

>> చివరి వరకు కొనసాగితే, ఆధునిక పర్యవేక్షణ ప్రారంభమైనప్పటి నుండి గమనించిన అత్యంత శక్తివంతమైన ఎల్ నినోగా ఇది మారే అవకాశం ఉందని డబ్ల్యూఎంఒ అధికారులు తెలిపారు. ఈ తాజా సమాచారం ప్రకారం, అసాధారణంగా వేడిగా ఉన్న సముద్ర పరిస్థితులు ఎల్ నినో మరింత బలపడటానికి దోహదపడుతున్నాయని, దీని వాతావరణ ప్రభావాలు 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆ సంస్థ పేర్కొంది.

**వేడెక్కుతున్న పసిఫిక్ మహాసముద్రం:**

ఎల్ నినో ప్రభావంతో మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ అంతటా నీరు అసాధారణంగా వేడెక్కుతుంది, దీనితో పాటు వాతావరణంలో మార్పులు సంభవిస్తాయి. ఆ మార్పులు వర్షపాతం, ఉష్ణోగ్రత నమూనాలను పసిఫిక్‌కు చాలా దూరంగా మార్చగలవు. ఈ సంఘటన ఎంత అసాధారణమైనదో సముద్రం ఇప్పటికే చూపిస్తోంది. ఎల్ నినోను పర్యవేక్షించడానికి ఉపయోగించే కీలక ప్రాంతమైన నినో 3.4 ప్రాంతం, మే నుండి జులై 2026 వరకు సగటు కంటే 1.5శాతం సెంటిగ్రేడ్‌లు ఎక్కువ వేడిగా, జులైలో సగటు కంటే 2 సెంటిగ్రేడ్‌లు ఎక్కువగా ఉంది. ఆ తర్వాత జులై చివరిలో, ఆగస్టు మధ్యలో వారపు విలువలు సగటు కంటే సుమారుగా 2.2 సెంటిగ్రేడ్‌లు నుండి 2.6 సెంటిగ్రేడ్‌లు వరకు పెరిగాయి. సముద్ర ఉపరితలం కింద ఉన్న వేడి మరింత ఆందోళనకరంగా ఉంది. ఉష్ణమండల పసిఫిక్‌లోని కొన్ని ప్రాంతాలలో, జూలై, ఆగస్టు ప్రారంభంలో సముద్ర ఉపరితలం కింద ఉష్ణోగ్రతలు సగటు కంటే 8సెంటిగ్రేడ్‌లు కంటే ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితులన్నీ కలిసి ఎల్ నినో మరింత బలపడటానికి ఆస్కారం కల్పిస్తున్నాయి. ఎంతగా అంటే, 2026 చివరి నాటికి ఇది అత్యంత తీవ్ర స్థాయికి చేరుకుంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేస్తోంది. ఈ వేడెక్కే స్థాయి ఇప్పటికే ప్రస్తుత సంఘటనను ఒక అరుదైన స్థితిలో ఉంచుతోంది. ప్రపంచ వాతావరణ సంస్థ ప్రకారం, 1950 నుండి ఉన్న రికార్డులలో "చాలా బలమైన్న వర్గంలోకి వచ్చే కేవలం నాలుగు ఎల్ నినో సంఘటనలలో ఇది ఒకటి.

అభివృద్ధి చెందుతున్న ఈ వాతావరణ సరళి, 2026- 27లో భారతదేశంలో బలహీనమైన శీతాకాలం ఉండవచ్చా అనే ప్రశ్నలను లేవనెత్తింది. బలమైన ఎల్ నినో వాతావరణ ప్రసరణను మార్చగలదు. ప్రపంచంలోని సుదూర ప్రాంతాలలో ఉష్ణోగ్రత, వర్షపాత సరళిని మార్చగలదు. డబ్ల్యుఎంఒ తాజా కాలానుగుణ అంచనా ప్రకారం, 2026 సెప్టెంబరు - నవంబరు మధ్య దాదాపు అన్ని భూభాగాలలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే విస్తృత ప్రమాదం ఉంది.

**భారత్‌లో విభిన్న వాతావరణం:**

బలపడుతున్న ఎల్ నినో భారతదేశానికి ప్రత్యేకంగా ముఖ్యమైనది, ఎందుకంటే పసిఫిక్ మహాసముద్ర పరిస్థితులలో మార్పులు పెద్దస్థాయి వాతావరణ ప్రసరణను, దేశ వర్షపాత సరళిని ప్రభావితం చేయగలవు. సెప్టెంబరు- నవంబరు కాలంలో సానుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువం (ఐఒడి) అభివృద్ధి చెందుతుందని కూడా డబ్ల్యుఎంఒ నొక్కి చెప్పింది. 2026 సెప్టెంబరు- అక్టోబరు- నవంబరు నెలల్లో దీని కాలానుగుణ సగటు ఉష్ణోగ్రత సుమారు 0.9సెంటిగ్రేడ్‌లగా ఉంటుందని అంచనా. అదే సమయంలో, ఉష్ణమండల అట్లాంటిక్‌లోని కొన్ని ప్రాంతాలు కూడా సాధారణం కంటే వెచ్చగా ఉండే అవకాశం ఉంది.

**భారత్‌లో తీవ్రమైన కరవు పరిస్థితులు**

ఎల్ నినో అన్నిచోట్లా ఒకే రకమైన వాతావరణాన్ని సృష్టించదు, దాని బలం మాత్రమే ఒక నిర్దిష్ట దేశం ఎంత తీవ్రంగా ప్రభావితమవుతుందో నిర్ణయించలేదు. అయితే, భారతదేశానికి ఇది ఒక ముఖ్యమైన వాతావరణ సంకేతం, ఎందుకంటే ఎల్ నినో నైరుతి రుతుపవనాలను ప్రభావితం చేసి పొడి పరిస్థితులను తీసుకురాగలదు. చారిత్రాత్మకంగా, ఎల్ నినో తరచుగా బలహీనమైన రుతుపవన వర్షపాతంతో ముడిపడి ఉంటుంది, అయినప్పటికీ ఈ సంబంధం సంపూర్ణం కాదు. ఇతర కారకాలు ఫలితాన్ని మార్చగలవు. భారత వాతావరణ శాఖ (ఐఎండి) 2026లో భారతదేశ రుతుపవనాలు సాధారణం కంటే తక్కువగా ఉంటాయని ఇప్పటికే అంచనా వేసింది. ఇప్పటివరకు అలాగే ఉంది. తన నవీకరించిన మే నెల అంచనాలో, ఐఎండి రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటులో 90శాతం ఉంటుందని, వర్షపాతం లోటుకు 60శాతం సంభావ్యత ఉంటుందని అంచనా వేసింది. ఈ నిరాశాజనకమైన అంచనాలకు అనుగుణంగా, భారతదేశం ఆగస్టు నెలాఖరుకు 16శాతం వర్షపాత లోటును ఎదుర్కొంది. ఇది చాలదన్నట్లు, సెప్టెంబర్- నవంబర్ నెలల్లో దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని డబ్ల్యుఎంఒ తాజా అంచనా సూచిస్తోంది. అలాగే, వర్షపాత సరళి ప్రాంతాన్ని బట్టి మారుతుందని హెచ్చరిస్తోంది. అనుకూల హిందూ మహాసముద్ర ద్విధ్రువం (ఐఒడి) కూడా ఏర్పడుతుందని అంచనా వేస్తున్నారు. ఇది భారతదేశంపై ఎల్ నినో సాధారణ ప్రభావాలను మార్చగల అవకాశం ఉంది.

# ప్రతి ఇంచు రాసిస్తాం : కెటిఆర్

>> కోట్లవిలువైన భూములు ఉన్నాయంటూ చేస్తున్న ప్రచారంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన సవాల్ విసిరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ పేరుతో ఉన్న ఆస్తులన్నింటినీ రాసిస్తామని, రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాల్లో రూ.లక్ష కోట్లు వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సిఎం రేవంత్.. నువ్వు చేసిన ఆరోపణల్లో ఒక్కటంటే ఒక్క శాతం నిజం లేకపోయినా.. నీకు ఓ ఆఫర్ ఇస్తున్నా. మా కుటుంబానికి లక్ష కోట్ల భూములంటూ పనిగట్టుకుని చేస్తున్న విషప్రచారంపై నీకు ఓ సవాల్ విసురుతున్నా. మాకున్న ఆస్తులన్నీ రాసిస్తాం.. రాష్ట్రంలోని పేద ప్రజల ఖాతాలో రూ.లక్ష కోట్లు వేస్తావా? అని కెటిఆర్ ప్రశ్నించారు. తెలంగాణలోని పేద ప్రజల ఖాతాల్లో వెంటనే రూ.లక్ష కోట్లు వేస్తానంటే తమ పేరుతో ఉన్న ప్రతి ఇంచు భూమిని రాసిస్తామని కెటిఆర్ పేర్కొన్నారు. అలా చేయలేకపోతే తనపై చేస్తున్న ప్రచారాన్ని ఇకనైనా ఆపి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీ పిచ్చి ప్రచారాన్ని ఇకనైనా మానుకుని వెంటనే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పు అని అన్నారు. కెసిఆర్ కుటుంబానికి వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇంతకాలం చేసిన ప్రచారం బెడిసికొట్టడంతో ఇప్పుడు లక్ష కోట్ల భూములంటూ కొత్త ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కెసిఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఉన్నది కేవలం 67 ఎకరాలు మాత్రమేనని రేవంత్‌రెడ్డే అసెంబ్లీలో స్వయంగా ఒప్పుకున్నారని పేర్కొన్నారు. అలాంటప్పుడు మళ్లీ కుతంత్రాలతో కట్టుకథలు అల్లుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ ప్రభుత్వం
**కల్వకుర్తి :: మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం**
**నాగర్‌కర్నూల్ జిల్లా**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ ప్రకటన నం. E1/KLKY/టెండర్ ప్రకటన-10/2026-27, తేది: 18.09.2026

కల్వకుర్తి మునిసిపాలిటీ కమిషనర్ ఆదేశాల ప్రకారం, ఆ మునిసిపాలిటీలో సాధారణ నిధులతో వివిధ పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్ పిలవబడుతోంది. క్ర.సం.1, పని పేరు: సాధారణ నిధి 2026-27 క్రింద, కల్వకుర్తి మునిసిపాలిటీలో గణేష్ విగ్రహ నిమజ్జనానికి సిలారపల్లి రోడ్ ఈదుల్ చెరువు వద్ద ఏర్పాటు. అంచనా మొత్తం (లక్షలలో): 8.00 లక్షలు. 1) మొత్తం పనులు: 1 నం. 2) అంచనా విలువ: రూ.8.00 లక్షలు. 3) బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 18.09.2026 సా.04.00 గం. 4) బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 19.09.2026 సా.04.00 గం. వర్క్ తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ "www.eprocurement.gov.in" వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి: కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం. 9110540243, 7330690590.

సం/- కమిషనర్, కల్వకుర్తి మునిసిపాలిటీ

DIPR.No.10189-PP/CL/Advt/1/2026-27, తేది: 18.09.2026

తెలంగాణ ప్రభుత్వం
**మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
ఆసక్తి వ్యక్తీకరణ

E2/4670/EOI/2026 తేది: 17.09.2026

మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ వారు, క్రింది ఐటమ్‌లకు అంచనాల తయారీ నిమిత్తం ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వానిస్తున్నారు.

ఫైల్ నం. E2/4670/EOI.2026

| క్ర. సం. | ఐటమ్ యొక్క వివరణ | పరిమాణం-యూనిట్ |
| --- | --- | --- |
| 1 | టాటా సిగ్నా 2823TC (Reg No: TG08T8162) కొరకు వార్షిక నిర్వహణ మరియు సాధారణ సర్వీసింగ్ (25000 లీటర్‌ల నీటి ట్యాంకర్ టిప్పర్) ఇవికలిపి: ఆయిల్ ఫిల్టర్ ఇంజిన్ ఆయిల్ మరియు ఫిల్టర్‌ల రిప్లేస్‌మెంట్, జనరల్ సర్వీసింగ్ మరియు ఇతర అవసరమైన స్పేర్ భాగాల రిప్లేస్‌మెంట్, లేబర్ ఛార్జీలు మరియు ఇతరములు. | 1వ జనరల్ సర్వీస్ షెడ్యూల్ 1 నం. |
| 2 | నీటి ట్యాంకర్ ట్రాక్టర్‌ల కొరకు, వార్షిక నిర్వహణ మరియు సాధారణ సర్వీసింగ్) (ఇవి కలిపి: మహీంద్రా ఎమ్‌స్టార్ క్లాసిక్ OIB5, మహీంద్రా ఎమ్‌స్టార్ సూపర్ 7.5 కెనోపీ, ఆయిల్ మరియు ఇంధన ఫిల్టర్ కొరకు కిట్, సర్వీస్ 0.5 కెజి కొరకు గ్రీజ్,ఎమ్‌స్టార్ కూల్- 1 లీటర్, రింగ్ V గ్రూవ్, కాటన్ వేస్ట్, వాషర్ కాపర్, లేబర్ ఛార్జీలు). | 1 నం. |
| 3 | టాటా సిగ్నా 2823TC (Reg No: TG08T8162) కొరకు 90 Ah to 100 Ah బ్యాటరీ (అమరాన్, ఎక్సైడ్) (25000 లీటర్‌ల నీటి ట్యాంకర్ టిప్పర్) | 1 నం. |

ఆసక్తి గల పేరొందిన మరియు అనుభవంగల, ఇటువంటి ప్రభుత్వ/సంస్థాగత భవనాలు కొరకు DPRల తయారీలో నైపుణ్యంగల కన్సల్టెన్సీ సంస్థలు/ఏజన్సీలు వారి సాంకేతిక మరియు ఆర్థిక బిడ్‌ను వివరాలతో సహా దాఖలు చేయవచ్చును (సీల్డ్ కొటేషన్లలో) అన్ని వివరాలు, మునిసిపల్ కమిషనర్ వారి కార్యాలయం, మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్‌కు 25.09.2026న మ.3.00గం. (లేదా) ముందు తప్పక చేరేటట్లుగా పంపవలెను. మరియు అవి అదే రోజున మ.3.30గం. వద్ద తెరువబడును. ఎటువంటి కారణాలు చెప్పనక్కర్లేకుండానే మునిసిపల్ కమిషనర్ ప్రతిపాదనలు అంగీకరించటానికి లేదా తిరస్కరించే హక్కు కలిగివున్నారు. ఆసక్తి గల కొటేషన్‌లు తదుపరి వివరాల కొరకు 9705710924 సంప్రదించవచ్చును.

సం/-. కమిషనర్, మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్.

DIPR.NO. 10214-PP/CL/ADVT/1/2026-27 తేది: 18.09.2026


బిఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్‌ను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

## బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్ అరెస్ట్

### తలుపులు బద్దలుకొట్టి ఎత్తుకెళ్లడంతో అడ్డుకున్న న్యాయవాదులు, బిఆర్ఎస్ యువనేతలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో బిఆర్ఎస్ అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిషాంక్‌ను శుక్రవారం పికెట్, కృష్ణానగర్‌కాలనీలో నివాసం ఉంటున్న ఆయన ఇంటిపై పోలీసులు దాడులు నిర్వహించి గేట్లు, తలుపులు బద్ధలుకొట్టి ఎత్తుకెళ్లారు. పోలీసులు తమను అరెస్ట్ చేసేందుకు వస్తారన్న విషయాన్ని తెలుసుకొని క్రిషాంక్ తమ ఇంటి గేట్‌కు, తలుపులకు తాళాలు వేసుకొని ఇంట్లోనే ఉండిపోయాడు. ఈ నెల 14న సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేటిఆర్ పిఎ, పిఆర్ఒ, క్రిషాంక్‌పై నమోదయిన కేసు విషయంలో ఎక్స్‌లో వివాదాస్పద పోస్ట్ చేయడంతో క్రిషాంక్‌పై కేసు నమోదు అయింది. దీంతో అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులను అడ్డుకునేందుకు న్యాయవాదులు, బిఆర్ఎస్ యువ నాయకులు అడ్డుకోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయన ఇంటివద్ద ఉత్కంఠ పరిస్థితి నెలకొంది. సిసిఎస్ ఎసిపి రామ్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు ఆయన ఇంటిపై దాడులు జరిపి క్రిషాంక్‌ను అదుపులోకి తీసుకున్నారు. క్రిషాంక్‌ను పోలీసులు దౌర్జన్యంగా తీసుకెళ్తుండగా ఆయన తరుపున వచ్చిన న్యాయవాదులు, బిఆర్ఎస్ యువ నేతలు పోలీసుల అనుసరించిన తీరును ఎండగట్టారు.

## వైఎస్ జగన్ యూరప్ పర్యటనకు నాంపల్లి సిబిఐ కోర్టు అనుమతి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎపి మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై.ఎస్ జగన్ యూరప్ పర్యటనకు నాంపల్లి సిబిఐ కోర్టు శుక్రవారం నాడు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. వచ్చే అక్టోబరు ఒకటవ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ మధ్య కాలంలో 15 రోజుల పాటు జగన్ యూరప్ దేశాలలో పర్యటించేందుకు సిబిఐ కోర్టు అనుమతి నిచ్చింది. తన పర్యటనకు అనుమతి కోరుతూ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సిబిఐ కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## గంజాయి సాగుచేస్తున్న వ్యక్తి అరెస్ట్

### రూ.3 లక్షల విలువైన 30 గంజాయి మొక్కలు స్వాధీనం

**తిర్యాని, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని గుడిపేట గ్రామ శివారులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెబ్బెన సీఐ సంజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం తిర్యాని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెబ్బెన సీఐ సంజయ్ కుమార్ మాట్లాడుతూ గంజాయి అక్రమ సాగుపై తిర్యాని పోలీసులు చేపట్టిన చర్యల్లో భాగంగా గిన్నేధరి గ్రామానికి చెందిన కొడప రవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మండలంలోని గుడిపేట గ్రామ శివారులో నిందితుడికి చెందిన పత్తి చేనులో తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఈ తనిఖీల్లో అక్రమంగా సాగు చేస్తున్న 30 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు.నిందితుడిపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందన్నారు. గంజాయి అక్రమ సాగు, విక్రయం, రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ప్రజలు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గంజాయి అక్రమ సాగు లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.



## ట్రాన్స్‌కో ఉద్యోగి కుటుంబానికి రూ.1 కోటి బీమా చెక్కు

### అందజేసిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన తెలంగాణ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఉద్యోగి మహమ్మద్ ముజాహిద్ కుటుంబానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రూ.1 కోటి ప్రమాద బీమా చెక్కును అందజేశారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో శుక్రవారం మృతుడి తల్లి (నామిని)కి ఈ పరిహారాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అందజేశారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ముజాహిద్ (26) 2025 నవంబర్ 5న నైట్ షిఫ్ట్ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జరిగినరోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద బీమా పథకంలో భాగంగా బాధితుడి కుటుంబ సభ్యులు 2026 ఫిబ్రవరిలో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. శాఖాపరమైన ప్రక్రియ వేగవంతం చేసి, ఆగస్టు 20న రూ.1 కోటి పరిహారాన్ని మృతుడి తల్లి ఖాతాకు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు.

# నిషేధిత భూములు 'పట్టా'లెక్కితే ఎలా?

### భూముల ప్రస్తుత స్థితిపై రెవెన్యూ అధికారుల ఆరా

### చౌటుప్పల్ పరిధిలోని భూరికార్డులపై అనుమానాలు

### 22ఎలోని భూములు ఆ జాబితాలో ఎన్ని ఉన్నాయో తేలాలి

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** యాదాద్రి భువనగిరి జిల్లాలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గతంలో నిషేధిత జాబితాలో ఉన్నట్లు నమోదైన కొన్ని భూము లు ప్రస్తుతం పట్టా భూములుగా రికార్డుల్లో కనిపిస్తున్నాయన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా చౌటుప్పల్ పరిధిలోని కొన్ని భూముల రికార్డులపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పాత 22ఏ జాబితా, సిట్ దర్యాప్తు రికార్డులు, భూభారతి వివరాలు, ప్రస్తుత పట్టాదారు రికార్డులను సర్వే నంబర్ వారీగా పోల్చి చూడాల్సిన అవసరం ఏర్పడింది.

ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ స్థాయిలో సమాచారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో గతంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల ప్రస్తుత స్థితిపై రెవెన్యూ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఏ భూములు 22ఏ నుంచి తొలగించబడ్డాయి, ఏ భూములు ప్రస్తుతం పట్టా భూములుగా నమోదయ్యాయి, ఆ మార్పులకు ఏ ఉత్తర్వులు ఆధారమయ్యాయి అన్నది అధికారిక రికార్డుల పరిశీలనతోనే తేలాల్సి ఉంది.

**సిట్ రికార్డుల్లో ఉన్న భూముల సంగతేంటి?**

గతంలో భూ వివాదాలు, ప్రభుత్వ భూములు, ఇతర అంశాలకు సంబంధించి దర్యాప్తు పరిధిలోకి వచ్చిన భూముల్లో కొన్ని 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పుడు అలాంటి భూముల్లో ఎన్ని 22ఏలో కొనసాగుతున్నాయి? ఎన్ని తొలగించ బడ్డాయి? తొలగించిన వాటిలో ఎన్ని పట్టా భూములుగా నమోద య్యాయి? అన్నదే కీలక ప్రశ్నగా మారింది. ఒక భూమి నిషేధిత జాబితా నుంచి బయటకు వచ్చి పట్టా రికార్డులోకి మారినట్లయితే.. ఆ మార్పు వెనుక ఉన్న పూర్తి ప్రక్రియను పరిశీలించాల్సి ఉంటుంది. తొలగింపునకు కారణం ఏమిటి? ఏ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు? ఉత్తర్వు సంఖ్య ఏమిటి? కోర్టు ఆదేశాలున్నాయా? ప్రభుత్వ భూమి వర్గీకరణలో ఏమైనా మార్పు జరిగిందా? సర్వే నంబర్‌కు ఉపవిభాగం ఏర్పాటు చేశారా? విస్తీర్ణంలో మార్పు జరిగిందా? వంటి అంశాలు కీలకం కానున్నాయి.

**చౌటుప్పల్‌పై ప్రత్యేక దృష్టి..**

ఈ వ్యవహారంలో చౌటుప్పల్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. గతంలో 22ఏ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్న కొన్ని భూములు ప్రస్తుతం పట్టా భూములుగా కనిపిస్తున్నాయన్న ఆరోపణలు రావడంతో అక్కడి రికార్డులపై సమగ్ర పరిశీలన అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుతం ఏయే సర్వే నంబర్లలో ఇలాంటి మార్పులు జరిగాయన్నది అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. చౌటుప్పల్ పరిధిలో 22ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన వివాదాలు గతంలో న్యాయస్థానాల దృష్టికి వెళ్లిన సందర్భాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో పాత న్యాయ, రెవెన్యూ రికార్డులను ప్రస్తుత భూభారతి వివరాలతో పోల్చితే మార్పుల వెనుక ఉన్న అసలు పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ఒక్కో సర్వే నంబర్‌పై పూర్తి 'రికార్డు ఆడిట్'**

భూముల స్థితిగతులపై అనుమానాలు నివృత్తి కావాలంటే సాధారణ పరిశీలన సరిపోదని, ఒక్కో సర్వే నంబర్‌పై పూర్తి స్థాయి రికార్డు ఆడిట్ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్, ఉపవిభాగం, మొత్తం విస్తీర్ణం, భూమి వర్గీకరణ, అప్పటి పట్టాదారు పేరు, 22ఏలో చేర్చిన కారణం, జాబితా నుంచి తొలగించిన తేదీ, తొలగింపునకు ఆధారమైన ఉత్తర్వు, కోర్టు ఆదేశాలు, సంబంధిత అధికారి వివరాలు, ప్రస్తుతం భూభారతిలో నమోదైన స్థితి.. ఇలా ప్రతి అంశాన్ని ఒకదానితో ఒకటి సరిపోల్చితేనే రికార్డుల్లో అసలు మార్పులు ఎక్కడ చోటు చేసుకున్నాయో గుర్తించే అవకాశం ఉంటుంది.

# పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణతో రూ. 90 కోట్ల ఆదా

### ఇతర పెండింగ్ అంశాలపై డిజిపి సివి ఆనంద్ సమీక్ష

### వచ్చే నెలలో హైదరాబాద్‌లో దక్షిణాది డిజిపిల సదస్సు

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో సిబ్బంది పునర్ వ్యవస్థీకరణతోపాటు పెండింగ్‌లో వున్న ఇతర అంశాలపై డిజిపి ఆనంద్ శుక్రవారం ఉన్నతాధికారులతో తన కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి అనేక అంశాల పై ఉన్నతాధికారులతో లోతుగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది పునర్ వ్యవస్థీకరణ వల్ల 376 మంది సిబ్బంది ఇతర విభాగాల్లో విధుల్లో చేరారని, దీంతోపాటు 103 వాహనాలు కూడా అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పలు విభాగాల ఉన్నతాధికారుల వద్ద పనిచేసిన 376 మంది సిబ్బంది, కొంతకాలంగా ఉన్నతాధికారులు పదవీవిరమణ చేసినా అక్కడే వున్నారని, వీరిని అక్కడి నుంచి ఇతర విభాగాలకు బదలీ చేసినట్లు ఆయన తెలిపారు. దీనివల్ల సర్కారుకు 90 కోట్ల రూపాయల ఆదా అయ్యిందని ఆయన అన్నారు. దీంతో పాటు గ్రే హౌండ్స్, ఎస్ఐబి ఆక్టోపస్ విభాగాల సిబ్బందికి ఇంతకాలం చెల్లించిన 60 శాతం అదనపు వేతనాల చెల్లింపులను ఉపసంహ రించడం వల్ల మరో 28.16 కోట్ల రూపాయలు సర్కారుకు ఆదా అయ్యిందని డిజిపి తెలిపారు. ఈ మూడు విభాగాల సిబ్బందిని అందుబాటులో వున్న ఇతర విభాగాలకు బదిలీ చేశామని ఆయన అన్నారు. వచ్చే అక్టోబరు నెలలో హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల డిజిపిల సదస్సు జరగనుందని, ఇందులో సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ కట్టడికి అనుసరిం చాల్సిన వ్యూహాలు, వామపక్ష తీవ్రవాదం, వ్యవస్థీకృత నేరాలు, తీర ప్రాంత భద్రత, కొత్త తరహా నేరాల నివారణను అనుసరించాల్సిన పద్దతులపై చర్చిస్తామని ఆయన తెలిపారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం కోస ం పిట్ కాప్ అమలు చేయనున్నట్లు డిజిపి తెలిపారు. ఇం దులో పోలీసు సిబ్బందికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు అందేలా చేస్తామని ఆయన తెలిపా రు. సిబ్బందికి అవసరమైన వైద్య సహాయం అందజేస్తామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఐజి అంతకు పైస్థాయి పోస్టులు 48 వుండగా ఇందులో 24 పోస్టులు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో వున్నాయని డిజిపి అన్నారు. డిఐజి పోస్టులు 11 వుండగా భవిష్యత్తులో మ రో పది పోస్టులు వచ్చే వీలుందని ఆయన తెలిపారు. దీంతో పాటు 1991, 1995, 1996 బ్యాచ్ అధికారుల పదోన్నతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో హోంగార్డుల కొరత, పోలీసు భర్తీల ప్రక్రియ, ఐపిఎస్ అధికారుల నూతన సంఘం ఏర్పాటు, క్యూర్ ఏరియా కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమాలు తదిత ర అంశాలపైనా చర్చించారు. దీంతోపాటు అక్టోబరు 21వ తేదీన నిర్వహిం చనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చేబట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


శుక్రవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డిజిపి సివి ఆనంద్

# నాంపల్లి కోర్టుకు హాజరైన కెటిఆర్, అర్వింద్, మరో ఇద్దరు

### ఫార్ములా ఇ-కార్ రేస్ కేసు

### తదుపరి విచారణ అక్టోబరు 30కి వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో రెండుసార్లు జరిగిన ఫార్ములా ఈ కార్ రేసులో అక్రమాలు జరిగాయని ఎ సిబి నమోదు చేసిన కేసుకు సంబంధించి బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కెటిఆర్‌తోపాటు నాటి హెచ్ఎండిఎ కార్యదర్శి అర్వింద్ కుమార్, చీఫ్ ఇంజినీర్ బిఎల్ఎన్ రెడ్డి శుక్రవారం నాంపల్లి కోర్టుకు విచారణ నిమిత్తం హాజరయ్యారు. 2024 డిసెంబరు 19వ తేదీన దీనిపై ఎసిబి కేసు నమోదు చేయడం తెలిసిందే. ఫార్ములా ఈ కార్ రేసు వల్ల సర్కారు ఖజానా నుంచి 54.89 కోట్ల రూపాయలు నిబంధనలకు విరుద్ధంగా లండన్ లోని విదేశీ బ్యాంకుకు వెళ్లాయని ఎసిబి తేల్చింది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో కెటిఆర్, అర్వింద్‌కుమార్, బిఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్‌టంట్ మల్లేశ్వరరావులపై ఎసిబి అధికారులు కోర్టుకు ఛార్జిషీట్ సమర్పించారు. ఇదే సమయంలో వీరిని పలుమార్లు ఎసిబి అధికారులు విచారించారు. దీని తరువాత నాంపల్లి ఎసిబి కోర్టులో కొనసాగుతున్న విచారణకు కెటిఆర్‌తో పాటు మిగతా ఇద్దరు పలుమార్లు హా జరయ్యారు. గత వాయిదాకు కెటిఆర్ హాజరు కాలేదు. దీంతో శుక్రవారం నాడు కెటిఆర్ తన న్యాయవాదులతో కలిసి కోర్టుకు రాగా అర్వింద్ కుమార్, బిఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్‌టంట్ మల్లేశ్వరరావు వేరుగా వచ్చారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం తదుపరి విచారణను అక్టోబరు 30వ తేదీకి వాయిదా వేసింది.

**సర్కారు కేసులకు భయపడేది లేదు..**

**రూ. వెయ్యి కోట్లిస్తే ఆస్తంతా రాసిస్తా: కెటిఆర్ వెల్లడి**

ఇదిలా ఉండగా ఫార్ములా ఇ-కార్ రేసులో ఏమీ లేదని, అయితే సర్కారు కావాలని తనతోపాటు మరికొందరిపై లేనిపోని కేసులు నమోదు చేస్తూ వేధిస్తోందని కెటిఆర్ తెలిపారు. కోర్టుకు విచారణ నిమిత్తం హాజరైన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ నేతలపై సర్కారు కక్ష పూరితంగా వ్యవహ రించడంపైనా ఆయన మండిపడ్డారు. ఎన్ని కేసు లు నమోదు చేసినా బెదిరేది లేదని ఆయన వెల్లడించారు. తనకు, తన కుటుంబానికి లక్ష కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కెటిఆర్ అన్నా రు. వెయ్యి కోట్ల రూపాయలు తనకు ఇస్తే ఈ ఆస్తులను తాను సర్కా రుకు ఇచ్చేస్తానని, మిగిలిన ఆస్తులను ప్రభుత్వం అమ్మేసి ఆ డబ్బులతో సంక్షేమ పథకాలను అమలు చేయవచ్చని ఆయన తెలిపారు.

## కీసర ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఇళ్లలో 21 లక్షల నగదు, భారీగా నగలు, స్థిరచరాస్తుల పత్రాలు జప్తు

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పౌర సరఫరాల అధికారులకు పట్టుబడ్డ వ్యక్తికి స్టేషన్ బె యిల్ ఇచ్చేందుకు ఐదు లక్షల రూపాయల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డిల ఇ ళ్లలో ఎసిబి అధికారులు జరిపిన సోదాల్లో 21 లక్షల రూపాయల నగదుతో పాటు భారీగా బంగారు నగలు, స్థిరచరాస్తుల పత్రాలు పట్టుబడ్డా యి. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఎసిబికి పట్టుబడడం తెలిసిందే. వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేశాక గు రువారం నాడు ఎసిబి కోర్టులో హాజరు పరిచి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా ఇన్‌స్పెక్టర్ ఆంజనేయు లు, ఎస్ఐ జ్ఞానేంద ర్ రెడ్డిలు ఎసిబికి పట్టుబడిన తరువాత కీసర పోలీసు స్టేషన్ వద్ద కొందరు సంబరాలు జరుపుకోవడంతో పాటు వారి అక్ర మాలపై ఎసిబికి వివరాలు అందజేశారు. దీని ఆధారంగా గురువారం రాత్రి హబ్సిగూడలోని ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఇంటిపై దాడిచేసిన ఎసి బి అధికారులు అక్కడ ఆరు లక్షల రూపాయల నగదు లెక్కలేకుండా వుండడంతో దానిని జప్తు చేశారు. దీంతో పాటు 15 తులాల బంగారు న గలతో పాటు భారీగా భూములకు సంబంధించిన పత్రాలు వుండగా వాటిని కూడా జప్తు చేశారు. కాగా బోడుప్పల్‌లో గల ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి ఇంట్లో సోదా చేయగా అక్కడ లెక్కలోలేని 15 లక్షల రూపాయల నగదు, 16 తులాల బంగారు నగలు, భారీగా భూములకు సంబంధిం చిన పత్రాలు వుండగా వాటిని కూడా జప్తు చేశారు. దీనిపై ఎసిబి అధికారులు ఎసిబి కోర్టుకు వివరాలు అందజేశారు.

## వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తి కావాల్సిందే

### 'గోదావరి పుష్కరాలు-2027' కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు

**హైదరాబాద్,సెప్టెంబరు18,ప్రభాతవార్త:** కుంభమేళా తరహాలోనే రాబోయే గోదావరి పుష్కరాలను నిర్వహించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పమని, అందుకు అనుగుణంగా వచ్చే ఏప్రిల్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుని సమష్టిగా ముందుకెళ్లాలని అధికారులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గత పుష్కరాల్లో తలెత్తిన సవాళ్లు ఈసారి పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని వారికి దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన "గోదావరి పుష్కరాలు-2027" కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా... గోదావరి పుష్కరాల సన్నద్ధత, ప్రముఖ దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు, ఘాట్ల నిర్మాణం, రవాణా, మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్ల పురోగతిపై సమీక్షించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పుష్కర ఏర్పాట్లలో సమన్వయ లోపం తలెత్తకుండా జిల్లాలవారీగా ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. రద్దీ అధికంగా ఉండే టైర్1 ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టాల్సిన అదనపు ఏర్పాట్లపై ఘాట్ల వారీగా ప్రత్యేకంగా కలెక్టర్లతో క్షేత్రస్థాయి అధ్యయనం చేయించామన్నారు. పుష్కరాలు మొదలయ్యే నాటికి పూర్తయ్యే అవకాశమున్న పనులకే తొలుత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. చివరి వరకూ వేచి చూడకుండా గ్రౌండ్ రియాల్టీకి అనుగుణంగా ప్రతి పనికి ఒక నిర్దేశిత గడువును విధించుకోవాలని ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఇంటిగ్రేటెడ్ డ్యాష్ బోర్డ్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఇంజినీర్ల కొరత తలెత్తకుండా ఆర్అండ్‌బీ, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలన్నారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు సిఎం రేవంత్‌రెడ్డి ఛైర్మన్‌గా ఆర్గనైజింగ్ కమిటీ

### 28 మంది ఉన్నతాధికారులతో ఎగ్జిక్యూటివ్ కమిటీ, మరో 18 కమిటీలు

### సిఎస్ సంజయ్‌జాజు సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబరు18,ప్రభాతవార్త:** డిసెంబర్ 11 వ తేదీనుండి 22 వ తేదీ వరకు రాష్ట్రంలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంతో కృషిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై శుక్రవారం డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ కార్పొరేషన్ ఎండి సోని బాలాదేవి, కళాశాల, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐటి శాఖ జాయింట్ సెక్రెటరీ అనుదీప్ దురిశెట్టి, రైతు డిస్కోమ్ ఎండి ముషారఫ్ అలీ, హెచ్ఎండీఏ కమీషనర్ సర్పరాజ్ అహ్మద్ తదితర సీనియర్ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ఈ డిసెంబర్ 11 నుండి 22 వ తేదీ వరకు హైదరాబాద్‌తోపాటు మరో ఐదు నగరాల్లో ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉన్న క్రీడాకారులు పాల్గొనే ఈ క్రీడా పోటీలు, దేశంలో జాతీయ క్రీడల అనంతరం అంతే ప్రాధాన్యత ఉన్న పోటీలని అన్నారు. మొత్తం 27 స్పోర్ట్స్ ఈవెంట్ లో దాదాపు 6050 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. వీటిలో 14 వ్యక్తిగత క్రీడా విభాగాలు, 6 విభాగాలు టీమ్ ఈవెంట్లు, మరో ఆరు ఇతర క్రీడా ఈవెంట్లు ఉంటాయన్నారు. ఈ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా, రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి కోఛైర్మన్‌గా మొత్తం 18 మంది తోకూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేశామని వెల్లడించారు. దీనితోపాటు 28 ఉన్నతాధికా రులతో కూడిన ఎక్సిక్యూటివ్ కమిటీ, మరో 18 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని సంజయ్ జాజు వెల్లడించారు.


శుక్రవారం సచివాలయంలో ఖేలో ఇండియా యువజన క్రీడల ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న సిఎస్ సంజయ్‌జాజు




నిజమైన స్నేహితుడు చక్కటి ఆరోగ్యం వంటివాడు. ఆరోగ్యాన్ని కోల్పోతే కాని, దాని విలువ మనకు తెలిసిరాదు.

- చార్లెస్ కాలెబ్ కాల్టన్

# 'ఉల్లి'కి పగ్గాల్లేవ్!

'ఉల్లి' చేసే మేలు 'తల్లి' కూడా చేయదన్న మాట తెలుగునాట మిక్కిలిగా వినబడుతుంది. ఏదో ప్రాస యుక్తంగా ఉంటుందనో తల్లి కన్నా 'ఉల్లి'తో ఎన్నోఆరోగ్య ప్రయోజనాలున్నాయని చెప్పడానికో ఇలా 'జనశృతి' నడుస్తోంది. నిత్యం వంటింటి ఆధరవుల తయారీకి ఉప్పు, పచ్చి మిర్చి, ఉల్లిపాయ లేకుండా సామాన్యునికి ముద్ద దిగదు. ఈమూడింటిలో ఏ ఒక్కటీ లేనిరుచి రుచేకాదు. అరుచితో ఆహారం కడుపునింపదు. మార్కెట్‌లో తాజాగా 'ఉల్లి'పాయధర చూస్తే బాగా ఘాటెక్కింది. అంటే ఆ ధరను భరించలేక 'ఉల్లి'పాయ అవసరం లేకుండాకంచం ముందు నుంచి సంతృప్తిగా లేచే పరిస్థితి కానరాదు. ఇలా మార్కెట్ ధరల్లో 'ఉల్లి'ధర బాగా పెరిగి పోయినప్పుడు డిమాండ్, సరఫరాల మధ్య వ్యత్యాసం వల్లనే ధరలు పెరుగుదల కనపడుతోందని అనుకుంటుంటారు. కానీ పరిస్థితి అదికాదు. 'ఉల్లి'ధరలు పెరగడానికి కారణం ఉత్పత్తి పడిపోయినందువల్లేనని ఎవరు చెప్పినా అందులో అర్ధసత్యమే ఉందని మార్కెట్ విశ్లేషణలు చెబుతున్నాయి. మార్కెట్‌లకు 'ఉల్లి' ఉత్పత్తులు వచ్చేసమయం, అంతకుముందున్న నిల్వలు,వాతావరణ పరిస్థితుల అనుకూలత, ప్రాంతాల వారీ పంట తగ్గిపోవడం వంటి అంశాలను బేరీజు వేసుకుంటేనే తప్పఅసలు కారణం ఏమిటన్నది బోధపడదు. 2025-26లో ఉల్లి ఉత్పత్తి సుమారు 307లక్షల టన్నులు వస్తుందని అంచనా వేశారు. గత యేడాది ఈ మేరకు అనుకున్నారు. ఈ యేడాది వర్షపాతం అన్ని ప్రాంతాలలోను ఒకే రీతిగా ఉండకపోవడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులపై వాతావరణ ప్రభావం చూపిస్తోంది. జూన్ నుంచీ చూసుకుంటే ఆ నెలలో వర్షపాతంలోటు, అటు పిమ్మట వర్షాలు సమానంగా కురవకపోవడం ఉత్పత్తుల స్థాయిపై ప్రభావం చూపింది. దేశవ్యాప్తంగా ఉల్లిఉత్పత్తులు దాదాపు స్థిరంగానేఉందని ప్రభుత్వం చెబుతోంది. కానీ పంటమార్కెట్‌లో వేర్వేరు అనుచిత ప్రభావాలు ఉండడంతో ధరలు పెరుగుతూ వచ్చాయి. బఫర్ స్టాక్ నిర్వహణలో కూడా కొంతలోపం కనబడుతోంది. ముందు ఉత్పత్తులఅంచనా నుండి అందుపై ప్రభావితం చూసే అంశాలు, లోటు వంటి అన్ని సందర్భాలను కేంద్రప్రభుత్వమే క్రోడీకరించుకుని బఫర్ స్టాకుల నుంచి కొరత ఉన్న ప్రదేశాలకు సరఫరా చేయడంలో ప్రభుత్వం తొలిబాధ్యత తీరిపోయింది. అదే సమయంలో తర్వాత కాలపు పంట ఉత్పత్తులు ఏవిధంగా ఉండపోతున్నాయో అంచనా వేసుకొని అదనపు విస్తీర్ణంలో ఆ పంట సాగుకు ఆతృత పడుతున్నారు. అయినా మధ్యంతర కొరత వచ్చినప్పుడల్లా 'ఉల్లి' ధరలు పెరుగక మానవు. మహారాష్ట్రలో నాసిక్, అహల్యానగర్, పుణె,సోలాపూర్ ప్రాంతాల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు 'ఉల్లి' సరఫరా అవుతుంది. ఇక్కడకు వచ్చే 'ఉల్లి' ఉత్పత్తుల స్థాయి తగ్గిపోవడంతో ధరలు పెరుగుదల కన్పిస్తుంది. బఫర్ స్టాకుల నిర్వహణలో కొంత తడబాటు ఉండొచ్చు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతం నుండి ఖరీఫ్ఉత్పత్తులు సుమారు 15 రోజులు ఆలస్యమైంది. కర్ణాటకలో చిత్రదుర్గ, చల్లకెర ప్రాంతాల్లో సాగు సాధారణ స్థాయిలో సుమారు 60శాతమే ఉత్పత్తులు అందుకున్నాయి. మధ్యంతర సరఫరా ధరల పెంపునకు గురయ్యింది. జూన్,జులై నెలలో ఉల్లిధరలు పెరుగుతాయన్న అంచనాలతో కొంత స్పెక్యులేషన్ అమ్మకాలు నడిచాయి.నిల్వలో మిగిలిన పరిణామం తక్కువైపోయి, వాస్తవ కొరతకన్నా ముందుగానే మార్కెట్ తీవ్రంగా స్పందించి సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో మార్కెట్‌లు తమంతట తామే ధరలు పెంచాయి. ఇదే సమయంలో రబీ పంట ముందస్తుగానే మార్కెట్లకు చేరుకుంటుంది.మార్కెట్‌లో కొరతరాకుండా చూసేందుకు కేంద్రంముంద స్తుగా తమ వద్ద ఉన్న నిల్వలను 'కందా ఎక్స్‌ప్రెస్'లో ఎన్‌సిపిఎఫ్,నాఫెడ్ ద్వారా కిలో35రూపాయలకు అమ్మేవిధంగా ఉత్తరాది రాష్ట్రాలకు కేంద్రం 'ఉల్లి' సరఫరా చేసింది. కొన్ని ప్రాంతాల్లో ఉల్లి కెజి 65నుంచి రూ.70వరకు వ్యాపారులు అమ్ముతున్నారు. వెల్లులిపాయలు అయితే కిలోరూ.100 చేరుకుంది. దేశవ్యాప్తంగా సరకు సరఫరా తగ్గుదల కార ణంగా జూన్,జులై నెలల్లో కిలో 20రూపాయల మేరకు రిటైల్ మార్కెట్‌లో అమ్మిన ఉల్లికితాజాగా 60 రూపాయలు నడుస్తోంది. ఎన్ని చేసినా కొన్ని నగరాల్లో ఉల్లిధర అధికంగానే ఉంది. కొత్తఖరీఫ్ ఉత్పత్తులు వివిధ రాష్ట్రాల నుంచి మార్కెట్లకు రావడం ప్రారంభిస్తే తప్ప ఉల్లిధరలు తగ్గేదిలేదు. ఇందుకు మరోనెలా పది రోజులు పట్టవచ్చునని మార్కెట్‌లో వ్యాపారస్తులు అంచనాకొచ్చారు. మార్కెట్‌లో ఉల్లి ఉత్పత్తులు విరివిగా రావాలంటే యేడాది పొడవునా పంటల సాగులో అనిశ్చితి, వాతా వరణ పరిస్థితులను తట్టుకునే యాజమాన్య పద్ధతులను శాస్త్రీయంగా పర్యవేక్షించే బాధ్యత కేంద్ర ప్రభుత్వం తీసు కోవాలి. రైతులకు ఉత్పత్తుల స్థిరమార్కెట్‌పై అవగాహన పెంచడమూ అవసరమే.మలక్‌పేట మార్కెట్‌కు గతయేడాది కన్నా ఈసారి 'ఉల్లి' సరుకు అతి తక్కువగా చేరింది.ఉల్లిపాయల రిటైల్ సగటు ధర ఈయేడాది సెప్టెంబరు 16న కిలోకి 53.84 రూపాయలుగానమోదు కాగా గత యేడాది కిలో ధర రూ. 27.71గా ఉంది. అంటే గత యేడాది కన్నా రెట్టింపు ధరకు చేరింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులోనూ, కర్ణాటకలోని ఉల్లి పండేప్రాంతాలలో వర్షం తక్కువగా కురవడం వల్ల పంట దిగుబడి తగ్గింది. గత రబీ సీజన్‌లో అధిక తేమతో నిల్వలు పాడయ్యాయి. కావున ఉల్లి ఉత్పత్తుల కొరత కారణంగా ధరలు పెరగడం అనివార్యం. ఉల్లి దిగుబడుల విషయంలో రైతుకు తగిన ప్రోత్సాహకాలు ఇస్తూ ఉత్పత్తులు పెంచే ప్రామాణికాలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

తేలికగల పదార్థాలలో తృణమే తేలిక, దానికన్ననూ దూది తేలిక, దానికన్నా యాచకుడు తేలిక.



చాణుక్యుడు

మానవాళిని నాశనం చేసే మహా ప్రళయం యుద్ధం. అది మొత్తం నాశనం చేస్తుంది. అంతకంటే ఏ కీడయినా మేలే!



మార్టిన్ లూథర్

## ప్రజావాక్కు



### సంస్కృతీ, సంప్రదాయాల చట్టం అవసరం

ఇటీవల తెలంగాణా అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్‌ను తూలనాడినఘటనతో మాజీముఖ్యమంత్రి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం ముందు జరిగిన ధర్నాతో కొత్త మలుపు తిరిగింది. భారాస నాయకులు ఒకింత ముందుకు వెళ్ళి ధర్నా జరిగిన ప్రదేశాన్ని పసుపు నీటితో శుద్ధి చేయటం వివాదంగా మారింది. ధర్నాలకు ప్రతి ధర్నాలు లేదా పత్రికా సమావేశాల ద్వారా ఖండించాల్సింది పోయి శుద్ధి కార్యక్రమం చేపట్టటం దురదృష్టకరం.రాజకీయ నాయకులువారికి అనుకూలం అనుకుంటేపాలాభిషేకాలు, కాదంటేశుద్ధి కార్యక్రమాలు చేయటం పరిపాటిగా మారింది. రాజకీయ కార్యక్రమాలకు హిందూ సంస్కృతి, సంప్రదాయాలు ఆచారాలను వాడుకోవటం అత్యంత దారుణం. మిడి మిడి జ్ఞానంతో వ్యవహరించే వారి వల్ల హిందూ ధర్మం సంకటంలో పడుతోంది. ధర్మం పట్ల అనాచారంగా ప్రవర్తించే వారిని శిక్షించాలి. అందుకు హిందూ సంస్కృతీ సంప్రదాయాల రక్షణచట్టం ఏర్పాటుచేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి ,సికింద్రాబాద్

### పెరుగుతున్న శీతలీకరణ పరికరాల వాడకం

వర్షాకాలంలోనూ ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతుండటంతో నివాసాల్లో, కార్యాలయాల్లో శీతలీకరణ పరికరాల వాడకం పెరుగుతోంది. ప్రస్తుత శీతలీకరణ పరికరాలలో సీ.ఎఫ్.సీల వాడకం ప్రధాన సమస్య కాదు అనే వాస్తవాన్ని గుర్తించాలి. మాంట్రియల్ ఒప్పందం తర్వాత సీ.ఎఫ్.సీల వాడకం ప్రపంచవ్యాప్తంగా దాదాపు పూర్తిగా నిలిచిపోయింది.చల్లదనం కోసం ఎంచుకునే ప్రతి సాంకేతికత భూమిని మరింత వేడెక్కించని విధంగా ఉండాలి. ఆకాశ కవచాన్ని కాపాడటం అంటే భవిష్యత్ తరాల శ్వాసను కాపాడటమే.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సమస్యలకు పరిష్కారం ఎక్కడ?

బ్రిటన్ అంటే కేవలం ఇంగ్లాండ్ మాత్రమే కాదు ఇందులో నార్త్ ఐలాండ్ వెల్స్ స్కాట్‌లాండ్ కూడా భాగమే అయితే ఈ మూడు బ్రిటన్ నుండి విడిపోవాలి అని కోరుకుంటున్నాయి.ప్రాంతీయవాదం,జనాభా నిష్పత్తిలో నిధులపంపకం, రాజకీయ హక్కులు కోల్పోవడం, ప్రతి చిన్న నిర్ణయానికి బ్రిటన్ ప్రధానమంత్రి మీద ఆదేశ పార్లమెంట్ మీద ఆధారపడడం ఇవన్నీ కలిసి ఈ మూడు దేశాలు తమవి స్వాతంత్ర్యం లేని బ్రతుకులుగా మారిపోయాయి.

- భారత అవినాష్, జనగామ

### డబ్బులు ఊరికే పోవు

అంతా అనుకున్నట్టుగానే ప్రభుత్వం ఎలక్ట్రానిక్ లావాదేవీలపై ఉచితాన్ని ఎత్తేసింది. చార్జీల్ని నిర్ధారించింది. అయితే ఒకేసారి కాకుండా ప్రస్తుతానికి కొంచెం మాత్రమే రుచి చూపింది. గత నెలలో డిజిటల్ లావాదేవీల చట్టానికి చిన్న చిన్న సవరణలు తెచ్చినప్పుడే అంతా అనుమానించారు. అయితే ఆర్థిక మంత్రి 'అబ్బేఅలాంటి ప్రతిపాదనే లేదంటూ' కొట్టిపడేశారు. అందాకా పూర్తి ఉచితంగా ఉన్న డిజిటల్ నగదు లావాదేవీలపై ప్రభుత్వం ఎప్పుడైనా నోటిఫికేషన్ ద్వారా చార్జీలు విధించవచ్చు అన్నది ఆ సవరణ. ప్రస్తుతం వ్యక్తి నుండి వ్యక్తికి జరిగే చెల్లింపులు,చిన్న వ్యాపారస్తులకు ఉచితం ఉంటుంది. 2000 రూపాయలు దాటినప్పుడు వ్యాపారి 0.4 శాతం రుసుము కట్టాల్సి ఉంటుంది. కాబట్టి 96శాతం లావాదేవీలపై కొత్త రుసుము ప్రభావం ఉండదని ప్రభుత్వపు వాదన. చిన్నదైనా,పెద్దదైనా భారం చివరకు వినియోగదారుడి పైనే.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### ఆహార భద్రత

ఈ మధ్యకాలంలో ఆహార పదార్థాల విషయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, స్వీట్ షాపుల్లో ఆహారాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి, దుమ్ము, క్రిములు చేరకుండా మూతపెట్టి ఉంచడం ఎంతో అవసరం. ఆహారపదార్థాల్లో కృత్రిమ రంగులను అధికంగా ఉపయోగించకుండా, నాణ్యమైన పదార్థాలను మాత్రమే ఉపయోగించాలి. ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వాడకుండా జాగ్రత్త తీసుకోవడం కూడా ముఖ్యం. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ తగిన సూచనలు, హెచ్చరికలు చేస్తున్నారు. వాటిని పాటించడం ద్వారా ఆహారం నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చు. ప్రజలకు ఆహారం అందించే ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

వినాయక విగ్రహాల నిమ్మజనంలో భాగంగ ప్రభుత్వం అన్ని కాలువలు, చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలి. ప్రధానంగా చిన్న పిల్లలను చెరువు వద్ద లోపలికి అనుమంతించోద్దు. చిన్న చిన్న నిర్లక్ష్యలే జీవితాలను అంతంజేసే అవకాశాలు ఉంటాయి. నిరంతరం అందుబాటులో ఉంటూ సాఫీగా జరిగేలా కృషి చేయాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అరణ్యాలే కాదు.. వన్యప్రాణులూ మాయం!

**మహారాష్ట్రలోని తాడోబా ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోకి ప్రవేశించిన ఆ పులి రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో ఎనిమిది మూగజీవులను ఆహారం కోసం దాడి చేసి చంపింది. ఇలా పులులే కాదు ఏనుగులు, ఎలుగుబంట్లు, జనారణ్యాలపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఒకపక్క అడువులు తగ్గిపోతున్నాయి. పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మరొకపక్క విజృంభించిన విషప్రయోగాలతో వన్యప్రాణులను మట్టుపెడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అవసరం అనుకుంటే చట్టానికి మరింత పదునుపెట్టాలి. అడవులను పరిరక్షించాల్సిన అధికారులను, కార్యాలయాలను నగరాలకే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాలకు తరలించాలి. వన్యప్రాణులను కాపాడేందుకు అన్ని స్థాయిల్లోనూ త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం కావాలి.**

దామెర్ల సాయిబాబ

అటవీ రక్షణకు వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా అడవులను ధ్వంసం చేసేవారిని ఉక్కుపాదంతో అణచివేస్తామని అటు కేంద్ర పాలకులు, ఇటు రాష్ట్రాలపాలకులు ఎన్ని హెచ్చరికలు చేసినా మరెన్ని ప్రకటనలు చేసినా ఆశించిన ఫలితాలు లభించడం లేదు. అంతకంతకు అటవీ విధ్వంసం పెరిగిపోతున్నది. కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, వీటన్నిటికంటే మించి రాజకీయ జోక్యంతో చట్టాలు కూడా నిరుపయోగం అవుతున్నాయి. అరణ్యాలను స్మగ్లర్లు వేటగాళ్లకు వదిలి కొందరు అధికారులు జనారణ్యానికే పరిమితం కావడంతో పరిస్థితి అంతకంతకు దిగజారిపోతున్నది. ఒకనాడు తెలుగు రాష్ట్రాల్లో కాకులు దూరని కీకారణ్యాలుగా పేరొందిన నల్లమల దండకారణ్యాలు సైతం మైదానాలుగా మారిపోతున్నాయి. రోజూ లక్షలాది రూపాయల విలువైన అటవీ సంపద తరలిపోతున్నది. ఈ అటవీ సంపదతోపాటు వీటిని ఆధారంగా శతాబ్దాల తరబడి జీవనం సాగిస్తున్న పెద్ద పులులు, చిరుత పులులు, దుప్పులు, అడవి పందులు, కుందేళ్లు, ఇలా ఒక్కటేమిటి సమస్త వన్యప్రాణులు వేటగాళ్ల బారి నుంచి తప్పించుకోలేక కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గడం, స్మగ్లర్ల కార్యకలాపాలు పెరగడంతో వన్యప్రాణులకు అక్కడ భద్రత కరవై ఆహారం దొరకక జనారణ్యాలపై పడుతున్నాయి. ఇటీవల అనేక ప్రాంతాల్లో, గ్రామాల్లోకి పులులు,ఎలుగుబంట్లు, అడవి పందులు తదితర వన్యప్రాణులు ఎన్నో జనారణ్యంలోకి చొచ్చుకువచ్చి ఆహారం కోసం రైతుల పంటలను ధ్వంసం చేస్తున్నాయి. చిత్తూరు ప్రాంతంలో అడవి ఏనుగుల దాడులు ఇటీవల కాలంలో పెరిగిపోయాయి. వీటితో పాటు అడవుల్లోనే మహావృక్షాలనే స్థావరాలుగా చేసుకొని ఉన్న కోతులు, కొండముచ్చులు వాటిని వదిలి జనారణ్యంలోకి వచ్చేశాయి. అవి చేస్తున్న బీభత్సం అంతాఇంతాకాదు. అన్నదాతలకు జరుగుతున్న అపార నష్టం గురించి పట్టించుకునేవారే లేకుండాపోయారు. వాటిని ఎంతో కష్టంగా ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అడవులకు తరలిస్తున్నా మళ్లీ వారం కల్లా తిరిగి జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. ముఖ్యంగా పండ్ల తోటల రైతులు కోలుకోలేకుండా పోతున్నారు. తినేది తక్కువే అయినా చేసే నష్టం అపారంగా ఉంది. ఎన్నో వ్యయప్రయసలకు ఓర్చి సాగు చేసుకున్న పంటలు నోటికందుతున్న దశలో వన్యప్రాణులు ధ్వంసం చేస్తుండడంతో పురుగుమందులు, కరెంటు తీగలు పెట్టి కొందరు చంపుతున్నారు. ఇది రానురాను పెరిగిపోతున్నది. ఇక ఎర్రచందనం కోసం రాయలసీమలోని కడప, చిత్తూరు, నెల్లూరు తదితర జిల్లాల్లో స్మగ్లర్ల ఆగడాలకు అంతేలేకుండా పోతున్నది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులు కాల్పులు జరుపుతున్నా ప్రాణాలు లెక్కచేయకుండా స్మగ్లింగ్ కొనసాగిస్తున్నారు. అత్యంత విలువైన ఈ అటవీ సంపద కేవలం నెల్లూరు,చిత్తూరు,కడప సరిహద్దులోనివెలుగొండలు, శేషాచలం అడవుల్లో మాత్రమే పెరుగుతుంది. ఇందుకు కారణాలు ఏమిటో కొన్ని సంవత్సరాలుగా పరిశోధనలు చేసినా వృక్షశాస్త్రజ్ఞులు కనుగొనలేకపోతున్నారు. గతంలో ఒకసారి బ్రిటిష్ పాలకులు ఈ మొక్కలను ఇంగ్లాడ్‌కు తీసుకువెళ్లి అక్కడ పెంచే ప్రయత్నం కూడా సత్ఫలితాలు ఇవ్వలేదు. ఈ అరుదైన ప్రపంచంలో ఎక్కడా దొరకని ఈ వృక్షసంపదను కాపాడేందుకు 1973లో (కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్‌డేంజర్డ్ స్పీసీస్)లోకి చేర్చారు. అప్పటి నుంచి ఎర్రచందనం ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది.

### ఒక్క మాట

అయినా నేటికీ ఇది ఏదో ఒకరూపంలో జపాన్ లాంటిదేశాలకు ఎగుమతి అవుతూనే ఉంది.సముద్ర మార్గం ద్వారా దేశ సరిహద్దులు దాటించేందుకు కొత్తకొత్త వ్యూహాలు అనుసరిస్తూనే ఉన్నారు. దీనిని నియంత్రించేం దుకు పోలీసులు పెద్దఎత్తునే ప్రయత్నం చేస్తున్నారు. అటుపోలీసుల గాలింపులు, ఇటు స్మగ్లర్ల పదఘట్టనలతో నల్లమల శేషాచలం అడవులు అతలాకుతలం అవుతున్నాయి. దీంతో వన్యప్రాణులు తలదాచుకునేందుకు స్థావరాలు లేకుండాపోయాయి. ఒకప్పుడు ఆహారం కోసం ఆతర్వాత సరదాగా ఆరంభమైన వన్యప్రాణుల వేట ఇప్పుడు వ్యాపారంగా మారిపోయింది. ఆదిమానవుని జీవనం వేటతోనే ఆరంభమైందని చరిత్ర చెబుతున్నది. కేవలం తమ ఆకలి తీర్చుకోవడానికి ఆనాటి ఆదిమానవుడు వేటాడేవాడని చరిత్ర ఆధారాలు వెల్లడిస్తున్నాయి. రాజుల కాలంలో వేటను సరదాగానో, తమ ప్రతిష్ట కోసం కొనసాగించారు. పులులను వేటాడి చంపితే ఎంతో గౌరవ ప్రతిష్ట లభించినట్లు భావిం చేవారు. 1526 నుండి 1857 వరకు వేట జోరుగా సాగి నట్లు ఆధారాలున్నాయి. మనదేశానికి బ్రిటిష్‌వారి కాలంలో తుపాకులు రావడంతో వేట మరింత సులభతరమైంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వేటకు అడ్డూఅదుపు లేకుండాపోయిందనే చెప్పొచ్చు.కొందరు సంస్థానాధీశులు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దారులు, పెద్దపెద్ద భూస్వాములు తాము ఎన్ని పులులను వేటాడి చంపిందీ సగర్వంగా ప్రకటించుకునే వారు.వాటి తలలను వాకిలి ముందు పెట్టుకునేవారు. చర్మాలతో సోఫాలను చేయించేవారు. ఈ'షోకు' పెరిగిపోవడంతో వాటికి డిమాండ్ పెరిగి అమ్మకాలు కూడా ఆరంభమయ్యాయి.దీంతో విచ్చల విడిగా వేట కొనసాగింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలోదాదాపు నలభై వేలకుపైగా ఉన్న పులులసంఖ్య 1972 నాటి కేవలం మూడువేలకు తగ్గిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అసలు పులుల జాతి ఆనవాళ్లలేకుండా అంతరించిపోతుందని ఆందోళన వ్యక్తంకావడంతో ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని అదే సంవత్సరంలో ప్రవేశ పెట్టారు. వేటాడడం నిషేధించడంతోపాటు కొన్ని ప్రత్యేక పథకాలు కూడాచేపట్టారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 23టైగర్ ప్రాజెక్టులను ప్రారంభించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీశైలం వద్ద ఒక ప్రాజెక్టు ఆరంభమైంది. కోట్లాది రూపాయలు ఈ ప్రాజెక్టులపై వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు లభించడంలేదు. వాస్తవానికి ప్రతిపులి జంట మూడేళ్లకు నాలుగు పిల్లలనుఉత్పత్తి చేస్తుంది. ఇందులో సగంబతికినా ఈపాటికి వేల సంఖ్యలో పులులు ఉండాలి. కానీ అవి పెరగడంలేదు. పులుల ప్రాజెక్టుకు అనుబంధంగా వాటి ఆహారంకోసం జింకలు,కుందేళ్లు, తదితర వన్యప్రాణులను కూడా పెంచాల్సి ఉంటుంది. ఆ జంతువులు తిని తిరగడానికి అడవులు అవసరం. అడవులు అంతరించిపోవడం, జనసంచారం పెరగడంతో జంతువుల సంఖ్య తగ్గిపోతుండడం ఆ ప్రభావం పులితోపాటు వన్యప్రాణులపైపడుతున్నది.దీనికితోడు వేటకు తుపాకులు కూడా అవసరం లేకుండా విషప్రయోగాలతో పులులను మట్టుపెడుతున్నారు. అడవులు అంతర్ధానం అవుతుండడంతో పులులు ఆహారం కోసం వందలకిలో మీటర్లు ప్రయాణిస్తున్నాయి. ఎక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకోవాలో, ఎక్కడ తినాలో అర్థకానిపరిస్థితుల్లో ఏకంగా జనారణ్యాలపై పడుతున్నాయి. మొన్న ఫిబ్రవరిలో మహా రాష్ట్రలోని ఒక పులి తెలంగాణలో అడుగుపెట్టి 250కిలోమీటర్లు ప్రయాణించింది. ఇక తూర్పు గోదావరి జిల్లాలో మరొక పెద్దపులి ఏడురోజుల పాటు అధికారులకు చెమటలు పట్టించి ఎట్టకేలకు పట్టుబడింది. మహారాష్ట్రలోని తాడోబా ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోకి ప్రవేశించిన ఆ పులి రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో ఎనిమిది మూగజీవులను ఆహారంకోసం దాడిచేసి చంపింది. ఇలా పులులే కాదు ఏనుగులు,ఎలుగుబంట్లు,జనారణ్యాలపై దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. ఒకపక్క అడువులు తగ్గిపోతున్నాయి. పర్యావరణంపై తీవ్రప్రభావం చూపుతున్నది. మరొకపక్క విజృంభించిన విషప్రయోగాలతో వన్యప్రాణులను మట్టుపెడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. అవసరం అనుకుంటే చట్టానికి మరింత పదును పెట్టాలి. అడవులను పరిరక్షించాల్సిన అధికారులను, కార్యాలయాలను నగరాలకే పరిమితం చేయకుండా ఆయా ప్రాంతాలకు తరలించాలి. వన్యప్రాణులను కాపాడేందుకు అన్ని స్థాయిల్లోనూ త్రికరణశుద్ధిగా ప్రయత్నం జరగాలి. ఇందులో స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం కావాలి. ●

# ఉచితాల ఊబిలో ప్రగతి రథానికి బ్రేక్!


కొలను వెంకటేశ్వర రెడ్డి

ప్రజల సొమ్మును పంచడం సులువు. ప్రజల జీవితాలను మార్చడం కష్టం. ఆ కష్టమైన పని చేయకుండా, సులభమైన ఉచితాల బాట పట్టడం నేటి రాజకీయాలకు అలవాటుగా మారుతోంది. సంక్షేమం పేరుతో తాయిలాలు పెరుగుతున్నకొద్దీ, రాష్ట్ర ఖజానాపై భారం పెరుగుతోంది. ఓటు కోసం ఇచ్చే ఉచితం ఈరోజు ఆకర్షణ కావచ్చు. కానీ దాని బిల్లు రేపు ప్రజలే పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తుంది. ప్రజాస్వామ్య సంక్షేమం అంటే ప్రజలను ప్రభుత్వంపై ఆధారపడేలా చేయడం కాదు, ప్రభుత్వంఅవసరం లేని స్థాయికి ప్రజలను ఎదిగేలా చేయడం రైతు బంధు, దళిత బంధు, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, పథకం ఏదైనా దాని వెనుక ఉన్న ఆర్థిక భారం చివరకు ప్రజలపైనే పడుతుంది.పన్నులు చెల్లించే ప్రజల సొమ్మును తమ సొంత ఆస్తిలా పంచే అధికారం పాలకులకు ఎవరిచ్చారు?. తాత్కాలిక ప్రయోజనాల కోసం ఖజానాపై మోయలేని భారం మోపడం సంక్షేమం కాదు, భవిష్యత్తు తరాలపై అప్పు బదలాయించడం నిరుద్యోగికి నెలకుకొంత భృతి కంటే శాశ్వత ఉపాధి కావాలి. రైతుకు ఎన్నికల ముందు ఇచ్చే నగదు సాయం కంటే పంటకు గిట్టుబాటు ధర, సాగునీరు, నిల్వ గోదాములు, మార్కెట్ సౌకర్యం కావాలి. మహిళకు ఉచిత ప్రయాణం మాత్రమే కాదు, సురక్షిత రవాణా, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబన కావాలి. పేద కుటుంబానికి ఒకసారి ఇచ్చే నగదు కంటే, వారి పిల్లల భవిష్యత్తును మార్చే అవకాశాలు అవసరం ప్రభుత్వాలు వందలాది తాయిలాలపై ఖర్చు చేసే బదులు, నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అనే రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పేద కుటుంబాలకు ఉన్నత విద్య,ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఉదాహరణలు. ఒక పేద విద్యార్థి ఉన్నత విద్యను పూర్తిచేసి ఉద్యోగం పొందితే, అది ఒక్క వ్యక్తి జీవితాన్నే కాదు, ఒక కుటుంబం ఆర్థిక స్థితినే మార్చగలదు. అదేవిధంగా, తీవ్రమైన అనారోగ్యానికి వైద్యం అందుబాటులో లేక అప్పులపాలయ్యే కుటుంబాన్ని ఆరోగ్య భద్రత కాపాడగలదు. విద్య, వైద్యం భారం తగ్గితే కుటుంబాలు తమ ఆదాయాన్ని గృహనిర్మాణం, పిల్లలభవిష్యత్తు, చిన్న వ్యాపారాలు, పొదుపులపై మళ్లించగలవు. వినియోగం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తాయి. ప్రభుత్వానికి కూడా పన్నుల రూపంలో ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.ఇదే స్థిరమైన సంక్షేమానికి పునాది.ఉచితాలపేరుతో ప్రజలను శాశ్వతంగా ప్రభుత్వంపై ఆధారపడేలా చేయడంఅభివృద్ధినమూనా కాదు. నిజమైన సంక్షేమం అంటే అవసరమైన వారికి రక్షణకల్పిస్తూనే, ఎక్కువమందిని స్వయం సమృద్ధి దిశగా నడిపించడం. ఓటు కోసం ఇచ్చిన తాయిలం ఒక కుటుంబానికి కొద్దిరోజుల ఉపశమనం ఇవ్వొచ్చు.కానీ మంచి విద్య ఒక తరాన్ని మార్చుతుంది. మంచి వైద్యం ఒక కుటుంబాన్ని అప్పుల నుంచి కాపాడుతుంది. ఉపాధి ఒక జీవితాన్ని నిలబెడుతుంది. అవకాశాలు ఒక సమాజం భవిష్యత్తును నిర్మిస్తాయి. అందుకే పాలకుల లక్ష్యం ఎంత ఉచితం ఇచ్చాం అన్నది కాకుండా, ఎంతమందిని స్వయం సమృద్ధులుగా తీర్చిదిద్దాం అన్నదై ఉండాలి. ●

# ఓటర్ల జాబితాలో జవాబు దొరకని ప్రశ్నలు!


తిప్పర్తి శ్రీనివాస్

ప్రజాస్వామ్యంలో ఎన్నిక అనేది కేవలం ఓటు వేసే ప్రక్రియ కాదు. ఓటరు జాబితా నుంచి పోలింగ్ కేంద్రం వరకు, ఓటు లెక్కింపు నుంచి ఫలితాల ప్రకటన వరకుప్రతి దశా ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. ఆ విశ్వాసానికి పునాది ఓటర్ల జాబితా.జాబితాలో అర్హుడైన ప్రతిపౌరుడి పేరు ఉండాలి. అనర్హుడి పేరు ఉండకూడదు. ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల ఉండకూడదు. మరణించినవారు,శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారు జాబితాలో కొనసాగకుండా చూడాలి. ఈ ప్రాథమిక బాధ్యత సక్రమంగా నిర్వర్తించబడినప్పుడే ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉంటుంది. అయితే, ఇటీవలి కాలంలో ఓటర్ల జాబితాల్లో కనిపిస్తున్న 'అన్‌మ్యాప్డ్'ఓటర్లు, పేర్లలో తప్పులు, వివరాల అసమానతలు వంటి అంశాలు ఇప్పుడు కొన్ని అసౌకర్యకరమైన ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. ప్రస్తుత ఓటర్ల జాబితాలను 2002లో జరిగిన ప్రత్యేక సారాంశ సవరణ ఎస్ఐఆర్ రికార్డులతో మ్యాపింగ్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? దాదాపు పావు శతాబ్దం కాలంగా ఎన్నికల కోసం ఉపయోగించిన ఓటర్ల జాబితాల ఖచ్చితత్వంపై ఇది ఎలాంటి సందేశాన్ని ఇస్తోంది? 2002లో ఒక ఓటరు జాబితా రూపొందించబడింది. ఆ తరువాత ఎన్నో ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వాలు మారాయి. అధికార పార్టీలు మారాయి. ప్రతి పక్షాలు అధికారంలోకి వచ్చాయి. ప్రతి ఎన్నికలోనూకోట్లాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఆ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. అయితే ఇప్పుడు అదే వ్యవస్థ 2002 నాటి జాబితాను ఆధారంగా తీసుకుని ప్రస్తుత ఓటర్లను గుర్తించాల్సిన అవసరం ఏర్పడితే, సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది. గత ఇరవై ఐదేళ్లుగా ఓటర్లజాబితాల నిర్వహణ ఎంత సమర్థవంతంగా జరిగింది? ఎన్నికల వ్యవస్థపై ప్రజలనమ్మకాన్ని మరింత బలోపేతం చేయా లంటే ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాలి. మరణించిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండటం ఒకసమస్య. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి శాశ్వతంగా మారిపోయిన వ్యక్తి పేరు పాత జాబితాలో కొనసాగడం మరో సమస్య. ఇవి పరిపాలనా ప్రక్రియలో ఎదురయ్యే సహజమైన లోపాలుగా కొంతవరకు అర్థంచేసుకోవచ్చు. కానీ విస్తృత స్థాయిలో పేర్లలో తప్పులు, చిరునామాల్లో పొరపాట్లు, కుటుంబ సంబంధాల్లో అసమానతలు, ఒకే వ్యక్తి వివరాలు వేర్వేరు విధాలుగా నమోదుకావడం లేదా పాత రికార్డులతో ప్రస్తుత రికార్డులను సరిపోల్చలేని పరిస్థితి ఉంటే, దాన్ని సాధారణ సాంకేతిక లోపంగా మాత్రమే చూడటం కష్టం. ఒకవైపు, ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను శుద్ధి చేయాల్సిన అవసరాన్ని చెబుతోంది. మరోవైపు, ఆ శుద్ధి ప్రక్రియలో గతంలో అధికారికంగా ఆమోదించబడిన జాబితాలతో ప్రస్తుత జాబితాలను సరిపోల్చాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. మరి గత ఎన్నికల సమయంలో ఉపయోగించిన జాబితాలు సరైనవే అయితే ఇప్పుడు ఇంత పెద్ద ఎత్తున మ్యాపింగ్ ఎందుకు



అవసరమైంది? అవి అప్పుడే లోపభూయిష్టంగా ఉంటే, ఆ జాబితాల ఆధారంగా జరిగిన గత ఎన్నికల ప్రక్రియలపై కనీసం పరిపాలనా స్థాయిలో సమీక్ష అవసరం కాదా? ఎన్నికల సంఘం గతఎన్నికల ఫలితాలను తిరిగి పరిశీలించాలన్నది ఈ ప్రశ్నల ఉద్దేశం కాదు. కానీ ఓటర్ల జాబితా నాణ్యతపై ఒక సంస్థాగత ఆడిట్ ఎందుకు ఉండకూడదు? ఏళ్ల తరబడి జాబితాలో కొనసాగిన తప్పులు ఎప్పుడు గుర్తించబడ్డాయి? వాటిని సరిదిద్దడానికి ఎలాంటి వ్యవస్థలు పనిచేశాయి? ఎన్ని పేర్లు తొలగించబడ్డాయి? ఎన్ని కొత్త పేర్లు చేర్చబడ్డాయి? ఎంతమంది ఓటర్ల వివరాలు సరిపోలలేదు? ఈ తప్పులకు కారణాలు ఏమిటి? రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఈ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడంవల్ల ఎన్నికల వ్యవస్థపై నమ్మకం తగ్గదు, మరింత పెరుగుతుంది. ప్రజాస్వామ్యంలో పారదర్శకత అంటే కేవలం ఫలితాలను ప్రకటించడంకాదు. డేటా ఎలా తయారైంది, ఎలా సరిదిద్దబడింది, ఎలాంటి ప్రమాణాలతో ఓటరును గుర్తించారు అన్నది కూడాప్రజలకు తెలియాలి. ప్రత్యేకించి డిజిటల్ యుగంలో ఈ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండాలి. ఒక ఓటరు తన పేరు ఏ రికార్డుతో అనుసంధానమై ఉందో తెలుసుకునే అవకాశం ఉండాలి. పేరు ఎందుకు 'మ్యాప్'కాలేదో తెలుసుకునేహక్కు ఉండాలి. తన వివరాల్లో పొరపాటు ఉంటే దాన్ని సరిచేసుకునే సులభమైన, కాలపరిమితితో కూడిన విధానం ఉండాలి. అభ్యంతరం వ్యక్తం చేసిన పౌరుడికి దాని పరిష్కారం గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. అంతకన్నా ముఖ్యంగా, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలకూ, పౌర సమాజానికీ, స్వతంత్ర పరిశీలకులకూ తగిన స్థాయిలో పరిశీలనా అవకాశం కల్పించాలి. ఓటర్ల జాబితా అనేది ఎన్నికల సంఘం సొంత ఆస్తికాదు,అది ప్రజాస్వామ్యానికి చెందినప్రజారికార్డు. ఇక్కడ మరోఅంశాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ఓటరు జాబితాలో తప్పు అంటే కేవలం ఒక డేటా ఎంట్రీ పొరపాటు కాదు.ఒక అర్హుడైన ఓటరు పేరులేకపోతే, అతని రాజకీయ హక్కు ప్రభావితమవుతుంది. ఒక అనర్హుడి పేరు కొనసాగితే, ఎన్నికల ప్రక్రియపై అనుమానం ఏర్పడుతుంది. ఒకరి పేరు తప్పుగా మ్యాప్ అయితే, అతని గుర్తిం పుపై సమస్య తలెత్తుతుంది. అందువల్ల ఓటర్ల జాబితాశుద్ధి అనేది అత్యంత జాగ్రత్తగా, నిష్పక్షపాతంగా, మానవీయంగా జరగాల్సిన ప్రక్రియ. ఎన్నికల సంఘంమీద రాజకీయ ఆరోపణలుచేయడం సులభం. కానీ సంస్థాగత ప్రశ్నలకు సంస్థాగత సమాధానాలు ఇవ్వడం చాలా ముఖ్యమైనది. ఇవి కేవలం సాంకేతిక లోపాలు అనిచెప్పడం సరిపోదు. లోపాలు ఎందుకు వచ్చాయో, వాటి విస్తృతి ఎంత, వాటిని నివారించేందుకు గతంలో ఏచర్యలు తీసుకున్నారో వివరించాలి.ఎందుకంటే చివరికి ప్రశ్న ఒక పార్టీ గెలిచిందా,మరొక పార్టీ ఓడిందా అన్నది కాదు. ప్రశ్న ఓటు వేసిన పౌరుడి పేరు ఉన్న జాబితాపై అతనికి నమ్మకం ఉందా?గత 25ఏళ్లలో ఎన్నో ఎన్నికలు జరిగాయి.ఆ ఎన్నికలన్నింటికీ ఓటర్ల జాబితాలేపునాది. ఇప్పుడు ఆ పునాదిలో లోపాలు ఉన్నాయని తేలితే, దానిని దాచిపెట్టడం కన్నాబహిరంగంగా అంగీకరించి సరిదిద్దడం ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుంది. ఎన్నికల సంఘం స్వతంత్రత ఎంతముఖ్యమో, దాని జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యం.ప్రశ్నలకు ధైర్యంగా సమాధానం చెప్పగలగడమే నిజ మైన సంస్థాగత బలం. అందుకే 'అన్‌మ్యాప్డ్ ఓటర్లు' అనే పదం వెనుక దాగి ఉన్న పెద్దప్రశ్నను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు స్పష్టమైన, లెక్కలతో కూడిన, పారదర్శకమైన సమాధానాలు ఇవ్వగలిగినప్పుడే ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం మరింత బలపడుతుంది. అదే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ. ●

# నాటో తూర్పుదేశాలపై దాడులకు రష్యా స్కెచ్



## ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న దేశాలపైనా దాడులకు అవకాశం

**బలార్స్కా, సెప్టెంబరు 18:** రష్యాఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ రష్యా చర్యలపై కీలక హెచ్చరిక చేశారు. ఉక్రెయిన్‌కు మద్దతు ఇస్తున్న యూరప్ దేశాలు, ముఖ్యంగా నాటో తూర్పు వైపున ఉన్న దేశాలను డ్రోన్లు లేదా క్షిపణులతో దాడిలక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇవి రష్యా ఉద్దేశపూర్వక దాడులేనని నిరూపించడం కష్టంగా ఉండేలా వాటిని ప్రమాదాలుగా చూపించే ప్రయత్నం జరగవచ్చని టస్క్ అన్నారు. పోలిష్ పార్లమెంట్‌లో గురువారం చేసిన ప్రసంగంలో టస్క్ మాట్లాడుతూ నాటో తూర్పు వైపున ఉన్న ఒకటి లేదా అంతకంటే ఎక్కువ దేశాల భూభాగంలోకి డ్రోన్లు లేదా ఇతర క్షిపణులు ప్రవేశించి నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. దాడి జరిగిన తర్వాత అది అనుకోకుండా జరిగిన ఘటనగా రష్యా ప్రకటించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాంటి పరిస్థితి నాటోదేశాల ప్రతిస్పందనను బలహీనపరచడం లేదా దాడికి గురైన సభ్యదేశానికి వెంటనే సహాయం అందించడంపై సంకోచం కలిగించడమే లక్ష్యంగా ఉండవచ్చని టస్క్ అభిప్రాయపడ్డారు. రష్యా జెట్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్ల వినియోగాన్ని పెంచుతోందని టస్క్ అన్నారు. ఇవి ఎక్కువ వేగంతో, ఎక్కువ ఎత్తులో ప్రయాణించగలవని, అందువల్ల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలకు వాటిని ముందుగానే గుర్తించడం మరింత కష్టమవుతుందని పేర్కొన్నారు. నాటో, ఉక్రెయిన్, అమెరికా నిఘా సంస్థల నుంచి అందుతున్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని తాను ఈ హెచ్చరికలు చేస్తున్నట్లు టస్క్ తెలిపారు. యూరప్‌లో రష్యా హైబ్రిడ్ కార్యకలాపాలు పెరుగుతున్నాయని పేర్కొంది. ఉక్రెయిన్‌కు యూరప్ నుంచి అందుతున్న సైనిక, ఇతర అవసరమైన సహాయాన్ని అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని టస్క్ గతంలో కూడా హెచ్చరించారు. పోలాండ్ఉక్రెయిన్ సరిహద్దుకు సమీపంలో ఇటీవల డ్రోన్ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈనెల 15న పోలాండ్ తన సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద రక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు ఉక్రెయిన్ మోల్డోవా సరిహద్దులోని ఒక చెక్‌పాయింట్‌పై డ్రోన్ దాడిలో ఇద్దరు మరణించారని, పోలాండ్ఉక్రెయిన్ సరిహద్దు వద్ద కూడా ముప్పు తలెత్తిందని టస్క్ వెల్లడించారు. రష్యా ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ, లాజిస్టిక్స్‌ను దెబ్బతీయడంపై దృష్టి పెట్టిందని టస్క్ పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులో ఉక్రెయిన్‌లోని ఆరు ప్రధాన నగరాలపై అధిక తీవ్రతతో వరుస దాడులు జరిగే అవకాశం ఉందని తమకు అందిన నిఘా సమాచారం సూచిస్తోందని తెలిపారు. ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 17న రష్యా ఉక్రెయిన్‌లోని కీవ్ సహా పలు ప్రాంతాలపై భారీ డ్రోన్, క్షిపణి దాడులు జరిపినట్లు నివేదించింది. ఈ దాడుల నేపథ్యంలో పోలాండ్ కూడా తన యుద్ధ విమానాలను అప్రమత్తం చేసింది. అయితే పోలిష్ భూభాగంలోని గగనతల ఉల్లంఘన నమోదుకాలేదని అధికారులు తెలిపారు. టస్క్ ఉక్రెయిన్ పర్యటనకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీతో భేటీ అయి కొత్త రకం డ్రోన్ల నుంచి రక్షణ మార్గాలు, రష్యాపై తదుపరి ఆంక్షలు వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోలాండ్‌లో శాశ్వత అమెరికా ఆర్మీ స్థావరం ఏర్పాటు దిశగా చర్చ జరుగుతోందని తెలిపారు. అమెరికా ప్రతినిధి బృందం పోలాండ్‌లో పలు ప్రాంతాలను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే శాశ్వత స్థావరంపై తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. పోలాండ్‌లో సుమారు 10వేల మంది అమెరికా సైనికులు ఉండగా, మేలో కొంతమంది సైనికులను తాత్కాలికంగా వెనక్కి తీసుకున్నారు. ఈ చర్య తాత్కాలికమేనని అమెరికా, పోలాండ్ అధికారులు తెలిపారు.



## యువతలో ఆధ్యాత్మిక చింతన పెరగడం మంచి పరిణామం

### ఆర్ఎస్ఎస్‌చీఫ్ మోహన్‌భగవత్

**ఉజ్జయిని, సెప్టెంబరు 18:** ధర్మం అనేది కేవలం వృద్ధాప్యానికి పరిమితమైన అంశం కాదని, మనిషి పుట్టినప్పటి నుంచి చివరి వరకు అది మార్గనిర్దేశం చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన యువ ధర్మ సంసద్ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భగవద్గీత, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలను కేవలం పదవీ విరమణ తర్వాత చదవాలని చాలామంది భావిస్తారని, అయితే ఆ అభిప్రాయం ఏమాత్రం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. జీవితంలోని ప్రతి అడుగు ధర్మానుసారమే సాగాలని సూచించారు. నేటి తరం యువత (జెన్‌జీ) ధర్మం, ఆధ్యాత్మిక అంశాలు, భజనల పట్ల ఆసక్తి కనబరచడం సంతోషకరమని భగవత్ అన్నారు. "అన్నీ నేనే చేస్తున్నాను" అనే అహంకారం కేవలం భ్రమకే దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ధర్మాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనసులో ఉన్న పాత అపోహలను, ముందస్తు అభిప్రాయాలను పక్కన పెట్టాలని కోరారు. తన ఆలోచనలను ఇతరులపై రుద్దడం తన ఉద్దేశం కాదని, ఈ జ్ఞానం సృష్టి ఆరంభం నుంచే ఉందని ఆయన వివరించారు. సృష్టి ఆది నుంచి అంతం వరకు ధర్మమే శాశ్వతమని, వ్యక్తిగత జీవితంలో పుట్టుక నుంచి మరణం వరకు సర్వ సుఖాలకు ధర్మమే మూలమని మోహన్ భగవత్ పునరుద్ఘాటించారు.

## బంగ్లా ప్రధాని తారిక్ రెహమాన్ వచ్చే నెల భారత్ రాక



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రహమాన్ నవంబర్‌లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని ఓ నివేదిక వెల్లడించింది. తొలిసారిగా ద్వైపాక్షిక పర్యటనలో భాగంగా ఢిల్లీకి వచ్చే అంశంపై భారత్, బంగ్లాదేశ్ మధ్య అధికారిక స్థాయిలో చర్చలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలుస్తోంది. పర్యటన తేదీ, అజెండా ఇంకా ఖరారు కాలేదని సమాచారం. ఇటీవల ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సదస్సుకు రావాలని రెహమాన్‌కు భారత్ రెండు సార్లు ఆహ్వానం పంపింది. కానీ రెహమాన్ మాత్రం రాలేదు. తాజాగా ఇరు దేశాల అధికారుల మధ్య చర్చలు తిరిగి ప్రారంభమయ్యాయి. తారిఖ్ రహమాన్ ఢిల్లీ పర్యటనకు సంబంధించిన తేదీ, చర్చించాల్సిన అంశాలను ఖరారు చేసే దిశగా ఇరు దేశాల అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తారిఖ్‌కు భారత్ ఇప్పటికే రెండు వేర్వేరు ఆహ్వానాలు పంపారు.

## నిఠారి హత్యలకేసులో నిర్దోషి సురీందర్‌కోలి ఆత్మహత్య

### టీస్టాల్‌లో ఉరికి వేలాడుతూ కనిపించిన మృతదేహం



**డెహ్రాడూన్, సెప్టెంబరు 18:** ఒకప్పుడు నిఠారీ రాక్షసుడుగా ముద్రపడి, సంచలనం సృష్టించిన 2006 నాటి హత్యల కేసులో నిర్దోషిగా విడుదలైన సురేందర్ కోలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉత్తరాఖండ్లోని హరిద్వార్లో ఒక టీస్టాల్ లోపల ఉరికి వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో అతడి మృతదేహం కనిపించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న ఆధార్ కార్డ్ ఆధారంగా మృతుడిని సురేందర్ కోలిగా గుర్తించారు. గత ఏడాది సుప్రీంకోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసిన తర్వాత, గత కొంతకాలంగా హరిద్వార్లో టీ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. అతడి మృతిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. 2006 డిసెంబర్లో ఉత్తరప్రదేశ్లోని నోయిడా సెక్టార్ 31లోని డీ 5 బంగ్లా పక్కన ఉన్న కాలువ వెనుక ప్లాస్టిక్ సంచులలో కుక్కిన 16 మానవ పుర్రెలు, ఎముకలు, దుస్తులను పోలీసులు కనుగొన్నారు. సమీపంలోని నిఠారీ గ్రామానికి చెందిన పేదలు, కూలీల కుటుంబాలకు చెందిన పిల్లలు అదృశ్యమవుతున్నట్లు స్థానికులు చాలా కాలంగా ఫిర్యాదులు చేశారు. అయితే వారి ఆందోళనలను పోలీసులు తొలుత పట్టించుకోలేదని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పాయల్ అనే యువతి అదృశ్యంపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఆమె మొబైల్ ఫోన్ను స్థానికుడైన రిక్షా వ్యక్తి వద్ద గుర్తించారు. డి5లో నివసించే వ్యక్తి ఆ మొబైల్ ఫోన్ తనకు ఇచ్చినట్లు అతడు చెప్పాడు. ఆ ఇల్లు వ్యాపారవేత్త మొనిందర్ సింగ్ పాంధర్కు చెందగా, సురేందర్ కోలి అక్కడ పనివాడిగా ఉన్నాడు. పోలీసులు ఆ ఇంట్లో సోదాలు చేయగా 19 మంది పిల్లల హత్యలు, నరమాంస భక్షణకు సంబంధించిన ఆధారాలు లభించాయి. నిఠారీలో నివసించే పేద పిల్లలను ప్రలోభపెట్టి, వారిని చంపి, మృతదేహాలను ముక్కలు చేసి, వండుకొని తిన్నారన్న పుకార్లు వ్యాపించాయి. కాగా, మొనిందర్ సింగ్ పాంధర్, సురేందర్ కోలిని పోలీసులు అరెస్ట్ చేశారు. అత్యాచారం, హత్య, సాక్ష్యాలను ధ్వంసం చేసిన ఆరోపణలతో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 20072010 మధ్య సీబీఐ 19 కేసులు నమోదు చేసింది. సురేందర్ కోలికి పలు కేసుల్లో కోర్టు మరణశిక్షవిధించగా, పాంధేర్కు ఇతర కేసుల్లో మరణశిక్ష, యావజ్జీవ కారాగార శిక్షలు పడ్డాయి. 2007లో సురేందర్ కోలికి మరణశిక్ష అమలు జరిగే పరిస్థితి దాదాపు ఖరారైంది. కానీ చివరి నిమిషంలో దాఖలైన పిటిషన్‌పై అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. అతడి మరణశిక్ష అమలును నిలిపివేశారు. దీంతో కోలికి ప్రాణాలతో బయటపడే అవకాశం లభించింది. మరోవైపు ఈ కేసులు ఉన్నత న్యాయస్థానాల్లో అప్పీళ్లకు వెళ్లగా ఆరోపణల్లో లోపాలు, దర్యాప్తులో లొసుగులు బయటపడ్డాయి. విశ్వసనీయమైన సాధారాలు లేవని పేర్కొంటూ 2023 అక్టోబర్లో నిందితులైన కోలి, పాంధేర్ను నిర్దోషులుగా హైకోర్టు విడుదల చేసింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం, బాధితుల కుటుంబాలతో కలిసి సీబీఐ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. 2025లో సుప్రీంకోర్టు కూడా అన్ని ఆరోపణల నుంచి సురేందర్ కోలిని నిర్దోషిగా విడుదల చేసింది.

నేరాల దారుణ స్వభావాన్ని అంగీకరిస్తూనే, ఎంత తీవ్రమైన అనుమానం అయినా, సహేతుకమైన సందేహానికి అతీతమైన రుజువుకు ప్రత్యామ్నాయం కాలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది.

## మమతకు ఫుట్‌బాల్‌ప్లేయర్, రితబ్రతకు ఎన్వలప్ ఎన్నికల గుర్తులు కేటాయించిన ఇసి



**కోల్‌కత్తా, సెప్టెంబరు 18:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలోని రెండు వర్గాలకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నూతన పేర్లను, ఎన్నికల చిహ్నాలను కేటాయించింది. పార్టీలో తలెత్తిన అంతర్గత వర్గపోరు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గానికి మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అనే పేరును, ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తును ఈసీ కేటాయించింది. అదే సమయంలో, అరూప్ రాయ్ నేతృత్వంలోని అసమ్మతి వర్గానికి డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్ అనే పేరును ఖరారు చేస్తూ, ఎన్వలప్ గుర్తును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు ఈనెల 17న, టీఎంసీ అసలు పేరును, చిహ్నాన్ని ఈ రెండు వర్గాలు ఉపయోగించకుండా ఎన్నికల సంఘం తాత్కాలిక నిషేధం విధించింది. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ నియోజకవర్గాలకు అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల దృష్ట్యా ఈ చర్యలు చేపట్టింది. దీంతో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లు, గుర్తుల జాబితాను ఈసీకి సమర్పించగా, వాటిని పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం ఈ కేటాయింపులు చేసింది.

### నందిగ్రామ్‌నుంచి టిఎంసి అభ్యర్థి విత్‌డ్రా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలికిన మమత

పార్టీని, ఎన్నికల గుర్తును కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి బిగ్ షాక్ తగిలింది. రాబోయే నందిగ్రామ్ ఉప ఎన్నికల బరి నుంచి మమతా వర్గం అభ్యర్థి విత్ డ్రా అయ్యారు. నందిగ్రామ్ బై ఎలక్షన్స్ కోసం మమతా వర్గం తమ అభ్యర్థిగా సంచితా ప్రధాన్ డే అనే మహిళా టీచర్‌ను ప్రకటించారు. అయితే, ఆమె పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారితో భేటీ అయిన కొన్ని గంటల్లోనే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. సువేందుతో భేటీ తర్వాత ఎన్నికల పోటీ నుంచి బయటకు రావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనితో మాజీ సీఎం మమతా బెనర్జీ కూడా వ్యూహాత్మకంగా ముందుకు పోయారు. బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించడంతో బిజెపికి కూడా టిఎంసి షాక్ ఇచ్చినట్లయింది. మరోవైపు, మమతా బెనర్జీకి రాజకీయ తలనొప్పులు మరింత ఎక్కువయ్యాయి. ఇప్పటికే టీఎంసీలో వర్గ పోరు తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఈసీ టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తును ఫ్రీజ్ చేసింది. మమతా వర్గానికి ఫుట్‌బాల్ ప్లేయర్ గుర్తు, రిటబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గానికి ఎన్వలప్ కవర్ గుర్తును కేటాయించింది. ఈ గుర్తులపైనే రెండు వర్గాలు ఉప ఎన్నికల్లో పోటీ చేయబోతున్నాయి. ఈసీ ఈ గుర్తుల కేటాయింపు చేసిన కొన్ని గంటల్లోనే మమతాకు సంచితా బిగ్ షాక్ ఇచ్చారు. ఈ ఏడాది జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో టీఎంసీ ఘోర పరాజయం చవిచూసింది. మమతా బెనర్జీ భవానీపూర్ నుంచి ఓడిపోయారు. ఈ స్థానం నుంచి పోటీ చేసిన సువేందు అధికారి మమతను చిత్తుగా ఓడించారు. సువేందు భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్ నుంచి పోటీ చేసి రెండు చోట్ల విజయం సాధించారు. ఎన్నికల తర్వాత భవానీపూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగడానికే ఇష్టపడి, నందిగ్రామ్‌కు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో నందిగ్రామ్‌కు బైఎలక్షన్లు అనివార్యమయ్యాయి. టీఎంసీ ఘోర పరాజయం తర్వాత వర్గపోరు ముదిరింది.

## ప్రతిపక్ష పార్టీలను చీల్చే కుట్రచేస్తున్న బిజెపి

### శివసేన, ఎన్సీపి ఇపుడు టిఎంసి రాహుల్ గాంధీ సెటైర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. మొదట శివసేన తర్వాత ఎన్సీపీ ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ ఇప్పుడు పార్టీ చోరీ కూడా అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరు, ఫ్లవర్స్ అండ్ గ్రాస్ గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి.

ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు.

## రష్యానుంచి చౌకగా యురేనియం కొనుగోలుచేస్తున్న అమెరికా

**మాస్కో, సెప్టెంబరు 18:** రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై భారీ సుంకాలు విధించేలా అమెరికా కొత్త చట్టానికి మార్గం సుగమం చేసింది. లిండ్సే ఓ.గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్2026కు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. దీంతో రష్యా ఇంధనం కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం వరకు టారిఫ్ విధించే అధికారం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు దక్కనుంది. అయితే ఇది ఆటోమేటిక్‌గా అమలయ్యే టారిఫ్ కాదు. ట్రంప్ ఆ అధికారాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో రష్యా నుంచి వచ్చే అణు ఇంధనంపై మాత్రం అమెరికా పూర్తిగా తలుపులు మూయలేదు. ముఖ్యంగా రష్యా నుంచి లభించే తక్కువ సాంద్రత యురేనియం విషయంలో పరిమిత మినహాయింపులు కొనసాగుతున్నాయి. అమెరికా అణు విద్యుత్ రంగానికి రష్యా ఇంధన సరఫరా ఇప్పటికీ కీలకంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. 2024లో అమెరికా రష్యన్ యురేనియం దిగుమతులపై ఆంక్షలు విధించింది. అయితే దేశీయ అణు రియాక్టర్లకు ప్రత్యామ్నాయం దొరకని పరిస్థితుల్లో లేదా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే దిగుమతులకు మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంచింది.

**ఆంక్షలు మరి అమెరికాకు వర్తించవా?**



## అగ్నిపథ్ కింద అగ్నివీర్‌లకు ఉద్యోగావకాశాలు

### హోంశాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరుల భవిష్యత్తు, సర్వీస్ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలపై కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అగ్నిపథ్ నిబంధనల ప్రకారం నాలుగేళ్ల సేవ పూర్తయిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మంది అగ్నివీరులను మాత్రమే రెగ్యులర్ క్యాడర్‌లో చేర్చుకునే అవకాశం ఉంది. మిగిలిన వారికి పునరావాసం, తదుపరి ఉద్యోగ అవకాశాల కోసం కేంద్రం పలు మార్గాలను ఏర్పాటు చేసింది. అగ్నిపథ్ పథకం ప్రకారం అగ్నివీరుల సేవా కాలం నాలుగేళ్లు. నాలుగేళ్ల సేవ పూర్తయ్యే సమయంలో పనితీరు, సంస్థాగత అవసరాలు, ఇతర నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని సాయుధ దళాల రెగ్యులర్ క్యాడర్‌లో చేర్చుకోవచ్చు. అయితే మిగిలిన అగ్నివీరులకు కూడా సేవ తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖలతో కలిసి చర్యలు తీసుకుంటోంది. 2026 జూలైలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్, అసోం రైఫిల్స్‌లో కానిస్టేబుల్ రైఫిల్‌మన్ పోస్టుల నియామకాల్లో మాజీ అగ్నివీరులకు 50 శాతం ఖాళీలను రిజర్వ్ చేస్తామని ప్రకటించింది. అంతేకాదు, మాజీ అగ్నివీరులకు నిర్దేశిత గరిష్ఠ వయోపరిమితిలో 3 ఏళ్ల సడలింపు, మొదటి బ్యాచ్‌కు గరిష్ఠ వయోపరిమితికి అదనంగా 5 ఏళ్ల వరకు సడలింపు, పిఎస్‌టి నుంచి మినహాయింపు, శరీర దారుఢ్యం నుంచి మినహాయింపు, రాత పరీక్ష నుంచి మినహాయింపు వంటి ప్రయోజనాలను ప్రభుత్వం ప్రకటించింది. మాజీ అగ్నివీరుల తదుపరి ఉద్యోగ అవకాశాలను సమన్వయం చేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. 2026 జూలై నాటికి మొదటి బ్యాచ్ అగ్నివీరులు తమ నాలుగేళ్ల సేవా కాలాన్ని ఇంకా పూర్తి చేయలేదని కూడా హోం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. భారతీయ రైల్వే కూడా మాజీ అగ్నివీరులకు ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా రిజర్వేషన్‌ను అమలు చేస్తోంది. 2026 ఫిబ్రవరిలో రైల్వే, భారత సైన్యం కలిసి మాజీ అగ్నివీరుల తదుపరి కెరీర్ అవకాశాల కోసం సహకార వ్యవస్థను ప్రకటించాయి.

## 51 వేలమంది నిరుద్యోగ యువతకు నియామక పత్రాలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ నియామక పత్రాలు అందించనుంది. 20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన అభ్యర్థులకు ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేయనున్నారు. శనివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వెల్లడించింది. సెప్టెంబర్ 19న మధ్యాహ్నం 12:30 గంటలకు రోజ్‌గార్ మేళా ప్రారంభం కానుంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొని ఎంపికైన అభ్యర్థులతో మాట్లాడనున్నారు. దేశవ్యాప్తంగా ఒకేసారి 45 ప్రాంతాల్లో ఈ రోజ్‌గార్ మేళా నిర్వహించనున్నట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తెలిపింది. అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకోనున్న అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో విధుల్లో చేరనున్నారు. వీటిలో రెవెన్యూ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం, రక్షణ మంత్రిత్వ శాఖ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు ఉన్నాయి. యువతకు ఉద్యోగ అవకాశాలను విస్తరించడం, దేశ అభివృద్ధి ప్రక్రియలో వారిని మరింత భాగస్వాములను చేయడమే రోజ్‌గార్ మేళా లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 20వ రోజ్‌గార్ మేళా పూర్తయ్యే నాటికి ఈ కార్యక్రమం ద్వారా అపాయింట్‌మెంట్ లెటర్లు అందుకున్న యువత సంఖ్య 12.75 లక్షలకు చేరుతుందన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ఢిల్లీ పాఠశాలలకు బాంబు బెదరింపులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు వరుసగా బాంబు బెదరింపులు రావడం కలకలం రేపుతోంది. శుక్రవారం మయూర్ విహార్ ఫేజ్-1లోని బలరామ్ పబ్లిక్ స్కూల్‌కు బాంబు బెదరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర భద్రతా బృందాలు పాఠశాల వద్దకు చేరుకున్నాయి. ఢిల్లీ ఫైర్ సర్వీస్ అధికారుల ప్రకారం.. ఉదయం 8.40 గంటలకు పాఠశాలలో బాంబు ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే భద్రతా బృందాలు పాఠశాలలకు చేరుకుని తనిఖీలు ప్రారంభించాయి. పాఠశాల ప్రాంగణంలోని తరతి గదులు, కారిడార్లు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

### అసెంబ్లీ ఆమోదించిన 12 బిల్లులకు గవర్నర్ ఆమోదం..



**చెన్నై, సెప్టెంబరు 18:** తమిళనాట నాలుగు నెలల క్రితం విజయ్ నేతృత్వంలో టీవీకే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. తాజాగా తొలి అసెంబ్లీ సమావేశాలు కూడా నిర్వహించుకుంది. ఇందులో ప్రభుత్వం మొత్తం 13 బిల్లుల్ని ఆమోదించింది. అనంతరం వీటిని గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఇందులో రాష్ట్రపతి రాజేంద్ర అర్లేకర్ 12 బిల్లులకు ఆమోద ముద్ర వేశారు. కేవలం ప్రైవేటు యూనివర్సిటీల బిల్లును మాత్రం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పరిశీలనకు పంపారు. ఈ మేరకు తమిళనాడు గవర్నర్ అర్లేకర్ ఆమోదించిన బిల్లుల్లో డీటీసీపీ, ఎమ్మెల్యేల వాహనాలు, తమిళనాడు పెట్టుబడుల ప్రోత్సాహక కమిషన్, టాస్మాక్ మద్యంపై వ్యాట్ , పట్టణ స్థానిక సంస్థలకు టీఎన్పీఎస్సీ ద్వారా నియామకాలకు సంబంధించిన సవరణలు ఉన్నాయి.

### ఇండొనేసియాకు చేరుకున్న ఇటలీ గిఫ్ట్ నౌక

**జకార్తా, సెప్టెంబరు 18:** ఇండోనేషియా నౌకాదళ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశపు మొట్టమొదటి విమాన వాహక నౌక, ఇటలీకి చెందిన ఐటీఎస్ గిసెప్పే గారిబాల్డి, శుక్రవారం ఉదయం ఉత్తర జకార్తాలోని తాంజుంగ్ ప్రియోక్ నౌకాశ్రయానికి చేరుకుంది. 41 ఏళ్ల నాటి ఈ నౌకను ఇటలీ ప్రభుత్వం ఇండోనేషియాకు ఉచితంగా బదిలీ చేసింది.


ఇండోనేషియా జలాల్లోకి ప్రవేశించిన ఈ నౌకకు దేశీయ యుద్ధనౌకలు స్వాగతం పలుకుతూ పోర్టు వరకు తీసుకెళ్లాయి. రక్షణ మంత్రి స్జాఫ్రీ స్జామ్‌సోద్దీన్‌తో పాటు త్రివిధ దళాల అధిపతులు ఈ నౌకను అధికారికంగా ఆహ్వానించారు.

### కేంద్ర మంత్రి బిట్టూపై పంజాబ్‌లో కోడిగుడ్లతో దాడి

**ముంబయి, సెప్టెంబరు 18:** కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత రవ్నీత్ బిట్టు కాన్వాయ్‌పై పంజాబ్‌లో కోడిగుడ్లు, టమాటాలతో దాడి జరిగింది. బీజేపీ పంజాబ్ విభాగం చేపట్టిన డ్రగ్స్ ఫ్రీ పంజాబ్ యాత్రలో భాగంగా రవ్నీత్ బిట్టు పఠాన్‌కోట్ వెళ్తుండగా బాటాలాలో ఈ దాడి జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ నేతలే తన కాన్వాయ్‌పై దాడి చేశారని బిట్టు ఆరోపించారు.

ఈ విషయంలో ఆయనే తన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఘుసీత్‌పూర్ పరిధిలో తన కాన్వాయ్‌పై దాడి జరిగిందన్నారు.

### నలుగురు పైలట్లు సహా ఎనిమిది మందిపై వేటు!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** బ్రీత్‌లైజర్ పరీక్షలో జాప్యం చేసిన పైలట్లు, సిబ్బందిపై ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ విమాన ప్రయాణం తర్వాత నిర్దేశించిన రెండు గంటల వ్యవధిలోగా తప్పనిసరిగా బ్రీత్‌లైజర్ పరీక్ష చేయించుకోనందుకు నలుగురు పైలట్లతో సహా ఎనిమిది మంది సిబ్బందిని సస్పెండ్ చేసింది. విమానం ల్యాండ్ అయిన 2 గంటల 35 నిమిషాల తర్వాత తమ డిక్లరేషన్‌ను వారు సమర్పించారు. ఈ నేపథ్యంలో తమ సిబ్బంది పాల్పడిన ఈ ఉల్లంఘనను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నివేదించింది.

# ఇందిరమ్మ ఇళ్ల డ్రాలో జరిగిన పొరపాట్లు సరిచేస్తాం

**లబ్ధిదారులకు వారి నియోజకవర్గంలోనే ఇళ్ల కేటాయింపు**

**హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రివిలేజ్ మోషన్ నోటీసు నాకు అందలేదు : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్**

**హైదరాబాద్‌లోని 15 నియోజకవర్గాలకు సమస్యగా మార్చిన సంబంధిత అధికారి గౌతం నిర్లక్ష్యం : దానం నాగేందర్**



**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల డ్రాలో జరిగిన పొరపాట్లను దిద్దుబాటు చేస్తామని లబ్ధిదారులు ఏ నియోజకవర్గంలో ఓటరో అదే నియోజకవర్గంలో ఇళ్లను కేటాయించేలా మార్పులు, చేర్పులు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. జీరో అవర్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రివిలేజ్ మోషన్ అంశం లేవనెత్తగా స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ సభ్యుల మర్యాదకు భంగం జరిగితే సహించనని, తనకు ప్రివి లేజ్ మోషన్ నోటీసు అందలేదని ఇప్పుడు లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లను గౌతం అనే అధికారి సమస్యగా మార్చారని, ఎమ్మెల్యేలు 11:30 గంటలకు రావాలని చెప్పి పదకొండు గంటలకే డ్రా తీశారని దీనితో ఒక నియోజకవర్గంలోని లబ్ధిదారులకు మరో నియోజక వర్గంలో ఇళ్లు వచ్చాయని, తన నియోజకవర్గంలో అనేకమందికి ఇళ్లు రాలేదని ఆవేదన చెందారు. ఇందిరమ్మ ఇళ్లు హైదరాబాద్ సిటీలో ఉన్న 15 నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమస్యగా మారింది. ఇళ్లు డ్రా చేసే సమయంలో ఎమ్మెల్యేలందరికీ ఈ సమస్య ఎదురైంది. నా నియోజవకర్గంలో ఇతర నియోజకవర్గాల వారికి ఇళ్లు వచ్చాయి. మలక్‌పేటకు చెందిన వారికి ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇళ్లు కేటా యించారు. ఇళ్ల కేటాయింపుల్లో నిబంధనలు పాటిం చలేదు. మా నియోజకవర్గానికి కేటాయించిన ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని కోరుతున్నాం. వాళ్లు ఇతర నియోజకవర్గాలకు చెందిన వారైనా వారి నియోజకవర్గంలోనే వారికి ఇళ్లు రావాలి. ప్రజాప్రతినిధులందరికీ సమాన గౌరవం ఉండాలి. అధికారులు ప్రజాప్రతినిధులను చూసి భయపడి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం లేదు. ప్రతి ప్రజాప్రతినిధికి తన ప్రజల కోసం పోరాడే హక్కు ఉంది. అదే సమయంలో మాకు కూడా మా నియోజకవర్గ ప్రజల కోసం పోరాడే హక్కు ఉంది. మా నియోజకవర్గానికి సంబంధించిన ఇళ్లపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి. మొత్తం వ్యవహారంపై అధికారులు చెబుతున్నట్లు 360 డిగ్రీల స్క్రూటినీ జరిగితే పొరపాటు ఎక్కడ జరిగిందని ఆయన ప్రశ్నించారు. జీరో అవర్‌లో 43 మంది ఎమ్మెల్యేలు సమస్యలను ప్రస్తావించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ముథోల్ రామారావు పవార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతం సాగునీటి వన రులు లెండి, మాదాపూర్ పెద్దచెరువు, నిజాంసాగర్ కెనాల్ దురాక్రమణ, అలీసాగర్ వంటి అభివృద్ధి కార్యక్రమాలను సభ దృష్టికి తెచ్చారు. కరెంటు సమస్య కోతలు రైతుల ఇబ్బందులు, హైటెన్షన్ వైర్ల తొలగింపు వంటి అంశాలపై కూచమల్ల రాజశేఖర్‌రెడ్డి, కె.నాగరాజు, కూనంనేని సాంబశివరావు, డాక్టర్ సంజీవరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి ధనపాల్ సూర్యనారాయణవాజిద్ మట్టా రాగమయి, వెడ్మబొజ్జ బీర్ల ఐలయ్య, మనో హర్‌రెడ్డి జారే అదినారాయణ శంకరయ్య సభలో ప్రస్తావించారు.

## ఎల్‌నినో పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే యత్నం

**బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎల్‌నిఒ పేరుతో ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తుందని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. మంత్రుల ఉపన్యాసాలు చాలించి రైతులకు సమాధానాలు చెప్పాలన్నారు. ఆరు నెలల ముందే హెచ్చరికలు వచ్చాయని, చర్యలు ఎందుకు తీసుకోలేదు? అంటూ ప్రశ్నించారు. రూ.802 కోట్ల నిపుణుల కమిటీ నివేదిక ఎక్కడ? అమలు చేసిన సిఫార్సులు ఎన్ని? కంటింజెన్సీ ప్లాన్ ఉందా? లేదంటే రైతులను గాలికొదిలేశారా? అన్నారు. విత్తనాలు, నీరు, ప్రత్యామ్నాయ పంటలపై ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళికే లేదా? అన్నారు. దక్షిణ తెలంగాణ నుంచి ఉత్తర తెలంగాణ వరకు రైతు నష్టానికి బాధ్యులు ఎవరు? 24 గంటల ఉచిత విద్యుత్ హామీ ఎక్కడ? రైతులకు 6-8 గంటల కరెంటే ఎందుకు? డిస్కమ్‌లకు రూ.35 వేల కోట్లు, సింగరేణికి రూ.64 వేల కోట్ల బకాయిలు ఇదే విద్యుత్ సంక్షోభానికి కారణమా? అన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే కరెంట్ కోసం రైతుల ధర్నా ఇంతకంటే వైఫల్యానికి నిదర్శనం ఏమిటని ప్రశ్నించారు. రిపేర్ల పేరుతో కాలయాపన చేవారని, రైతుల కష్టాలపై ప్రభుత్వం నిద్రపోయిందా? అన్నారు. కాళేశ్వరం లోపాలపై రాజకీయ విమర్శలు కాదు తక్షణ మరమ్మతులు ఎప్పుడు? ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల నివేదిక తర్వాత కూడా చర్యలు ఎందుకు ఆలస్యం? అన్నారు. ప్రతి ఎకరాకు కనీసం రూ.15,000 నష్టపరిహారం ఇవ్వాలని, రైతు కూలీలకు హామీ ఇచ్చిన రూ.12,000 ఎక్కడ అన్నారు. ఉపాధి హామీ బడ్జెట్‌ను రూ.4,341 కోట్ల నుంచి రూ.1,500 కోట్లకు ఎందుకు కుదించారన్నారు.

## సమర్థవంతంగా ఎల్‌నినోను ఎదుర్కొంటాం

**ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు**

**కనీవినీ ఎరుగని రీతిలో విద్యుత్ వినియోగం**

**అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో ఈ రోజు కొత్తగా వస్తున్నది కాకపోయినా గతంలో వాటికి ఇప్పటికి చాలా తేడా ఉంద న్నారు. శాసనసభలో ఎల్‌నినో పరిస్థితులపై శుక్రవారం జరిగిన చర్చలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వర్షాలు తక్కువగా పడిన సంవత్సరాలను చూస్తే 1951, 1965, 1972, 1982, 1987 2002, 2015లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయిందన్నారు. గత సంవత్సరం చూస్తే సాధారణ వర్షపాతం కంటే 37 శాతం వర్షాలు పడ్డాయని తెలిపారు. తక్కువ వర్షపాత కారణంగా ప్రధాన రంగాలపై ప్రభాం పడే వాటిలో వ్యవసాయం, తాగునీరే కాకుండా సాధారణ ఉష్ణోగ్రత కూడా ఊహించనంత వేగంగా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని శాస్త్రజ్ఞులు చెబుతున్నారన్నారు. సుదీర్ఘంగా ఈ ఎల్ నినో దానికి సంబంధించిన దానికి రాబోయే పరిణామాల మీద రాష్ట్ర కేబినెట్ మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించి తగిన చర్యలు తీసుకున్నారని వెల్లడించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకి ఒక ఇన్‌చార్జి మంత్రితోపాటు, ఇతర కమిటీలను ఏర్పాటు చేసి వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా పడే ప్రాంతంలో ఒక గంటలోనే అత్యధిక వర్షం పడిన కారణంగా మిగిలిన ఇరవై తొమ్మిది రోజులు డ్రైవ్ ఉండేసరికి ఆ పద్ద వర్షం అయితే లెక్కల కనిపిస్తుంది కానీ అది ఉపయోగం లేని వర్షంగా పేర్కొన్నారు. వర్షాభావం కారణంగా విద్యుత్ వినియోగం కూడా రికార్డు స్థాయిలో నమోదవుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోకూడా ఎన్నడూ లేని విధంగా ఒక్క 9వ తేదినే 19575 మెగావాట్లు కనీవినీ రీతిలో వినియోగం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 33 లక్షల పంపుసెట్లు రైతులు వినియోగి స్తున్నారని చెప్పారు. ఆ విధమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవటమే కాకుండా వాటిని కార్యరూపంగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

## యాదగిరిగుట్టకు రోప్‌వే.. కొండగట్టుకు ఘాట్‌రోడ్

**ఆర్‌బిఐ హడ్కో రుణాలతో హ్యామ్ రోడ్లు**

**15 రోజుల్లో నిర్మాణపనులు ఆరంభం**

**జీరో అవర్‌లో ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** యాదగిరి గుట్టకు రోప్‌వే, కొండగట్టుకు ఘాట్ రోడ్ వేయడానికి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకొందని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. యాదగిరిగుట్టకు రోజుకు లక్షమంది భక్తులు వస్తున్నారు బ్రిడ్జ్ స్థానంలో రోడ్ వెడల్పు చేసేందుకు కసరత్తు జరుగుతుంది కేంద్రం సహకారంతో పర్వత్ మాలా స్కీంలో 2రోప్ వేలు యాదగిరిగుట్ట,తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాము అని కోమటిరెడ్డి ప్రకటించారు. శుక్రవారం జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు కౌసర్‌మోహినోద్దిన్, రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్,మల్‌రెడ్డి రంగారెడ్డి, మేడిపల్లి సత్యం కసిరెడ్డి నారాయణరెడ్డి, కాలెయాదయ్య,కడియం శ్రీహరి లేవనెత్తిన సమస్యలపై మంత్రి సమాధానం ఇచ్చారు. హ్యామ్‌రోడ్లు వేయడానికి ఆర్‌బిఐ,హడ్కో నుంచి రుణాలు తీసుకొన్నామనీ, లెటర్‌ఆఫ్ అక్సెప్టెనీ కూడా ఇచ్చామని హ్యామ్ రోడ్లకు సంబంధించి అగ్రిమెంట్ కూడ పూర్తి అయింది వర్షకాలం వల్ల పనులు ప్రారంభం కాలేదు వచ్చే 15రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయనీ, తెలం గాణలో రోడ్ల సంబం ధించి అన్ని పనులు ప్రారంభిచాలని ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామనీ వివరించారు. మీర్గాన్ పేట,కుంటులూరు, కోహెడ ఇంటర్నేషనల్ మార్కెట్ వచ్చే రూట్ కాబట్టి 4లైన్ రోడ్ల వేస్తున్నామనీ తెలిపారు.కొండగట్టు అంజన్న దేవాలయ ఘాట్ రోడ్ సంబంధించి 3,4 రోజుల క్రితమే డిజైన్ పూర్తి అయిందనీ తెలిపారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ లేవనెత్తిన సమస్యపై వెంకటరెడ్డి మాట్లాడుతూ దోతిగూడెం గ్రామానికి అనుకోని కంపెనీలు ఏర్పాటు చేయడంతో కాలుష్య పెరిగిందనీ, గతంలో కూడ అక్కడ ప్రమాదం జరిగి ఇద్దరు మరణించారనీ అసెంబ్లీ సమావేశాల తరువాత అధికారులతో మాట్లాడి అక్కడి నుండి వేరే చోటుకి తరలించడానికి చర్యలు తీసుకుంటాం మూసీ శుద్ధి చేయటానికి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నారనీ తెలిపారు.

**ఆమరణ నిరాహారదీక్ష చేస్తా: కాంగ్రెస్ ఎమ్మెల్యే కవ్వంపల్లి**

పాతబకాయిలు చెల్లించకపోవడంతో రోడ్లు వేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. మానకొండూరు నియోజకవర్గంలో త్వరగా రోడ్లు వేయాలని లేదంటే ఆమరణ నిరాహారాదీక్ష చేస్తానని హెచ్చరించారు. రోడ్లు దెబ్బ తినడంతో ప్రభుత్వప్రతిష్ట మసకబారుతోందని ఆవేనద చెందారు.

## రాష్ట్రంలో ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

**సిఎంకు అద్దంకి దయాకర్, ఝాన్సీరెడ్డి వినతిపత్రం**

**హైదరాబాద్,సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రత్యేక ఎన్‌ఆర్‌ఐ కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్, టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి వినతిపత్రం శుక్రవారం ఇచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ పౌరుల ప్రయోజనాలను పరిరక్షించడానికి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి రాష్ట్రంలో తక్షణమే ఒక ప్రత్యేక నాన్‌రెసిడెంట్ ఇండియన్‌కమిషన్‌ను ఏర్పాటు చేయానీ కోరారు. అమెరికా, గల్ఫ్ దేశాలు, యూరప్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో ఉన్న తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు పెట్టుబడులు, రెమిటెన్స్‌లు, సాంకేతికత, దాతృత్వం, విద్య, వైద్య రంగాల ద్వారా రాష్ట్ర పురోగతికి నిరంతరం గణనీయ సహకారాన్ని అందిస్తున్నారని కొనియాడారు. అయితే ఎన్‌ఆర్‌ఐలు, వారి కుటుంబాలు స్వరాష్ట్రంలో ఆస్తి వివాదాలు, కుటుంబ అత్యవసర పరిస్థితులు, చట్టపరమైన సహాయం, విదేశీ సంక్షోభాల సమయంలో ప్రభు త్వ శాఖలతో నేరుగా సమన్వయం చేసుకోవడంలో తీవ్ర సవాళ్లను ఎదుర్కొం టున్నారని గుర్తుచేశారు. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారంగా, ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐల మధ్య అనుసంధాన 'సింగిల్‌విండో' వ్యవస్థగా పని చేసేలా ప్రతిపాదిత ఎన్‌ఆర్‌ఐ కమిషన్ పది కీలక బాధ్యతలను నెరవేరుస్తుం దని వివరించారు. భారత ప్రభుత్వం, భారతీయ రాయబార కార్యాల యాలు, కాన్సులేట్లు విదేశీ కమ్యూనిటీ సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, ఎన్‌ఆర్‌ఐ సమస్యలు భయాందోళనపై క్రమానుగతంగా సమావేశాలు, సంప్రదింపులను నిర్వహించవచ్చని స్పష్టం చేశారు.

## జపాన్‌లో తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు

**టిఒఎంసిఒఎమ్ - పిఒజిఎల్‌ఐ మధ్య కీలక ఒప్పందం**

**మంత్రి వివేక్‌వెంకటస్వామి సమక్షంలో ఎంఒయు సంతకం**

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** జపాన్‌లో తెలంగాణ యువతకు నైపుణ్య ఆధారిత ఉపాధి అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) కీలక ముందడుగు వేసింది. జపాన్‌కు చెందిన పిఒజిఎల్ ఐతో టాంకాం శుక్రవారం సచివా లయంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. టాంకాం ఎండీ కాంతి వెస్లీ, పిఒజిఎల్‌ఐ వ్యవస్థాపకులు, సిఇవో డా. కరుణ్ మల్హోత్రా ఒప్పం దంపై సంతకాలు చేశారు. జపాన్‌లోని కంపెనీలలో ఉద్యోగ అవకా శాలను గుర్తించడం, సంబంధాలను ఏర్పరచు కోవడం పోగ్లీ బాధ్యత కాగా.. అభ్యర్థుల ఎంపిక, రిజిస్ట్రేషన్, ప్రాథమిక స్క్రీనింగ్, డాక్యుమెంటేషన్, జపనీస్ భాషా శిక్షణ, ప్రీ డిపార్చర్ శిక్షణను టాంకాం చేపట్టనుంది. జపాన్‌లో ఉద్యోగాలకు అవసరమైన ట్రేడ్ నైపుణ్యాలు, జపనీస్ భాషా ప్రావీణ్యం, అక్కడి పని సంస్కృతి, జీవన విధానంపై అవగాహన కల్పించేలా రెండు సంస్థలు కలిసి శిక్షణ విధానాన్ని రూపొందించనున్నాయి. తొలుత జపాన్‌లోని కన్సాయ్ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించి, అనంతరం ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నారు.తొలి ఏడాదిలో 400 నుంచి 500 మంది తెలంగాణ యువతకు జపాన్‌లో ఉద్యోగాలు కల్పించే దిశగా సంస్థలు పనిచేయనున్నాయి. జపాన్‌లో ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న తెలంగాణ యువతకు టాంకాం ఇప్పటికే జపనీస్ భాషలో శిక్షణ అందిస్తోంది. విదేశాల్లో తెలంగాణ యువతకు సురక్షితమైన, పారదర్శకమైన, దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ సహా ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన తెలంగాణ యువతకు అవకాశాలు కల్పించేలా టాంకాం చర్యలు కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు.



శుక్రవారం సచివాలయంలో మంత్రి వివేక్ సమక్షంలో జపాన్‌కు చెందిన పిఒజిఎల్‌ఐతో అవగాహన ఒప్పందం చేసుకున్న టాంకాం ప్రతినిధులు

# మిల్లర్లు సమ్మెబాట పట్టొద్దు

**ధాన్యం కొనుగోలులో 'రైస్‌మిల్లర్లు' కీలక భాగస్వాములు**

**రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు**

**తెలంగాణ మంత్రివర్గ ఉపసంఘం**



శుక్రవారం రైస్ మిల్లర్ల ప్రతినిధుల సమావేశమంలో మాట్లాడుతున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** మిల్లర్లు సమ్మెబాట పట్టవద్దని, ధాన్యం కొనుగోలులో రైసుమిల్లర్లు కీలకభాగస్వాములుగా చూస్తామని ఇకపై ప్రత్యర్థులుగా చూడమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పరిశ్రమల ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతో శుక్రవారం రైస్ మిల్లర్ల ప్రతినిధుల సమావేశమయ్యారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సహృద్భావ వాతావరణంలో విస్తృత చర్చలు జరిగాయి. రైతుల ప్రయోజనాలు, ప్రజాధన పరిరక్షణ, మిల్లింగ్ రంగం స్థిరత్వం ప్రభుత్వ లక్ష్యమనీ చెప్పారు. మిల్లర్ల వినతులను సానుకూల దృక్పథంతో పరిశీలించి సాధ్యమైన పరిష్కారం చూపుతామనీ అన్నారు. మిల్లర్లపై అనవసర భారం మోపాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదనీ మంత్రి ఉత్తమ్ వివరణ ఇచ్చారు. రైతులకు చెల్లించిన మద్దతు ధరను, ప్రభుత్వ వడ్డీ భారాన్ని విస్మరించలేం అని అన్నారు. బ్యాంకుల నుంచి అప్పులు తీసుకొచ్చి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామనీ చెప్పారు. పెనాల్టీలు, టెండర్ ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, పెండింగ్ సరఫరాలపై సమగ్ర పరిశీలఏడాది కాలం మాత్రమే ఉంటుదని తెలిపారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరఫరాలతో పౌర సరఫరాల సంస్థపై పెరిగిన వడ్డీ భారం పెరిగిందని తెలిపారు. మిల్లర్ల ప్రయోజ నాలు రైతుల ప్రయోజనాలు కాపాడూతూ మధ్యమార్గంగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రభుత్వ చిత్తశుద్ధిని గుర్తించి ప్రస్తుత సమ్మెను విరమించాలని మిల్లర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. మిల్లర్ల వినతుల పరిశీలనకు నాలుగైదు రోజుల గడువును మంత్రి కోరారు. కమిషనర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యయం, నిబంధనలు, పరిష్కార మార్గాలపై అధికారుల కసరత్తుచేస్తున్నారని తెలిపారు. నాలుగైదు రోజుల్లో మిల్లర్ల ప్రతినిధులతో మరోసారి సమావేశమై తుది నిర్ణయంతీసుకొంటామని తెలిపారు. ఏకపక్ష నిర్ణయాలకు తావులేకుండా పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సాధిస్తామనీ ఉత్తమ్ తెలిపారు. ఘర్షణకు బదులు చర్చలతో సమస్యకు ముగింపు పలకాలన్నదే ప్రభుత్వ సంకల్పంరైతు సంక్షేమం, ప్రజాధనం, మిల్లింగ్ రంగం ప్రయోజనాల మధ్య సమతుల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని వివరించారు. పెనాల్టీలు, టెండర్ ధాన్యం ధరలు, స్టాక్ వ్యత్యాసాలు, సరఫరా గడువు పొడిగింపు, క్షేత్రస్థాయి లో ఎదురవుతున్న ఇతర ఇబ్బందులను మిల్లర్ల ప్రతినిధులు మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకువచ్చారు. వారి అభ్యంతరాలు, ఆందోళనలను మంత్రులు ఓపికగా విని, అంశాలవారీగా అధికారులతో చర్చించారు.మిల్లర్లను ప్రభుత్వం ప్రత్యర్థులుగా కాకుండా ధాన్యం కొనుగోలు-మిల్లింగ్ వ్యవస్థలో కీలక భాగస్వాములుగా చూస్తోందని స్పష్టం చేశారు.రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల సంస్థ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుంటోందని, ఆ నిధులతో రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తున్నామని వివరించారు. రైతులకు చెల్లించిన కనీస మద్దతు ధరతోపాటు బ్యాంకులకు చెల్లిస్తున్న వడ్డీని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.టెండర్ ధాన్యం ధర రెండు నెలల క్రితం నిర్ణయించినది కావచ్చు. కానీ ఆ తర్వాత కూడా పౌర సరఫరాల సంస్థ బ్యాంకులకు నిరంతరంగా వడ్డీ చెల్లిస్తూనే ఉంది. ప్రభుత్వం ఖర్చు చేసిన వాస్తవ మొత్తాన్ని తిరిగి రాబట్టుకోవడమే మా ఉద్దేశం. అంతకు మించి మిల్లర్లపై భారం వేయాలన్న ఆలోచన లేదు' అని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## భూహక్కు పత్రాలు

## నేడు జిఒ 118 బాధితులకు పంపిణీ

**బాధితుల సమస్యపై మంత్రులతో మధుయాష్కిగౌడ్ భేటీ**

**పూర్తి యాజమాన్య హక్కులతో రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించాలని సూచన**

**నేడు ఎల్‌బినగర్‌లో బాధిత కాలనీల ప్రజలతో సభ**

**హైదరాబాద్,సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** భూహక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు జిఒ 118 బాధితులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశామనీ ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్ పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని జీవో 118 బాధిత కాలనీల ప్రజలకు రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కట్టుబడి ఉన్నట్లు అసెంబ్లీలో శుభవార్త ప్రకటించారనీ దీనికి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాననీ యాష్కి చెప్పారు. రెవెన్యూ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు మధుయాష్కి శుక్రవారం అసెంబ్లీలోని వారి ఛాంబర్ లో మంత్రికలిశారు.మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు పర్వతి గణేష్ రెడ్డి, జీవో 118 బాధిత కాలనీల ప్రతినిధులతో పాటు మంత్రిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఛాంబర్ లో మంత్రితో పాటు హై పవర్ కమిటీ అయిన సిసిఎల్‌ఎ లోకేష్ కుమార్ , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్ గాంధీ హనుమంతుతో ప్రత్యేకంగా సమావేశమై.. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. గతంలో తప్పులు తడకగా జీవో 118తో ఇచ్చిన డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ తో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. తప్పుల తడకగా ఇచ్చిన జీవో 118 ను పక్కన పెట్టి.. న్యాయపరమైన చిక్కులకు అవకాశం లేకుండా 22ఎ నుంచి తొలగించేలా చూడాలని మధుయాష్కి, బాధిత కాలనీల ప్రతినిధులు కోరారు. స్పందించిన మంత్రిగారు హై పవర్ కమిటీ ప్రతినిధులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. బాధిత కాలనీల ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సూచనలను పరిగణలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల శ్రీధర్ బాబుని కూడా వారు కలిసి రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం పై తమ అభిప్రాయాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో లబ్ధి కోసమే గత బిఆర్ఎస్ ప్రభుత్వం తప్పుల తడకగా చెత్త జిఒ నం 118 ను తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారన్నారు.

హుడా లే అవుట్ లలో కష్టపడి కొనుక్కున్న స్థలాల యజమానులను భూఆక్రమణదారులుగా పేర్కొంటూ జివో 118 విడుదల చేశారని విమర్శించారు. డబల్ టాక్స్ లు విధించి ప్రజలను ఇబ్బందులు పెట్టారన్నారు. ఈ విషయాలన్నీ మంత్రులకు వివరించామని, సిఎం రేవంత్‌రెడ్డి కూడా ఎంపిగా ఉన్నప్పటి నుంచి ఈ సమస్య, ఈ జివొ నెంబర్ 118 తో చేసిన మోసం తెలుసన్నారు. అందుకే సమస్య పరిష్కరించేందుకు జిఒ 118 తో సంబంధం లేకుండా, నూతన హక్కు పత్రాలను అందజేసి ప్రజలకు శాశ్వతంగా సమస్య పరిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి కృషి చేస్తున్నారని.. 44 బాధిత కాలనీల ప్రజలకు న్యాయం జరగనుందని.. వారికి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను పేర్కొన్నారు.

బాధిత కాలనీలతో మంత్రుల సమావేశం రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం విషయంపై శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్బీనగర్ నియోజకవర్గంలో బాధిత కాలనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సభ నిర్వహిస్తున్నట్లు మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరై బాధిత కాలనీల ప్రజలతో మాట్లాడి నూతన హక్కు పత్రాలను పంపిణీ చేస్తారన్నారు.

## మీడియా పాయింట్

### ధరణి పేరుతో బిఆర్ఎస్ భూదోపిడీ

**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** ధరణిని పేరుతో బిఆర్ఎస్ భూదోపిడీకి పాల్పడిందని ప్రభుత్వం విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'ప్రతిపక్ష బి.ఆర్.ఎస్ నాయకులు మేము బయటపెట్టిన వాస్తవాల మీద తప్ప మిగతావి మాట్లాడుతున్నారు. కే.టి.ఆర్., హరీశ్‌రావు, కేసీఆర్ భూస్వాములు ఐతే 2004 ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్క ఎకరా ఉన్నట్లు కూడా ఎందుకు చూపించలేదు? అసెంబ్లీలో ముఖ్యమంత్రి వాస్తవాలు బయటబెడితే బుకాయిస్తున్నారు. అవాస్తవాలు ప్రచారం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న 380 ఎకరాలు ఉన్న భూములు మీ అధీనంలోకి ఎందుకు తీసుకున్నారు? దళితుల అసైన్డ్ భూములు ధరణి తెచ్చి మీ కస్టడీలోకి ఎందుకు తీసుకున్నారు? అసెంబ్లీ సాక్షిగా ధరణి పేరుతో మీరు చేసిన దగా, మోసం ముఖ్యమంత్రి బహిర్గతం చేసారు. కేటీఆర్ కు అన్ని భూములు, ఆస్తులు ఎలా వచ్చాయో ఆ ట్రిక్ తెలంగాణ ప్రజలకు తెలిపాలి! తెలంగాణ ప్రజలు కూడా అభివృద్ధి చెందుతారు..సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణను గాయి గాయి చేశారు. తెలంగాణ సంపద దోచుకున్నారు, 2004, 2009, 2014, 2018లో వీరి ఎన్నికల అఫిడవిట్లు తెలంగాణ ప్రజానీకం పరి శీలించాలి.

### 22ఎలో ఎన్ని భూములు ఉన్నాయ్?: బిజెపి ఫ్లోర్‌లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి




లక్షల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని కేవలం రాజకీయాలు చేస్తున్నారని బిజెపి ఫ్లోర్ లీడర్ ఎలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీ మీడియాపాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'సిట్ ఎందుకు వేశారు? సెట్ చేసుకోవడానికా? 22ఏ లో ఎన్ని భూములు ఉన్నాయి? అసైన్డ్ భూములు ఎవరి అధీనంలో ఉన్నాయి? బయటపెట్టాలి. బి.ఆర్.ఎస్, కాంగ్రెస్ ఇద్దరూ ఒకరిని ఒకరు కాపాడుకోవడానికి నాటకాలు చేస్తున్నారు. నాదగ్గర ఉన్న ఆధారాలు కూడా ఇస్తాం.రెవెన్యూ మంత్రి చేసిన అవినీతిపై కూడా ఆధారాలు ఉన్నాయి. జ్యుడీషియల్ ఎంక్వయిరీ జరిగే వరకు బిజెపి పార్టీ పోరాటం చేస్తుంది. పార్ట్ 1బిలో ఐదు లక్షల ఎకరాలు ఎందుకు డిలీట్ అయ్యాయి? సదా బైనమాల అంశంలో కూడా ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలి' అని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

### సౌండ్ సిస్టమ్స్‌పై ఆంక్షలు విధించొద్దు: డిజిపికి పాయల్ శంకర్ విజ్ఞప్తి

హిందువుల పండుగల సందర్భంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై అనేక ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఈ అంశాన్ని శాసనసభలో కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాఉడతూ నిబంధనలకు లోబడి సౌండ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకునే వారిపై ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. చట్టం, నిబంధనలకు అనుగుణంగా సౌండ్ సిస్టమ్స్ వినియోగించే వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడాలని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

### ఎల్‌నినో ఎఫెక్ట్ తగ్గించే చర్యలపై

# మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి గ్రామాల్లో అవగాహన

### తాగునీరు, ఉపాధికి ఇబ్బంది లేకుండా చూస్తాం

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే చర్యలపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ధనసరి అనసూయ తెలిపారు. శాసన సభలో ఎల్‌నినో పరిస్థితులపై శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, ఉపాధికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపడుతూ ప్రభుత్వం ముందుగానే



అప్రమత్తమైందన్నారు. అధికారులు జిల్లాల్లో పర్యటిస్తూ సిబ్బందిని సమాయత్తం చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా నీటి, ఉపాధి సమస్యలు ఎదురవుతాయని వెల్లడించారు. తాగునీటికి ప్రాధాన్యత ఇస్తూ సాగునీటి అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 34 రిజర్వాయర్లను తాగునీటి కోసం వినియోగిస్తున్నామని, అన్ని జలాశయాల్లో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఒక్క సింగూరు లోనే నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. అయినప్పటికి ప్రత్యమ్నాయంగా గ్రామాల వారిగా యాక్షన్ ప్లాన్ సిద్దం చేసినట్లు చెప్పారు. నీటి నిల్వలు తక్కువగా ఉన్న రిజర్వాయర్లలో డెడ్ స్టోరేజీ నీటిని వినియోగించుకునేందుకు మోటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి కోసం కేంద్రం అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, కేంద్రం పెద్దన్న పాత్ర పోషించి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో అంటే కేవలం ఎండలు పెరగడం కాదన్నారు. వర్షం పడినప్పుడు నీటిని వృథాగా పోనివ్వకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇందులో భాగంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఇంటింటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఊరికి ఊట కుంట లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. సోక్ పిట్లు, ఫామ్ పాండ్లు, పెర్కొలేషన్ ట్యాంకులు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో పరిస్థితుల్లో మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే 5 కోట్ల 91 లక్షల మొక్కలు నాటామని తెలిపారు. ఎవరో తెచ్చిన కరువు కాదని, కష్టం కాదని, వేల కీలోమీటర్ల దూరంలో పసిఫిక్ సముద్రంలో ఏర్పడ్డ పరిస్థితని వ్యాఖ్యానించారు. వర్షాలు తగ్గితే వ్యవసాయ పనులు తగ్గి కూలీలకు ఉపాధి తగ్గుతుందని, అందుకే పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 60 కుటుంబాలకు పని కల్పించే లక్ష్యంతో పనులు చేపట్టామని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల్లో 7.3 కోట్ల పని దినాలు కల్పించామని, 21 లక్షల కుటుంబాలకు, 31.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభించిందన్నారు. ఇప్పటివరకు రూ.2 వేల కోట్లకు పైగా వేతనాలను నేరుగా కూలీలకు చెల్లించామని చెప్పారు. వీబీజీ రాంజీ వల్ల రాష్ట్రం మీద 40 శాతం భారం పడుతోందని, అందుకే గతంలో మాదిరిగా ఎల్‌నీనో కాలంలో కేంద్రం 90 శాతం నిధులు కేంద్రం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## గ్రామీణ ప్రాంతాలకు మరో 2 లక్షల ఇళ్లు మంజూరు

### కేంద్రమంత్రి బండి సంజయ్ హర్షం

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు 2 లక్షల ఇండ్లను కేంద్రం మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించడం పట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లోని పేదల కోసం 1.13 లక్షల ఇండ్లను కేంద్రం మంజూరు చేసిందని తెలిపారు. తెలంగాణలోని అర్హులైన పేదలందరికీ ప్రధానమంత్రి ఇందిరా ఆవాస్ యోజన కింద ఇండ్లను మంజూరు చేసేందుకు నరేంద్రమోడీ, శివరాజ్ సింగ్ చౌహాన్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. అందులో భాగంగానే 2 లక్షల ఇండ్లను మంజూరు చేసిందని పేర్కొన్నారు.

## యూరప్‌పై రష్యా హైబ్రిడ్ దాడులు తీవ్రం: మాక్రాన్ హెచ్చరిక



**పారిస్, సెప్టెంబరు 18:** యూరప్‌తో పాటు ఫ్రాన్స్‌పైరా రష్యా హైబ్రిడ్ దాడులు ఇటీవలి వారాల్లో మరింత తీవ్రతరం అయ్యాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌పై కొనసాగుతున్న యుద్ధం నేపథ్యంలో యూరప్ దేశాల ప్రభుత్వాలు భద్రతాపరమైన ముప్పులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో మాక్రాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎలీసీ ప్యాలెస్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన కీలక మౌలిక సదుపాయాలు, అత్యంత సున్నితమైన రక్షణ పరిశ్రమ కేంద్రాలకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఇటీవలి వారాల్లో ఫ్రాన్స్ కూడా రష్యా హైబ్రిడ్ దాడులకు లక్ష్యంగా మారిందని మాక్రాన్ వెల్లడించారు. దీనికి ఎలాంటి ప్రతిస్పందన లేకుండా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. యూరప్ దేశాలను భయపెట్టడం, ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వాలన్న వాటి సంకల్పాన్ని బలహీనపరచడమే ఈ దాడుల లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఉక్రెయిన్‌కు మద్దతు విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కీలక ఫ్రెంచ్ కేంద్రాలకు రక్షదేశంలోని కీలక మౌలిక సదుపాయాలతో పాటు అత్యంత సున్నితమైన రక్షణ, సాంకేతిక కేంద్రాల భద్రతను మరింత బలోపేతం చేయాలని ఫ్రెంచ్ ప్రభుత్వం నిర్ణయించినట్లు మాక్రాన్ తెలిపారు. డ్రోన్ దాడులు, సైబర్ దాడులు వంటి ముప్పులను ఎదుర్కోవడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమన్నారు. యూరప్ ప్రభుత్వాలు సాధారణంగా ఇలాంటి చర్యలను హైబ్రిడ్ దాడులుగా పేర్కొంటున్నాయి. మధ్యప్రాచ్యం, ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధాల వల్ల ఎదురయ్యే భద్రతా పరిణామాలపై ఫ్రాన్స్‌లోని వివిధ పార్టీల నేతలతో మాక్రాన్ సమావేశమైన అనంతరం ఈ హెచ్చరిక చేశారు. జర్మనీ, పోలాండ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఆయన ప్రస్తావించారు. గత నెలలో జర్మనీలోని లీప్‌జిగ్ విమానాశ్రయంపై జరిగిన డ్రోన్ దాడిని మాక్రాన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ దాడికి రష్యానే కారణమని జర్మనీ ఆరోపించింది. పోలాండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్ చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ఇటీవలి కాలంలో యూరప్ దేశాలతో పాటు ఫ్రాన్స్‌పై రష్యా హైబ్రిడ్ ముప్పు తీవ్రతరం అయిందని మాక్రాన్ తెలిపారు. యూరప్ దేశాలను భయపెట్టడం, ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే ప్రయత్నాలను బలహీనపరచడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. యూరప్‌పై దాడి చేయాలన్న ఉద్దేశం తమకు లేదని రష్యా పలుమార్లు ఖండిస్తూనే ఉక్రెయిన్‌లోకి సైనికులను పంపవద్దని యూరప్ దేశాలను రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హెచ్చరించారు.

# కేంద్రం రూ.20వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజ్ మంజూరు చేయాలి

### రాష్ట్రానికి కేంద్ర ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా పంపించాలి

### విబి-జి రాంజీపై ఖర్చుపెట్టే మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరించాలి

### తెలంగాణకు అదనంగా 1500 మెగావాట్ల విద్యుత్ కేటాయించాలి

### కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ తీర్మానం, ఏకగ్రీవంగా ఆమోదం

### ఎల్‌నినో తీవ్రప్రభావం, కరవు పరిస్థితులపై శాసనసభ తీవ్ర ఆందోళన



ఉపముఖ్య మంత్రి భట్టివిక్రమార్క

**హైదరాబాద్,సెప్టెంబరు18,ప్రభాతవార్త:** తెలంగాణ శాసనసభలో ఎల్‌నినో తీవ్ర ప్రభావం, కరువు పరిస్థితులపై శాసనసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.20వేల కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తీర్మానాలకు తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 2026 నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా తీవ్రమైన వర్షపాతం లోటు తలెత్తింది. సెప్టెంబర్‌లో రుతుపవనాలు మరింత బలహీనపడుతాయని భారత వాతావరణ శాఖ అంచనాలున్నాయని డిప్యూటీ సిఎం తెలిపారు. 2026 జూన్ 1 నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో సాధారణంగా కురవాల్సిన 664.5 మి.మీ. వర్షపాతానికి గాను 536.5 మి.మీ. మాత్రమే నమోదైంది. 20 శాతం లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 19 జిల్లాలు వర్షాభావ కేటగిరీలో ఉన్నాయి.

కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొందని పేర్కొన్నారు. వర్షపాతం లోటు, వర్షాల మధ్య వ్యవధి ఎక్కువగా ఉండటంతో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. రాష్ట్రంలో వానాకాలం సాధారణ పంటల సాగు విస్తీర్ణం 139.29 లక్షల ఎకరాలుంటే, కేవలం 88 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. వరి సాగు విస్తీర్ణం దాదాపు 18 శాతం తగ్గింది. పంట మొలకెత్తకపోవటంతో పలుమార్లు విత్తనాలు వేయాల్సి రావటంతో రైతులు, కౌలు రైతులపై పెట్టుబడి భారం ఎక్కువైందన్నారు. 2026 సెప్టెంబర్ 15 నాటికి రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో 585 టీఎంసీల సామర్థ్యానికి గాను 241 టీఎంసీల లైవ్ స్టోరేజ్ మాత్రమే ఉంది. గత ఏడాది ఇదే రోజున 497 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి మట్టం తగ్గటంతో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు రిజర్వు చేసుకోవాల్సి ఉందన్నారు. ఇప్పుడున్న నీటి నిల్వలు యాసంగి పంటలకు సాగునీటిని అందించేందుకు సరిపోవు. భూగర్భ జలాలు తగ్గటం, చెరువులు,కుంటల్లో ఆశించిన నీటి లభ్యత లేనందున తాగునీటి కొరత తలెత్తే అవకాశముందన్నారు.

వర్షాభావ పరిస్థితులు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ ఉపాధి, పశుసంపద, పశుగ్రాసం లభ్యతపై ప్రభావం చూపుతున్నాయన్నారు. సాగునీరు, తాగునీటి సరఫరాకు భూగర్భ జలాలు, విద్యుత్తుపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోంది. ఇప్పుడున్న పరిస్థితిని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించింది. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగుకు అవసరమైన విద్యుత్తు సరఫరాకు అవసరమైన ఉపశమన చర్యలు చేపడుతోంది. పరిస్థితుల తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలను అందించాల్సిన అవసరముందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితుల నుంచి ఉపశమన చర్యలు, అధిగమించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే తగినంత సహాయం అందించాలని తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా కోరుతోందని ప్రకటించారు. 1. ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందాన్ని వీలైనంత త్వరగా రాష్ట్రానికి పంపించాలి. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్‌డిఆర్‌ఎఫ్) నుంచి తగిన సాయం మంజూరు చేయాలి. రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్)లో కేంద్ర వాటాను సత్వరమే విడుదల చేయాలి. 2. పంట నష్టం/ఇన్‌పుట్ సబ్సిడీ, తాగునీరు, పశుగ్రాసం, పశు సంపద పరిరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువులు, ఇతర జలవనరుల పునరుద్ధరణతో పాటు ఉపశమన చర్యలకు తగిన సహాయం అందించాలి. అవసరమైతే అందుకు వీలుగా నిబంధనలను సడలించాలి. 3. విబి-జి రాంజీ పథకంలో 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలి. విబి-జి రాంజీపై ఖర్చు పెట్టే వ్యయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. రాష్ట్రంలో అమల్లో ఉన్న 60 రోజుల సీజనల్ సస్పెన్షన్ కాలాన్ని సడలించాలి. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించేందుకు లేబర్ బడ్జెట్‌ను తగినంతగా పెంచాలి.

4. రాష్ట్రానికి అవసరమైన ఎరువులను తగినంతగా, సకాలంలో కేటాయించాలి. ప్రభావిత జిల్లాలకు ముందుగానే రేక్‌ల ద్వారా సరఫరా చేయాలి. పర్ డ్రాప్ మోర్ క్రాప్ (పిడిఎంసీ) కింద కేటాయింపులను పెంచి డ్రిప్ ఇరిగేషన్‌ను వేగంగా విస్తరించాలి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవెలప్మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) కింద కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు ఆర్థిక సహాయం అందించాలి. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయాలి.

5. తెలంగాణకు అదనంగా 1,500 మెగావాట్ల విద్యుత్తు కేటాయించాలి. కేంద్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కేటాయించకుండా ఉన్న కోటా నుంచి దీన్ని అందించాలి. విండో-1 కింద 5 మిలియన్ టన్నుల బొగ్గు లింకేజీ నిర్ధారించి రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు రేక్‌ల లభ్యతను పెంచాలి. విద్యుత్తు ట్రాన్స్ మిషన్ ఛార్జీలను సడలించి, అవసరమైన సాయం అందించాలి.

6. తాగు, సాగు నీటి అవసరాలు, కరువు నివారణ చర్యలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్ల ప్రత్యేక సహాయ ప్యాకేజీ మంజూరు చేయాలి. చెరువులు, నీటి వనరుల పునరుజ్జీవనం, పురోగతిలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి వివిధ కేంద్ర పథకాల కింద తగిన సహాయం అందించాలి. 7. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని జీఎస్‌డీపీలో 3 శాతం నుంచి 3.5 శాతానికి పెంచాలి. తద్వారా ఉపశమన, నివారణ చర్యలకు అవసరమైన అదనపు వ్యయాన్ని రాష్ట్రం భరించేందుకు అవకాశం కల్పించాలి.

8. రైతులు, బలహీన వర్గాల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అదనపు ఆర్థిక సాయం అందించాలి. అందుకు అవసరమైన తీరుగా నిబంధనలను సడలించాలి అని కేంద్రాని కోరుతూ అసెంబ్లీలో డిప్యూటీ సిఎం ప్రవేశపెట్టిన తీర్మానం సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. .

# మారుతున్న కాలానుగుణంగా కులవృత్తులూ మారాలి

### మేదరి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి

### నెలలో నిధులు కేటాయిస్తాం : మంత్రి పొన్నం

### వైభవంగా ప్రపంచ వెదురు దినోత్సవాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** మేదరి కులస్తులు వంశపార్యంపరగా వస్తున్న తమ కులవృత్తిని కాపాడుకుంటూనే ఆధునిక సాంకేతికయుగంలో మారుతున్న కాలానుగుణంగా కులవృత్తులలోనూ మార్పులు తీసుకోవాలని, ముఖ్యంగా తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని తెలంగాణ రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కులసర్వేలో ఉన్నతస్తానాల్లో ఉన్న కుటుంబాలు పరిశీలిస్తే ఉన్నత చదువులు చదివిన కుటుంబాలు అభివృద్ధి చెందాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నెలలోనే మేదరి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఆయన హామీనిచ్చారు. తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రపంచ వెదురు దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మేదర కులస్తులు ఎంతో కళాత్మకంగా రూపొందించిన వివిధ వెదురు వస్తువులను ఆసక్తితో పరిశీలించారు. ఎక్కడైనా తగినంత స్థలం చూపిస్తే ప్రభుత్వం తరఫున సొసైటీని ఏర్పాటుచేసి అక్కడ తమ ఉత్పత్తులను తయారు చేసుకునే వీలుకల్పిస్తామని భరోసానిచ్చారు. మేదరి కార్పొరేషన్ మహేంద్ర కార్పొరేషన్ వేయడానికి మేదరి కులస్తులందరూ ఏకగ్రీవంగా ముందుకువస్తే తప్పక వేస్తామని, మేదరి కార్పొరేషన్ ఛైర్మన్‌ను అపాయింట్ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బడుగు బలహీనవర్గాలకు న్యాయం జరగడానికి ఏపార్టీలో లేనివిధంగా స్వేచ్ఛగా కొట్లాడుతున్నాం ... అడుగుతున్నామని తెలిపారు.

చదువుకి సంబంధించి చదువుతోపాటు తగిన నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మేదరి జీవన విధానం పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ, రాష్ట్రాధ్యక్షుడు జె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్, కోశాధికారి పాతకోటి ఉమా, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రమాకాంత్, మేదర మహేంద్ర సంఘం ఛైర్మన్ నోముల కిషన్, తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, శ్రావణ్‌కుమార్, బాల్‌రాజ్, రవికుమార్, నర్సింగరావు, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయం, వ్యవసాయ వృద్ధిపై దృష్టి



### ఆహార భద్రత, రైతుల జీవనోపాధి కీలక లక్ష్యాలు

### దక్షిణాదిన అపారమైన ఉద్యానవన సామర్థ్యం

### కొబ్బరి, జీడిపప్పు పెంచడంపై దృష్టి పెట్టాలి

### రాష్ట్రాల్లో విభిన్న పరిస్థితులతో ఈ సమావేశాలు అత్యవసరం

### దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రైతుల ఆదాయాలు, వ్యవసాయ వృద్ధిపై దృష్టి సారిం చినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఆహార భద్రత, రైతుల జీవనోపాధి, పోషకాహార భద్రత అనేవి వ్యవసాయం యొక్క మూడు కీలక లక్ష్యాలుగా పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్ర వారం జరిగిన దక్షిణ రాష్ట్రాల ప్రాంతీయ వ్యవసాయ సదస్సులో శివరాజ్ సింగ్ ప్రసంగిస్తూ, దక్షిణాదిన అపారమైన ఉద్యానవన సామర్థ్యం ఉందన్నారు. కొబ్బరి, జీడిపప్పు రైతులకు ప్రయోజనాలను గరిష్ఠంగా పెంచడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సదస్సులో ఆ ప్రాంతంలో వ్యవసాయం ఎదుర్కొంటున్న కీలక సవాళ్లు, అవకాశాలపై ప్రధానంగా చర్చలు జరిగాయన్నారు. ఎల్ నినో ప్రభావం, పంటల వైవిధ్యీకరణ, రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన చర్యలపై ఈ సదస్సులో ప్రస్తావించినట్లు చెప్పారు. ఈ చర్చలు కేవలం మాటలకే పరిమితం కాలేదని, రైతుల జీవితాల్లో స్పష్టమైన మెరుగుదలలు తీసుకురావడం, భారతదేశ ఆహార భద్రతను బలోపేతం చేయడం, వ్యవసాయం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తరించడం, వ్యవసాయ రంగం ద్వారా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునివ్వడం వంటి లక్ష్యాలతో జరిగాయని పేర్కొన్నారు. దేశమే ప్రథమం అనేది ప్రభుత్వ మార్గదర్శక సూత్రమని, రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉందనే ప్రాతిపదికన కేంద్రం వ్యవసాయ సమస్యలను పరిష్కరించదని తెలిపారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల జీవితాలను మెరుగుపరిచే పరిష్కారాలను కనుగొనడంపైనే దృష్టి కేంద్రీకరించామని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి ఇతర ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలతో సహా సాంకేతిక పురోగతి ప్రపంచాన్ని మారుస్తూనే ఉంటుందని, అయితే వ్యవసాయం మాత్రం అనివార్యంగా మిగిలిపోతుందన్నారు. వ్యవసాయం లేకుండా ప్రపంచం నడవదని స్పష్టం చేశారు. రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదని, జీవనదాత కూడా అని చెప్పారు. దక్షిణ భారత దేశంలో, ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, కాఫీ, జీడిపప్పు, కోకో, చందనం ఉద్యానవన రంగానికి ఉన్న అపారమైన సామర్థ్యాన్ని కలిగి పోషకాహార భద్రతను బలోపేతం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. భారతదేశ వ్యవసాయ రంగం గణనీయమైన వైవిధ్యంతో కూడుకుని ఉందన్నారు. గతంలో దేశం ఒకే రబీ సదస్సును నిర్వహించినప్పటికీ, రాష్ట్రాలు వేర్వేరు వ్యవసాయ వాతావరణ మండలాలు, వనరులు, నీటి లభ్యత మరియు నేల పరిస్థితులను కలిగి ఉన్నాయని చెప్పారు. కేంద్రం కూడా రాష్ట్రాల ముందు తన అంచనాలను ఉంచి, వ్యవసాయ రోడ్‌మ్యాప్ కోసం సంయుక్తంగా పనిచేయగలదని పేర్కొన్నారు. ఏదైనా విషయంలో భారత ప్రభుత్వ స్థాయిలో జోక్యం అవసరమైతే, రాష్ట్రాలు దానిని బహిరంగంగా తెలియజేయాలని ఆయన అన్నారు. కేంద్రం రాష్ట్రాలకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తుందన్నారు. ప్రపంచ మార్కెట్లలో భారతీయ రైతులకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి.

# ఫాస్ట్‌ట్రాక్‌లో 22ఎ పరిష్కారం

### లోకేశ్‌కుమార్ ఛైర్మన్‌గా ఉన్నతస్థాయి కమిటీ

### 118 జిఒ ప్రకారం నేటి నుంచి రెగ్యులరైజేషన్

### హౌజింగ్‌బోర్డు ఇళ్ల బకాయిలకు వన్‌టైం సెటిల్‌మెంట్ పరిశీలిస్తాం

### అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు18,ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22ఏ కు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించ డానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం నాడు శాసనసభలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి జి.ఒ.ఆర్.టి నెం. 564 ను , జారీచేసినట్లు తెలిపారు. జిరో అవర్‌లో సభ్యులు లేవనెత్తిన పలు ప్రజా సమస్యలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ కమిటీకి ఛైర్మన్ గా సిసిఎల్ఎ డి.ఎస్. లోకేష్ కుమార్ వ్యవహరిస్తారు. లా సెక్రటరీ, పాపి రెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐ.జీ. రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్ల మెంటు సభ్యులుగా ఆనాడు ఎల్ బి నగర్ నియో జకవర్గంలోని పలు కాలనీల్లో ఉన్న రెగ్యులరైజేషన్ సమస్యను పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు రంగారెడ్డి జిల్లాలోని ఎల్.బి. నగర్ నియోజకవర్గం లో 118 జీ.ఓ. ప్రకారం 9,700 ప్లాట్ల రేగ్యులరైజేషన్ కు సంబంధించిన మెమోను శుక్రవారం జారీ చేయడం జరిగిందన్నారు. ఈ జి.ఒ. ప్రకారం ఆ ప్రాంతంలో రేపటి నుంచి రెగ్యులరైజేషన్‌ప్రక్రియ ప్రారంభిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. దశాబ్దాల కాలంగా అక్కడ ప్లాట్లు తీసుకొని ఇండ్ల నిర్మాణం చేసుకొని నివాసం ఉంటున్న ఇండ్ల యజమానులు 118 జి.ఒ. ప్రకారం స్థానిక అధికారులను సంప్రదించి నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారుసింగరేణి ప్రాంతంలో ఇండ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జీవో 76ను జారీ చేశారని ఆ జీవోను అనుసరించి శనివారం నాడు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఠాకూర్ మక్కాన్‌సింగ్, ఈ విషయంలో చాలా ఆసక్తితో ఉన్నారని కార్మికులకు లాభదాయకంగా నిర్ణయాలు తీసుకొంటామని తెలిపారు. అలాగే రెవెన్యూ రికార్డులలో 22ఎలో ఉండి హెచ్‌ఎండిఎ, డిటిసిపి, జిహెచ్‌ఎంసి అనుమతులతో లేఅవుట్లు వేసిన ప్రాంతాలను 22ఎ నుంచి తొలగించే విషయంలో ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మీర్జాజుల్ఫేకర్ అలీ, మందులసామేల్ వాజిద్, జాఫర్‌హుస్సేన్, కాలెయాదయ్య నాయినీ రాజేందర్‌రెడ్డిలు మురళీనాయక్ భూక్యాసభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలపై ఆయన స్పందించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని హామి ఇచ్చారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇడి కొరడా

### కైలాశ్‌చంద్ మంగ్లా అరెస్టు

### విశాఖ ప్రత్యేక కోర్టుకు తరలింపు

### జ్యుడీషియల్ కస్టడీ విధింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 18:** తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) హైదరాబాద్ జోనల్ అధికారులు నిందితుడు కైలాష్ చంద్ మంగ్లాను అరెస్టు చేసింది. 'సుకృతి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ప్ ప్రమోటర్ అయిన కైలాష్ చంద్ మంగ్లాను, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ), 2002లోని సెక్షన్ 19 కింద గురువారం అరెస్టు చేశారు. ఆయన్ని విశాఖపట్నంలోని పిఎంఎల్ఎ ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు అతనికి జ్యుడీషియల్ కస్టడీ విధించిందని కేంద్ర దర్యాప్తు సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. టిటిడికి కల్తీ నెయ్యిని మోసపూరితంగా సరఫరా చేయడంలో నేరపూరిత కుట్ర, మోసం, ఫోర్జరీ, అవినీతి ఆరోపణలపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి దర్యాప్తును ప్రారంభించింది. రిఫైన్డ్ పామ్ ఆయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, పామోలిన్, ఎంజి-90, మోనోగ్లిజరైడ్స్, మైవాసెట్ సాఫ్ట్ 400, ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్ వంటి వివిధ రసాయనాలను ఉపయోగించి ఈ కల్తీ నెయ్యిని తయారు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఆ తర్వాత దీనిని టిటిడి వినియోగం కోసం 'అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి'గా సరఫరా చేశారు. 2019-2024 మధ్య టిటిడికి జరిగిన ఈ మోసపూరిత నెయ్యి సరఫరా విలువ సుమారు రూ.230 కోట్లుగా ఉంది. ఇందులో సుమారు రూ.96 కోట్ల విలువైన కల్తీ నెయ్యిని కైలాష్ చంద్ మంగ్లా తయారు చేశారు. ఈ కేసులో మంగ్లా కుట్రదారులలో ఒకరని, కల్తీ పదార్థాల సేకరణకు, తన ఫ్యాక్టరీ ప్రాంగణంలో కల్తీ నెయ్యి తయారీకి ఆయన సహకరించారని ఇడి పేర్కొంది. అలాగే, శ్రీ వైష్ణవి డైరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, మల్గంగ మిల్క్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎ.ఆర్ డైరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి వివిధ సంస్థల ద్వారా కల్తీ నెయ్యి సరఫరాను కూడా ఆయన సమన్వయం చేశారు. కల్తీ పదార్థాల వాస్తవ వినియోగాన్ని దాచిపెట్టి, నిజమైన ఆవు నెయ్యిని చట్టబద్ధంగా ఉత్పత్తి చేసి, సరఫరా చేస్తున్నట్లుగా కనిపించేలా చేయడానికి, మంగ్లా నెయ్యి, శుద్ధి చేసిన పామాయిల్ అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి తప్పుడు రికార్డులను సృష్టించి, నిర్వహించారని దర్యాప్తులో మరింతగా వెల్లడైంది.

## ఎల్‌నినో ఎదుర్కొనేందుకు సిద్ధం

### అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంపై శాసనసభలో శుక్రవారం స్వల్పకాలిక చర్చను ప్రారంభిస్తూ రాష్ట్రంలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని ప్రజల తాగునీటి అవసరాలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. తాగునీటి అవసరాలు తీర్చిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తామన్నారు. ఎల్‌నినో కష్టాల్లో



రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులను ముందుగానే అప్రమత్తం చేశామన్నారు. తమది రైతు ప్రభుత్వమని, అన్నదాతలను ఒంటరిగా వదలమని చెప్పారు. కరువు తీవ్రతకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలతోపాటు ఎల్ నినో ప్రభావం కూడా కారణమని అన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తామని తెలిపారు. కాలువల మరమ్మతులు, పంపింగ్ వ్యవస్థల పునరుద్ధరణను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం నిలిచిన పంటలను రక్షించడంతోపాటు యాసంగి అవసరాలకు కూడా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎల్ నినోను ఆపలేకపోయినా దాని ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల పంటలు, ప్రజల తాగునీరు, రాష్ట్ర జలహక్కుల పరిరక్షణే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎల్ నినో తీవ్రతపై ముందుగానే రైతులకు అవగాహన కల్పించామని, వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై అన్నదాతలను అప్రమత్తం చేశామని చెప్పారు. రైతులు నష్టపోకుండా పంటల ఎంపికపై ముందస్తు సూచనలు ఇచ్చామని వివరించారు. ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు. రైతు నేస్తం ద్వారా జలాశయాల పరిస్థితిని వివరిస్తున్నామన్నారు. నీరు సరిపోని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతారాహిత్యమని వ్యాఖ్యానించారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక నీటి బడ్జెట్ అమలు చేస్తున్నామని, జలాశయాల నిల్వలు, కొత్త ప్రవాహాలను పది రోజులకోసారి సమీక్షిస్తున్నామని వెల్లడించారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో 40 శాతం పావు సామర్థం కన్నా తక్కువగా నిండాయని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా సాధించేందుకు ప్రభుత్వం బలంగా వాదిస్తోందన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోబోమన్నారు. కృష్ణా జలాల కోసం ట్రిబ్యునల్, కేఆర్ఎంబీ, కేంద్రం వద్ద బలంగా వాదిస్తున్నామని చెప్పారు.

# రవాణా వాహనాలపై ప్రత్యేక సెస్

- ఆదాయం లక్ష్యాలు చేరుకునే యత్నాలు - వాహనదారుపై మళ్లీ రవాణా శాఖ బాదుడు
- రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు సన్నాహాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త** రాష్ట్రంలో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే రవాణా వాహనాలపై ప్రత్యేక సెస్ విధించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఆటోలు, క్యాబ్‌లు, లారీలు, బస్సులు తదితర రవాణా వాహనాల రిజిస్ట్రేషన్లపై ఈ సెస్ విధించి అదనంగా ఆదాయాన్ని పెంచుకునే లక్ష్యాల అధిగమించాలని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి నుంచే కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే అన్ని రకాల వాహనాలపై రోడ్ సేఫ్టీ సెస్ పేరుతో వాహనదారులపై అదనపు బాదుడు ద్వారా దోపిడీ చేస్తోంది. ఇప్పుడు మరోసారి సెస్ పేరుతో మరింత భారం మోపేందుకు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో ప్రత్యేక రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, దాని నిర్వహణకు నిధులు అవసరమైన నేపథ్యంలో ప్రత్యేక సెస్ పేరుతో వినియోగదారునిపై భారం వేసేందుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై తదుపరి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ఇటీవల ఆటో సంఘాల ప్రతినిధులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో సమావేశమై తమకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు ప్రమాద, జీవిత బీమా, పిల్లల విద్య, ఇతర సామాజిక భద్రత పథకాలు అందించాలంటే బోర్డుకు నిరంతర ఆదాయ వనరు అవసరం. ఈ నేపథ్యంలో రవాణా వాహనాల కొత్త రిజిస్ట్రేషన్లపై సెస్ విధించి, ఆ నిధులను సంక్షేమ కార్యక్రమాలకు మళ్లించే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రతిపాదిత బోర్డు పరిధిని కేవలం ఆటో డ్రైవర్లకే పరిమితం చేయకుండా రవాణా రంగానికి అనుబంధంగా పనిచేస్తున్న వివిధ వర్గాలకు విస్తరించే అవకాశం ఉంది. డ్రైవర్లు, క్లీనర్లు, కండక్టర్లు, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులతోపాటు గ్యారేజీలు, వాహనాల మరమ్మతు కేంద్రాల్లో పనిచేసే కార్మికులను కూడా ఇందులో చేర్చే అంశాన్ని పరిశీలించవచ్చని తెలుస్తోంది. బోర్డు ఏర్పాటైతే సభ్యుల నమోదు ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేసే అవకాశం ఉంటుంది. ప్రమాదాల్లో గాయపడిన లేదా మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థికసాయం, జీవిత బీమా, పిల్లల విద్యకు సహాయం వంటి సామాజిక భద్రతా చర్యలు చేపట్టవచ్చు. అయితే సెస్ ఎంత శాతం విధించాలి, ఏయే వాహనాలకు వర్తింపజేయాలి, నిధుల నిర్వహణ ఎలా ఉండాలనే అంశాలపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. రవాణా కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సెస్ ప్రతిపాదన వస్తే కొత్త వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్ వ్యయంపై అదనపు భారం పడే అవకాశం ఉంది. కాగా రవాణా కార్మికుల సంక్షేమానికి వాహన రిజిస్ట్రేషన్లతో అనుసంధానించిన నిధుల విధానం ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కర్ణాటకలో కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే రవాణా వాహనాలపై 3 శాతం సెస్ విధిస్తున్నట్లు సమాచారం. ఈ నిధులను కార్మికుల నమోదు, సంక్షేమ పథకాలకు వినియోగించేలా చట్టబద్ధమైన వ్యవస్థను రూపొందించారు. కేరళలోనూ మోటారు వెహికిల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా ఇలాంటి విధానం అమల్లో ఉంది. ఈ నమూనాలను పరిశీలించిన అనంతరం తెలంగాణ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

## ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసిన ఎంఐఎం శాసన సభ్యులు



ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంఐఎం శాసన సభ్యులు

**చార్మినార్,సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఐఎం శాసన పక్ష నాయకులు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పర్యవేక్షణలో ఎంఐఎం పార్టీ తరుపున ఆరు మంది ఎమ్మెల్యేలు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కార్వాన్ నియోజకవర్గం ఎమ్యెల్యే కౌసర్ మొహియుద్దీన్,

నాంపల్లి ఎమ్యెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, యాకుత్‌పుర ఎమ్యెల్యే జాఫర్ హుస్సేనీ ఉన్నారు. రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని,

అదే విధంగా కబ్జాకు గురైన వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్యేలు కోరుతూ ముఖ్యమంత్రికి అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

# అంబర్‌పేట్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పర్యటన

- కమ్యూనిటీ హాల్, నూతన తరగతి గదుల ప్రారంభోత్సవం - సిపిఎల్, పోలీస్ బాయ్స్ పాఠశాలల ఆకస్మిక తనిఖీ - విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మంత్రి



అంబర్‌పేటలోని పోలీస్ బాయ్స్ హైస్కూల్ లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబర్ 18 ( ప్రభాతవార్త ) :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి శుక్రవారం అంబర్‌పేట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా పటేల్ నగర్ డివిజన్, నరేంద్ర నగర్ బస్తీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పటేల్ నగర్ సిపి ఎల్ (కమాండో పోలీస్ ల్యాండ్) పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి, బోధన మరియు మౌలిక వసతులను పరిశీలించారు. 9, 10 తరగతుల విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి ప్రతిభను అభినందించారు.

విండోస్ సహా మరికొన్ని వసతులు కావాలని ఉపాధ్యాయులు కోరగా, సానుకూలంగా స్పందించారు. అనంతరం అంబర్‌పేట్ పోలీస్ బాయ్స్ హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన నాలుగు తరగతి గదులను ప్రారంభించారు. డిజిటల్ బోర్డుల ద్వారా జరుగుతున్న బోధనా విధానాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు మంత్రికి వివరించారు. పాఠశాల అభివృద్ధికి ఏది అవసరమైనా తక్షణమే సమకూరుస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయన మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాను అంబర్‌పేట్ శాసనసభ్యుడిగా ఉన్న సమయంలోనే 22 ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాలు, బిసి హాస్టల్ నిర్మించానని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, టాయిలెట్లు, పరిశుభ్రత నిరంతరం కొనసాగాలని స్పష్టం చేశారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే ఖబడ్దార్

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గడమండ్ల చెన్నయ్య

**సైఫాబాద్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానిస్తే ఖబడ్దార్, ఎవ్వరినీ ఊరుకోబోమని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గడమండ్ల చెన్నయ్య హెచ్చరించారు. మాలమహానాడు చేసిన నిరంతర పోరాట ఫలితంగా హమారా ప్రసాద్ అరెస్ట్ కావటం పట్ల హర్షం వ్యక్తం చేసిన మాలమహానాడు నేతలు శుక్రవారం ట్యాంక్‌బండ్ పైనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద సంబురాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ బాబాసాహెబ్‌ను గాని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని కానీ అవమానించేలా వ్యవహరిస్తే మాల మహానాడు చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు.

సమాజంలో విద్వేషాలు పెంచుతూ, మహనీయులపై చిల్లర వ్యాఖ్యలు చేసే ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, అంబేద్కర్‌ను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన హమారా ప్రసాద్‌ను చట్టప్రకారం అరెస్ట్ చేయించటం ద్వారా తమ పోరాటం సఫలమయిందని పేర్కొన్నారు.

# ఆలస్యపు అధికారులకు షాక్..

# కలెక్టరేట్‌కు తాళం

## ప్రజల ఫిర్యాదులతో ఆకస్మిక తనిఖీ.. ఇన్‌చార్జ్ కలెక్టర్ భాస్కర్‌రావు కొరడా - అటెండెన్స్ మేరకే వేతనాలు చేయాలంటూ హెచ్‌ఓడిలకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, బ్యూరో ప్రభాతవార్త:** ఆయారాం..గయారం ఇష్టారాజ్యంగా విధులకు వచ్చే అధికారులు, ఉద్యోగుల గుండెల్లో ఇన్‌చార్జ్ కలెక్టర్ భాస్కర్‌రావు చర్యలతో రైళ్లు పరిగెత్తాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలనకు తిలోదకాలిస్తున్న తీరుపై కొరడా ఝుళిపించిన ఆయన.. ఏకంగా జిల్లా కలెక్టరేట్ ప్రధాన గేటుకే తాళం వేయించారు. ఉదయం 10:30 గంటలకు విధులకు హాజరు కావాల్సిన అధికారులు, సిబ్బందిలో పలువురు 10:45 గంటలైనా కార్యాలయానికి చేరుకోకపోవడంతో ఈ అనూహ్య చర్య చేపట్టారు. ప్రజలకు సేవలందించాల్సిన కలెక్టరేట్‌లోనే అధికారులు, ఉద్యోగులు సమయానికి అందుబాటులో ఉండటం లేదంటూ వరుసగా ఫిర్యాదులు అందడంతో ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టడం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది ఉదయం 10:30 గంటలకు విధులకు హాజరు కావాల్సి ఉంది. అయితే నిర్ణీత సమయానికి పలువురు కార్యాలయానికి చేరుకోవడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో ఇన్‌చార్జ్ కలెక్టర్ భాస్కర్‌రావు స్వయంగా పరిస్థితిని పరిశీలించారు. ఉదయం 10:45 గంటల సమయంలోనూ కొందరు ఉద్యోగులు విధులకు హాజరు కాకపోవడంతో ప్రధాన గేటుకు తాళం వేయించారు. దీంతో ఆలస్యంగా వచ్చిన అధికారులు, సిబ్బందికి సమయపాలన విషయంలో జిల్లా యంత్రాంగం ఇక ఉపేక్షి ంచబోదనే స్పష్టమైన సంకేతం వెళ్లింది.

అధికారులు, ఉద్యోగుల హాజరును పర్యవేక్షి ంచేందుకు ఇప్పటికే లొకేషన్ ఆధారిత హాజరు విధానం అమల్లో ఉన్నప్పటికీ, కొందరు నిర్ణీత సమయానికి విధులకు హాజరు కాకపోవడంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

ఉదయం 10:30 గంటలకు విధులకు రావాల్సి ఉండగా, 10:45 గంటల వరకు కూడా కార్యాలయానికి రాని పరిస్థితిని తీవ్రంగా పరిగణించినట్లు భాస్కర్‌రావు తెలిపారు. ఉదయం 8 గంటలకే రావాలని ఎవరినీ చెప్పలేదు. నిర్ణీత సమయమైన 10:30 గంటలకు విధులకు హాజరు కావాలి. అయినప్పటికీ పలువురు సమయానికి రాకపోవడంతో 10:45 గంటలకు ప్రధాన గేటుకు తాళం వేశాం, అధికారులు, సిబ్బంది సమయానికి కార్యాలయానికి రావడం లేదని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే ఈ చర్య చేపట్టాం, ఇకపై సమయానికి హాజరు కాకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం, ప్రజలకు సేవ చేయడానికే మనం కార్యాలయాల్లో ఉన్నాం, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గుర్తుంచుకుని సమయపాలన పాటించాలని ఇంచార్జ్ కలెక్టర్ భాస్క ర్ రావు హెచ్చరించారు. కలెక్టరేట్ వంటి జిల్లా పరిపాలనా కేంద్రంలోనే సమయపాలనపై ఫిర్యాదులు రావడం, వాటిపై ఇన్‌చార్జ్ కలెక్టర్ నేరుగా స్పందించి గేటుకు తాళం వేయించడం జిల్లా అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇకపై ఆలస్యంగా విధులకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగుల విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండబోవని ఈ చర్య ద్వారా స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్లయింది. ఇది ఇలా ఉండగా కలెక్టరేట్ పరిధిలో పనిచేసే సిబ్బంది వేతనాలను మీ ప్రమాణ్ యాప్ లో నమోదైన ఆదర్శ అతనితోనే వేతనాల బిల్లులు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఉత్తరులు జారీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలనను కట్టుదిట్టం చేసేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యగాపరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఉప్పల్‌లో పర్యటిస్తున్న ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి తదితరులు

# 'సర్' లో తప్పులు లేకుండా చూడాలి

## పటిష్టంగా ఓటర్ల జాబితాల సవరణ

## ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**ఉప్పల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నోటీసుల హియరింగ్, ధృవపత్రాల అప్ లోడింగ్‌లో ఏలాంటి తప్పులు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్, హబ్సిగూడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఉప్పల్ జోనల్ కమీషనర్ రాధిక గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్, డిసి ఆనంద్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్ధారించిన ధృవీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన మరియు ధృవీకరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) హియరింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను, సూపర్వైసర్లను, బిఎల్ఓలను ఆదేశించారు. మేడ్చల్ జిల్లాలో మ్యాప్పింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు మరియు ఓటర్ కార్డులో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధృవీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, నోటీసు అందిన ఓటర్ల హియరింగ్‌కు హాజరయ్యే అభ్యర్థుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధృవీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలనలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని సూచించారు. హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను సమీక్షి ంచి, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బిఎల్ఓలు నిర్వహిస్తున్న రిజిష్టర్లను, కంప్యూటర్‌లో ధృవపత్రాల అప్ లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్, డిప్యూటి కమీషనర్ ఆనంద్‌కుమార్, ఈఆర్ఓలు స్వప్న, ఏఈఆర్ఓలు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ బ్రిడ్జిపై నుంచి దూకి యువకుడు మృతి

## హైదరాబాద్ ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో దారుణం

**చిక్కడపల్లి సెప్టెంబర్ 18 ( ప్రభాతవార్త ) :** ఆర్థిక ఇబ్బందులు, పెరిగిపోయిన అప్పుల భారం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలోని విఎస్‌టీ స్టీల్ బ్రిడ్జిపై నుంచి శుక్రవారం ఉదయం దూకి అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన కలకలం కలిగించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని పార్శీగుట్టకు చెందిన సింగారపు మనోజ్ కుమార్ (29) ప్రైవేట్‌గా ఇంటింటికీ తిరిగి అపోలో హాస్పిటల్స్ నిమిత్తం రక్త, ఇతర పరీక్షల నమూనాలు సేకరించే పనిచేస్తుంటాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం విఎస్‌టీ స్టీల్ బ్రిడ్జిపైకి చేరుకుని, తన ద్విచక్ర వాహనాన్ని పక్కన నిలిపాడు. బైక్‌పై తన మొబైల్ ఫోన్, సూసైడ్ నోట్ ఉంచి బ్రిడ్జి పైనుంచి కింద ఉన్న రోడ్డుపైకి దూకేశాడు. పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలై మనోజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి ఏసీపీ రాజధీర్ రెడ్డి, ఇన్ స్పెక్టర్ ఎల్.మధుబాబు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షి ంచారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బైక్‌పై లభించిన సూసైడ్ నోట్‌లో.. తన కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అప్పులు ఇచ్చి ఆదుకున్న వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ, తన ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కారణమని రాసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై చిక్కడ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి స్నేహితులు,

కుటుంబ సభ్యుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తూ దర్యాప్తు జరుపుతున్నారు. కాగా, రద్దీగా ఉండే ఈ ప్రధాన మార్గంలో ఈ ఘటన జరగడంతో స్టీల్ బ్రిడ్జిపై కాసేపు తీవ్ర ట్రాఫిక్

# ఢిల్లీలో 16 యేళ్ల యువతిపై గ్యాంగ్ రేప్!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** దేశరాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. 16 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. అనంతరం రేపిస్టులు ఆ బాలికను చంపేశారు. తర్వాత మృతదేహాన్ని నిర్మానుష్య ప్రదేశంలో పడేశారు. ఈ ఘటన ఢిల్లీలోని స్వరూప్ నగర్‌లో గతవారం జరిగింది. గత ఆదివారం కుషాక్ రోడ్డు వద్ద కుళ్లిన స్థితిలో బాలిక మృతదేహం బయటపడటంతో ఈ విషయం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాలప్రకారం స్వరూప్ నగర్ ప్రాంతంలో గత శుక్రవారం రాత్రి 16 ఏళ్ల బాలిక తన స్నేహితుడైన 17 ఏళ్ల యువకుడిని కలవడానికి వెళ్లింది. అతడి వద్దకు వెళ్లిన తర్వాత మరో ముగ్గురితో కలిసి ఆ బాలికను ఎత్తుకెళ్లారు. అనంతరం బాలికపై నలుగురు కలిసి సామూహికంగా అత్యాచారం చేసి, తర్వాత హత్య చేశారు. తర్వాత బాలిక మృతదేహాన్ని కుషాక్ రోడ్డుపై ఒక ఖాళీ ప్రదేశంలో పడేశారు. రెండు రోజుల తర్వాత.. అంటే ఆదివారం ఆ బాలిక మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే బాలిక మృతదేహాన్ని కొన్ని కుక్కలు, ఇతర జీవులు పీక్కుతిన్నాయి. ముఖం కూడా గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. శరీరం కూడా చాలావరకు కుళ్లిపోయింది. దీంతో అప్పుడు బాలిక ఎవరో పోలీసులు గుర్తించలేకపోయారు. పోస్టుమార్టం రిపోర్టులో బాలికపై సామూహిక అత్యాచారం జరిగినట్లు వెల్లడైంది. బాలిక ఒంటిపై అనేక గాయాలున్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో బాలికపై సామూహిక అత్యాచారం, హత్య కోణంలో పోలీసులు విచారణ జరిపారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల్ని పరిశీలించారు. చివరకు నలుగురు నిందితులు ఈ దారుణానికి పాల్పడ్డట్లుగా పోలీసులు గుర్తించారు. వీరిలో ఒకడి వయసు 19 ఏళ్లు కాగా మరో ముగ్గురు మైనర్లు. అందులో ఒకడు బాలిక స్నేహితుడైన 17 ఏళ్ల యువకుడు.

ఈ నలుగురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కిడ్నాప్, అత్యాచారం, హత్య, పోక్సో వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను పరామర్శించిన కేటిఆర్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను పరామర్శిస్తున్న కేటీఆర్

**ముషీరాబాద్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** ఇటీవల సికింద్రాబాద్ యశోదా హాస్పటల్‌లో మోకాలు ఆపరేషన్ చేయించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. శుక్రవారం ఆయన మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్‌లతో కలసి యశోదా హాస్పటల్‌కు వెళ్లి ముఠాగోపాల్ ఆరోగ్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ముఠాగోపాల్‌కు మోకాలి ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయిందని, త్వరలోనే ఆయన ప్రజా సేవా కార్యక్రమాలలో పాల్గొంటారని ఆయన కుమారుడు ముఠా జైసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, సంజయ్‌కుమార్, మాదారం కృష్ణారావు, కాలేరు వెంకటేష్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

# శస్త్రచికిత్స లేకుండానే నిమ్స్‌లో అరుదైన గుండె కవాట మార్పిడి చికిత్స




శస్త్ర చికిత్స నిర్వహించిన నిమ్స్ కార్డియాక్ వైద్య బృందం

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 18, ప్రభాతవార్తః** నిమ్స్ వైద్యులు అరుదైన, అత్యాధునిక గుండె కవాట మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 37 ఏళ్ల మహిళకు శస్త్రచికిత్స లేకుండానే రక్తనాళం ద్వారా హార్మనీ ట్రాన్స్‌క్యాథెటర్ వాల్వ్‌ను అమర్చారు. దీంతో గుండెలో రక్తప్రసరణ సాధారణ స్థితికి చేరింది. చిన్నతనంలో టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్ (టీఓఎఫ్) అనే జన్యుపరమైన గుండె లోపానికి శస్త్రచికిత్స చేయించుకున్న సదరు మహిళకు కొన్నేళ్ల తర్వాత పల్మనరీ వాల్వ్ నుంచి తీవ్రంగా రక్తం వెనక్కి లీక్ అవుతున్న సమస్య తలెత్తింది. నిమ్స్ కార్డియాలజీ వైద్యులు రక్తనాళం ద్వారా అధునాతన కవాటాన్ని అమర్చడంతో ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే చికిత్స పూర్తయింది.

# కళాశాల భవనం నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

## - పరిస్థితి విషమం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** కళాశాల భవనం నుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నగరంలోని జగద్గిరిగుట్టకు చెందిన విద్యార్థిని బీటెక్ సీఎస్ఈ 3వ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం కళాశాలకు వచ్చిన దిగాలుగా ఉండటంతో తోటి విద్యార్థులు ఆమెపై ప్రవర్తనపై అనుమానంతో ప్రశ్నించగా సాయంత్రం విషయం చెబుతానంటూ దాట వేసింది. కళాశాల ముగిసిన అనంతరం విద్యార్థులంతా వెళ్లిపోయిన తర్వాత సాయంత్రం 4.30 గంటలకు డిప్రెషన్‌తో కళాశాల భవనం 3వ అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకింది. దీంతో తలకు, చేతులకు తీవ్ర గాయాలు కాగా కళాశాల యజమాన్యం మేడిపల్లిలోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఆమె 20 రోజుల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం కాటిపల్లికి చెందిన చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వ్యక్తితో ప్రేమ వివాహం జరిగినట్లు పోలీసులు తెలిపారు. కాగా విద్యార్థిని ఆత్మహత్యా యత్నానికి సంబంధించి కారణాలు తెలియరాలేదని, ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# పెళ్లికి నెల రోజుల ముందు దారుణం..

## హత్యచేసి మురుగు కాలువలోకి తోసివేత



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** పెళ్లికి సరిగ్గా నెల రోజుల ముందు మాజీ సహోద్యోగిని చేతి లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఆర్థిక లావాదేవీల కారణంగా తన ప్రియుడితో కలిసి సదరు మహిళ ఆ యువకుడి ప్రాణాలను బలి తీసుకుంది. హత్య తర్వాత మృతదేహాన్ని మురుగు కాలువలో పడేసింది. మరోవైపు, బాధిత కుటుంబసభ్యులకు తెలియకుండా పోలీసులే దహన సంస్కారాలు చేయడం చర్చనీయాంశమైంది. ఈ ఘటన ఢిల్లీ, గురుగ్రామ్‌లలో కలకలం రేపింది. బాధిత యువకుడు యువరాజ్‌సింగ్ మంచందాకు మరో నెల రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. ఈ మేరకు సెప్టెంబరు 6న తన సోదరీమణులతో కలిసి ఢిల్లీలోని లజ్‌పత్‌నగర్ మార్కెట్‌లో షాపింగ్ చేశారు. సంతోషంగా షెర్వాణీ వంటి పెళ్లి బట్టలను కొనుగోలు చేశాడు. అనంతరం గురుగ్రామ్‌లో మాజీ సహోద్యోగితో అత్యవసర సమావేశం ఉందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత రాత్రి 10 గంటలకల్లా ఇంటికి వస్తానని ఫోన్ చేసి చెప్పాడు. అతను ఇంటికి రాకపోగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యింది. రోజుల తరబడి యువరాజ్ ఆచూకీ తెలియకపోవడంతో సెప్టెంబరు 11న బాధిత కుటుంబం లజ్‌పత్‌నగర్‌లో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతడి మాజీ సహోద్యోగిని వాట్స్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆ దిశగా విచారణ చేపట్టగా ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. సిసిటివి ఫుటేజిలు, సాంకేతిక ఆధారాలతో వాట్స్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వాట్స్‌ను, ఆమె భాగస్వామిని ఉత్తరాఖండ్‌లో గుర్తించి అరెస్టు చేశారు. నిందితులిద్దరూ యువరాజ్‌ను హత్యచేసినట్లు విచారణలో ఒప్పుకున్నారు. అనంతరం మృతదేహాన్ని మురుగు కాలువలో పడేసినట్లు తెలిపారు.

ఆర్థిక లావాదేవీలే హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిజానిజాలు తేల్చేందుకు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.



# చిలుకే సింగారమాయెనే !



ఫ్యాషన్ ఫ్యాషన్

చిలుకల పెరట్లోని చెట్లపై వాలితే చాలు.. ఆ ప్రదేశానికే ప్రత్యేకత.

అయితే, సాధారణంగా చిలుకనగానే పచ్చరంగు, వంపు తిరిగిన ఎర్రటి ముక్కుతో ఉన్నవే గుర్తొస్తాయి. కానీ, పంచ రంగుల్లోనూ ఇవి కనిపిస్తాయి. పైగా పక్షుల్లోకెల్లా తెలివైనవి. అందుకే, చూడముచ్చటగా ఉండే చిట్టి చిలకమ్మలంటే చిన్నా, పెద్దా అందరికీ ఇష్టం. ఇవన్నీ పక్కనపెడితే.. ఇప్పుడివి నేటితరం అమ్మాయిల ఫ్యాషన్‌లో ఫేవరెట్ ట్రెండ్‌గా సందడి చేస్తున్నాయి. ముఖ్యంగా నగల డిజైన్లలో ఒదిగిపోయి.. ఇటు ఆధునికత కోరుకునేవారినీ, అటు సంప్రదాయంగా కనిపించాలనుకునేవారిని కూడా మెప్పిస్తున్నాయి. దాంతో లోలాకులూ, నెక్లెస్‌లూ, ఉంగరాలు..ఒకటేమిటి అమ్మాయిలు ధరించే అన్ని రకాల ఆభరణాలపైనా చేరి అదరహో అనిపిస్తున్నాయి. అచ్చంగా బంగారంతో చేసిన చిలుకలే కాదు, నవరత్నాలు పొదిగినవీ, పోల్కీ కుందన్లు, పచ్చలూ, ముత్యాలు వంటివి చేర్చినవి, కుందన్లతో జత కట్టినవీ.. ఇలా చాలానే ఉన్నాయి. అన్నీ అందంగా కనిపించేలా చేయడమే కాదు, ఆడంబరతనూ తెచ్చిపెడుతున్నాయి. మరింకెందుకాలస్యం ఈ ట్రెండ్‌ని మీరూ ఫాలో అయ్యి పచ్చని చిలుకలు తోడుంటే అంటూ మురిసిపోండి.













# ఉక్కు మహిళకు చేతిలో 'కోబ్రా'



అడవులు, సుదూర ప్రాంతాలు, సాయుధ తిరుగు బాట్లు, అత్యంత క్లిష్టమైన భద్రతా పరిస్థితులు... ఇవన్నీ సాధారణ పోలీసింగు భిన్నమైన సవాళ్లు. అలాంటి ఆపరేషనల్ బాధ్యతలు ఎదుర్కొన్న అనుభవంతో ముందుకు వచ్చిన ఐపీఎస్ అధికారి ..సంజుక్త పరాశర్.. ఇప్పుడు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లోని ప్రత్యేక దళం ప్రతిష్టాత్మకమైన 'కమాండో బెటాలియన్ ఫర్ రెసొల్యూట్ యాక్షన్' (కోబ్రా) నాయకత్వం వహిస్తున్నారు. అస్సాం ఉక్కు మహిళగా ప్రసిద్ధి చెందిన ఐపీఎస్ అధికారిణి సంజుక్త పరాశర్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్ కోబ్రా)కు నాయకత్వం వహించిన మొట్టమొదటి మహిళా ఇన్స్పెక్టర్ జనరల్గా చరిత్ర సృష్టించారు. కోబ్రా 10 బెటాలియన్ల దళానికి బాధ్యతలు స్వీకరించారు.. ఇది అడవి, గెరిల్లా యుద్ధం, అటవీ ప్రాంతాలలో సుదూర కార్యకలాపాలు, మాటు వేసి దాడి చేసే , ప్రతి దాడి చేసే వ్యూహాలు, సాయుధ తిరుగుబాటు దారులపై లక్షిత కార్య కలాపాల కోసం శిక్షణ పొందింది. □

# ముద్ద ముద్దనూ ఆస్వాదించండి !



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

నేటి నాగరికత ముసుగులో మనుష్యుల జీవనశైలి పూర్తిగా మారిపోయింది. ఆరోగ్యం పట్ల అవగాహన బాగా పెరిగినపనపటికి ఆహారాన్ని ఏ విధంగా తీసుకోవాలనేదం ఒక సమస్యగానే ఉంది. దీనికి కారణ బిజీ.. బిజీ.. బిజీ.. ఉరుకుల పరుగుల మీద కన్పించిన అడ్డమైన ఆహారాన్ని అడ్డదిడ్డంగా తినడంతోనే అనేక అనారోగ్యాలు వస్తున్నాయి. నిజమైన ఆహారం సాంత్వనను ఇవ్వాలి. సహజ సిద్ధంగా తినడం ఆహారంతో సమతుల్య సంబంధాన్ని పెంపొందిస్తుంది. అతిగా లేదా కొద్దిగా తినడం, భావోద్వేగంతో తినడం చేయరాదు. సహజమైన ఆకలి, శరీర ధర్మాల్ని గమనించి నిజంగా ఆకలి అనిపించినప్పుడే తాజా, వేడి ఆహారాన్ని రిలాక్స్‌గా తినాలి. మీరు తినేటప్పుడు నెమ్మదిగా ప్రతి ముద్దని అస్వాదిస్తూ, సరైన పోషకాహార సమాచారాన్ని అర్థం చేసుకుంటూ సరైన ఆరోగ్య కరమైన ఆహార ఎంపిక చేసుకోవాలి. టి.వి. సెల్, కంప్యూటర్ చూస్తూ కాని, ఒంటరిగా గాని తినరాదు. కుటుంబ సభ్యులతో కలిసి తినాలి. ఆహారాన్ని నోట్లో పెట్టుకోగానే దాని రుచిని ఆస్వాదిస్తూ 20-32 సార్లు మెల్లగా నమిలినప్పుడు అది సులభంగా జీర్ణమయ్యే చిన్న చిన్న ముక్కలుగా విడిపోతుంది. ఇది లాలాజలంలోని ఎంజైమ్స్‌తో కలవడం వల్ల మీరు తినే ఆహారం నుండి సాధ్యమైనంత ఎక్కువ పోషకాల్ని మీ శరీరం గ్రహించగలుగుతుంది. నోటోల్లనే ఆహారం మెత్తని ముద్దలా (బోలస్) మారడం వల్ల భోజనాన్ని కేవలం 5-10 నిమిషాల్లో గబగబా మింగరాదు. భోజనాన్ని 20-30 నిమిషాల పాటు నెమ్మదిగా, ప్రశాం తంగా తినడం వల్ల మనసుకి, శరీరానికి ప్రశాంతత లభిస్తుంది. ట్రైమ్ ప్రకారం హెచ్ఎల్‌టి (ఆకలి, కోపం, ఒంటరితనం, అలసట ) లేకుండా నింపాదిగా తినడం వల్ల మీ నాలుక నోటి కండరాల పనితీరు మెరుగుపడుతుంది. నెమ్మదిగా పూర్తిగా నమలడం వల్ల ఆకలిని తగ్గించడమే కాకుండా, అతిగా తినడాన్ని నిరోధించడంతో సంతృప్తి కల్గి బరువు నియంత్రణలో ఉంటుది. నెమ్మదిగా తినడం వల్ల జీర్ణక్రియ వేగవంతమై గ్యాస్, వికారం, తలనొప్పి, పొట్ట ఉబ్బరం, గుండెలో మంట, అజీర్తి, మలబద్ధకం తగ్గుతుంది. సరిగా నమలడం వల్ల లాలాజలం ఉత్పత్తి పెరిగి అధిక దాహం వేయదు నోరు ఎండుకుపోవడం జరగదు. ఇవి దంతాలు, చిగుళ్ళనిన శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది నోటి పరిశుభ్రతకు కూడా దోహదం చేస్తుంది. సులభమైన ఆహారం అయితే తక్కువ సమయంలోనే నమలవచ్చు. అదే మాంసాహారం అయితే చాలా సేపు నమిలి తినడం మంచిది. సరిగా తినడం వల్ల దీర్ఘకాలంలో జీర్ణకోశ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆహారాన్ని పెద్దగా లేదా చిన్నగా ముద్దలు చేసి తినేవాళ్ళు ఆహారాన్ని సరిగ్గా నమలడం లేదని అర్థం. నోట్లో ఆహారం పెట్టుకొని మాట్లాడకుండా పెదవులు మూసుకొని నమలడం వల్ల నాలుకతో పాటు దౌడ కండరాలు చురుకుదనాన్ని సంతరించుకుంటాయి. ఇది ముఖాకృతికి సరైన అందానినన సంతరిస్తుంది. ముద్దలోని గట్టిదనం పూర్తిగా పోయిన తర్వాతనే మీరు ఆహారాన్ని మింగాలి. తిన్న వెంటనే కాఫీ, కూల్‌డ్రింక్స్, పండ్లు, నీరు, పుల్లని ఊరగాయలు తినరాదు. నడక కొద్దిసేపు మాత్రమే చేయాలి. ఆహారాన్ని ఎలా తీసుకుంటే మంచిదని తెలుసుకున్నారు కదా! ట్రై చేయండి మీ ఆరోగ్యం మీ సొంతం. □



# సౌందర్యానుభూతి



లోషన్లు, క్రీములు అంటూ ఎన్ని వచ్చినా.. చాలా మందికి సబ్బు ఉంటేనే స్నానం చేసిన అనుభూతి. దాన్నలా రెండు చేతుల మధ్యా తీసుకుని నురగ తీస్తోంటే తెలి యని అనుభూతి. ఆ ఫీలింగ్‌ని అమ్మాయిల స్కిన్‌కేర్‌లో ఇతర ఉత్పత్తులకీ జోడిస్తే ఎలా ఉంటుం దన్న ఆలోచన లకు ఉదాహరణలే ఇవి.

**స్క్రబ్ తేలిగ్గా...** కొన్ని రోజులకే ఎండిపోయినట్లుగా అవ్వడం, డబ్బాలో నీళ్ల పడిపోవడం.. స్క్రబ్ చేసేప్పుడు వచ్చే సమస్యలే కదూ! ట్యూబ్‌లతోనూ తిప్పలు మామూలుగా ఉండవు. అవి గమ నించాేంమో.. ఇలా స్క్రబింగ్‌సోప్‌లు తీసుకొచ్చారు తయారీదారులు. సబ్బులా తీసు కుని మృదువుగా ముఖాన్ని రుద్దేయడమే! అయితే సోప్ కదా అని రోజూ వాడొద్దు మరి!

**ఆ నొప్పికి పరిష్కారం ...** మృదువైన చేతులు కావాలన్నా, స్లీవ్‌లెస్ స్కర్ట్‌లు, ఫ్రాకులు వేసుకోవాలన్నా.. అవాంఛిత రోమాలను తొలగించుకోవాల్సిందే! ఎక్కువ కాలం రాకుండా ఉంటాయని వ్యాక్స్, క్రీములు, షేవింగ్‌లపై ఆధార పడుతుంటాం. నొప్పికి తోడు ఎక్కువ సమయం తీసుకుం టాయివి. అందుకే



ఈ 'హెయిర్ రిమూవల్ సోప్'లను ప్రయత్నించండి. సబ్బుని నీటితో కలిపి మందమైన పేస్ట్‌లా చేయాలి. శరీరానికి పట్టించి, ఓ అయిదు నిమిషాలు అయ్యాక నీటితో కడిగిస్తే చాలు వెంట్రుకలన్నీ రాలిపోతాయి. దీన్ని ముఖానికి ఉపయోగించొచ్చట. అప్పుడు త్రెడింగ్ సమస్యలూ ఉండవు.

**ప్లాస్టిక్ పెరగదు...** కుంకుడు కాయలు, శీకాయ తలకు చేసే మేలెంతో! అయినా వాటిని ఉడకబెట్టడం, రసం తీయడం పెద్ద పని అని పక్కన పెట్టేశాం. తేలిగ్గా అయిపోతుందని షాంపూలను వాడేస్తున్నాం. వాటిలోని రసాయనాలు చేసే చేటు అంతా ఇంతా కాదు. పైగా ప్లాస్టిక్ భూమిపై పోగ య్యేలా చేస్తున్నాయి. వాటికి పరిష్కారంగా వచ్చినవే షాంపూ బార్‌లు సబ్బులా వస్తాయి కదా.. ప్లాస్టిక్ పెరగదు. వీటిలో ఎక్కువగా కోల్డ్ ప్రెస్డ్ నూనెలు, కుంకుడు కాయలు, శీకాయ వంటి సహజ పదార్థాలతో చేసినవే ఉంటున్నాయి. వేగంగా తలంటూ పూర్తివుతుంది. కురులకీ మేలు అన్నమాట. స్కిన్‌కేర్‌ని సులభతరం చేస్తూ భలే ఉన్నాయి కదూ! ఇంకేం.. ప్రయత్నించేయండి. □

# వశిష్టుడి శాపం


సీతాదేవిని అపహరించిన రావణుడు .. శ్రీరాముడికి ఆగ్రహాన్ని కలిగిస్తాడు. శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు అని ఎందరు చెప్పినా పెడచెవిన పెడతాడు. చివరికి శ్రీరాముడి చేతిలోనే ప్రాణాలను కోల్పోతాడు. రావణుడు యుద్ధభూమిలో నేలకొరగడానికి ఎంతోమంది తపః సంపన్నుల శాపాలు కారణమవుతాయి. అలా బ్రహ్మదేవుడు .. బృహస్పతి .. దత్తాత్రేయుడు .. నంది .. నారద మహర్షితో పాటు వశిష్ఠ మహర్షి శాపం కూడా రావణుడి మరణానికి కారణమవుతుంది. తనకి వేదాలను బోధించమని ఒకసారి వశిష్ఠ మహర్షిని రావణుడు కోరతాడు. అందుకు వశిష్ఠుడు నిరాకరిస్తాడు. దాంతో ఆగ్రహించిన రావణుడు .. వశిష్ఠుడిని చెరసాలలో బంధిస్తాడు. అలా బంధించబడిన వశిష్ఠుడిని ఒక సూర్య వంశపు రాజు చెరసాల నుంచి విడిపిస్తాడు. 'చిరావణుడి మరణం సూర్యవంశపు రాజు చేతిలో వుంటుంది' అని ఆ సమయంలో వశిష్ఠుడు శపిస్తాడు. ఫలితంగా సూర్యవంశానికి చెందిన శ్రీరాముడి చేతిలోనే రావణుడు సంహరించబడతాడు. □

## 'ప్రేమనే ఊరిలో' చిత్రం సాంగ్ లాంచ్



మహారత్న ప్రొడక్షన్స్, ఎస్కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం. సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో' ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. కామాక్షి భాస్కర్ల మాట్లాడుతూ 'ప్రేమనే ఊరిలో' అనే టైటిలే చాలా బాగుంది. టీజర్‌లో శ్రీకాంత్ వాయిస్ ఓవర్ బాగుంది. తణికెళ్ల భరణి గారు రిలీజ్ చేసిన పాట కూడా బాగుంది. ఈ ప్రమోషన్స్‌లో నన్ను భాగస్వామిని చేసిన సురేష్‌కి థాంక్స్. ఈ సినిమాతో శ్రీనివాస్ గారికి మంచి విజయం దక్కాలి. ఆర్టిస్టులు తెరపై అద్భుతంగా కనిపించారు. చందు శ్రీనివాస్ మాట్లాడుతూ .. 'ప్రేమనే ఊరిలో' సినిమాతో నిర్మాతగా అడుగు పెడుతున్నాను. చిన్నతనం నుంచీ సినిమాలంటే ఇష్టం. ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలు పెట్టి ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నాను. దేవేందర్ గారు నాకు బిజినెస్‌లో హెల్ప్ చేశారు. ఆయన వల్లే ఈ సినిమా నాకు తెలిసింది. పోస్టర్ చూసిన వెంటనే నాకు ఎంతో నచ్చింది. సురేష్ కొండేటి మాట్లాడుతూ .. 'నేను గతంలో చేసిన 'ప్రేమిస్తే', 'జర్నీ'`షాపింగ్ మాల్ రేంజ్‌లో 'ప్రేమనే ఊరిలో' ఉంటుంది. ఈ ఇండస్ట్రీకి దూరంగా ఉండమని చందుకి సలహా ఇస్తుంటాను. అయితే ఈ మూవీ గురించి చెప్పినప్పుడు, చూసినప్పుడు నా నిర్ణయం మార్చుకున్నాను. మనం కలిసి ఇకపై జర్నీ స్టార్ట్ చేద్దాం అని చందుతో అన్నాను.`ప్రేమనే ఊరిల్లో కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది.

## 'రణబాలి' అక్టోబరు 16న విడుదల




అక్టోబర్ 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'రణబాలి' మూవీ విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవి శంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవు తోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'ఏందయ్యా సామీ..' రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 21న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విజయ్, రశ్మిక పెళ్లి సందర్భంగా రిలీజ్ చేసిన 'ఏందయ్యా సామీ..' సాంగ్ ప్రోమో హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఇప్పుడీ ఫుల్ వెర్షన్ సాంగ్ కోసం ఆడియెన్స్ వేచి చూస్తున్నారు. విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న వివాహం తర్వాత కలిసి నటిస్తున్న సినిమాగా అటు వారి ఫ్యాన్స్ లోనూ, ఇటు మూవీ లవర్స్ లోనూ 'రణబాలి' సినిమా ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్ గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది.



## 'జాంబీ రెడ్డి 2 ఫస్ట్ లుక్ రిలీజ్

'హనుమాన్', 'మిరాయ్' చిత్రాలతో పాన్ ఇండియా విజయం సాధించిన సూపర్ హీరో తేజ సజ్జ, ప్రస్తుతం జాంబీ రెడ్డి 2 NXT LVLగా వస్తున్న 'జోంబీ రెడ్డి' సెకెండ్ పార్ట్ లో నటిస్తున్నారు. 'జాంబీ రెడ్డి' క్రియేటర్ ప్రశాంత్ వర్మ ఈ సీక్వెల్‌కు క్రియేటర్ గా, సుపర్ణ్ ఎస్ వర్మ దర్శకుడిగా చేస్తున్నారు. 'హక్', 'రానా నాయుడు', 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' వంటి ప్రశంసలు అందు కున్న ప్రాజెక్ట్స్‌తో పాటు పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లకు రచయితగా పనిచేసిన సుపర్ణ్ ఎస్. వర్మ.. తేజ సజ్జా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. గతంలో వీరి కాంబినేషన్‌లో`మిరాయ్ఁ బ్లాక్ బస్టర్ అయ్యింది. తేజ సజ్జా పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'జాంబీ రెడ్డి 2' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోకు సెన్సేషనల్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటిస్తుండగా.. షనాయా కపూర్ ఈ సినిమాతో తెలుగు తెరకు పరిచయం కానున్నారు. ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఉపేంద్రను ఇంతకుముందెన్నడూ చూడని వైల్డ్, ఫియర్స్, లార్జర్ దెన్ లైఫ్ అవతార్‌లో ప్రజెంట్ చేశారు. భారీ చెట్టు కొమ్మకు తలకిందులుగా వేలాడుతూ.. ఒక చేతిలో పొడవైన ఆయుధాన్ని పట్టుకుని కనిపించారు. రఫ్ లుక్, విరబోసు కున్న జుట్టు, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో ఈ క్యారెక్టర్ ఎవరు? అనే ఆసక్తిని పెంచుతున్నారు.ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, నేపాలీ, జపనీస్ భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



## 'ఓ నా సిద్ధయ్య' పాట హిట్ అవ్వాలి: చంద్రబోస్



సిద్ధు రెడ్డి, కాత్యాయని జగన నటించిన ఓ నా సిద్ధయ్య పాటకు సంబంధించిన అప్డేట్ ఇచ్చారు. రామ్ అద్నాన్ ఈ పాటను రాసి అందంగా తెరకెక్కించారు. కళ్యాణ్ కీస్ సంగీత సారథ్యంలో రామ్ అద్నాన్, శ్రీనిధి ఈ పాటను ఆలపించారు. అరుణ్ కొలుగూరి కెమెరా, ఎడిటింగ్ బాధ్యతల్ని నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, చంద్రబోస్, కాసర్ల శ్యాం, నల్గొండ గద్దర్ మరియు గీతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ..ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. ..`నా సోదర సమానుడైన సిద్ధు రెడ్డి`ఓ నా సిద్ధయ్య పాటను చేయడం ఆనందంగా ఉంది. సిద్ధు రెడ్డి ప్రభుత్వ పాఠశాల్ని నిర్మించడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుంటాడు. అడగక ముందే అందరికీ సాయం చేస్తుంటాడు. మూడు వందల మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ చేయించాడు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్ మాట్లాడుతూ.. .. సిద్ధుతో నాకు ఆరేడు నెలల పరిచయమే అయినా ఆరేడు జన్మల బంధం ఉన్నట్టుగా అనిపిస్తోంది. నా సోదర సమానుడైన సిద్ధు కోసం ఓ మంచి పాట రాశాను. కాసర్ల శ్యాం మాట్లాడుతూ.. 'ఒక్క పూట పరి చయంతోనే సిద్ధు సోదరుడు నాకెంతో అనుబంధం ఏర్పడింది. సిద్ధు భయ్యా ఈ పాటలో గొప్పగా నటించాడు. ..సిద్ధు రెడ్డి మాట్లాడుతూ.. 'ఓ నా సిద్ధయ్య' ఈవెంట్ కోసం వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. రామ్, లక్ష్మణ్ పాటలు ఖండాంతరాలు దాటాయి. వారు పాడే పాటలు, రాసే అక్షరాలు జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. మూడు వందల మంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ ఇవ్వడం వెనుక ఓ పెద్ద కారణం ఉంది. నా భర్త హాస్పిటల్‌లో ఉన్నాడని ఓ మహిళ ఫోన్ చేసింది. అప్పుడు నా వంతుగా ఆర్థిక సాయం చేశాను. నటి కాత్యాయని మాట్లాడుతూ.. .. 'సిద్ధు రెడ్డితో నటించడం ఆనందంగా ఉంది.`ఓ నా సిద్ధయ్య పాట అద్భుతంగా వచ్చింది. ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా ఈ పాట ఉంటుంద్ఁ అని అన్నారురామ్ అద్నాన్ మాట్లాడుతూ.. .. 'సిద్ధు రెడ్డి అన్న కథనే ఈ పాటలో చెప్పే ప్రయత్నం చేశాం. నల్గొండ గద్దర్ మాట్లాడుతూ.. .. సిద్ధు రెడ్డిలో ప్రజా నాయకుడు, హీరో కనిపిస్తారు. పేదవాళ్ల కోసం నిలబడే గొప్ప గుణం ఉంది. గీతా భాస్కర్ మాట్లాడుతూ.. సిద్ధు రెడ్డితో నేను పని చేసింది తక్కువే. ఒక్క పూటే పని చేసినా ఎంతో తెలుసుకున్నా.

## 'ఆకాశంలో ఒకతార' నవంబర్ 20న రిలీజ్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ మూవీ 'ఆకాశంలో ఒకతార' సినిమాకు సంబంధించిన విడుదల తేదీని మేకర్స్ ఈరోజు అనౌన్స్ చేశారు. ఈ మూవీలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి, శ్రుతి హాసన్ ప్రధాన పాత్రల్లో నటిస్తు న్నారు. పవన్ సాధినేని దర్శ కుడు. ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్నారు. స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తు న్నాయి. ఆకాశం లో ఒక తార్థ సినిమాను నవంబర్ 20న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ అందమైన సినిమాను ప్రతి ఒక్కరికీ చేరువ చేసేలా టీమ్ భారీ స్థాయిలో డిఫరెంట్ స్టైల్ ప్రమోషన్స్ నిర్వహిం చేందుకు ప్లాన్ చేస్తోంది. రీసెంట్‌గా విడుదలైన ఫస్ట్ సింగిల్`చిట్టి చిట్టి చీమ్మ పాటకు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న దుల్కర్ సల్మాన్.. దర్శకుడు పవన్ సాధినేని క్రియేటివ్ విజన్‌తో తెరకెక్కుతున్న 'ఆకాశంలో ఒక తార' సినిమాపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. టాలెంటెడ్ సినిమాటోగ్రాఫర్ సుజిత్ సారంగ్ ఈ సినిమాకు కెమెరా మెన్‌గా పనిచేస్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతటి బలమైన టెక్నికల్ టీమ్, మంచి నటీనటులతో తెరకెక్కుతోన్న`ఆకాశంలో ఒక తార్థ సినిమా తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతోంది.

## 'మగాళ్లు జిందాబాద్' టైటిల్ లాంచ్



గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్ బ్యానర్ పై ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు నిర్మాతలుగా యంగ్ హీరో శ్రీ నందు, స్టార్ కమెడియన్స్ వెన్నెల కిషోర్, వైవా హర్ష నటిస్తున్న తాజా చిత్రం మగాళ్లు జిందాబాద్. నార ప్రవీణ్ రచన దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ చిత్రం టైటిల్ అనౌన్స్మెంట్ ఈవెంట్ ఘనంగా జరిగింది. తెలుగు స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి శిష్యుడిగా నారా ప్రవీణ్ సినిమా టైటిల్ తోనే తన ప్రత్యేకతను చాటుకున్నారు. డైరెక్టర్ నార ప్రవీణ్ మాట్లాడుతూ.. ఇదొక సెటైరికల్ కామెడీ ఫిలిం అని అందుకోసమే మగాళ్లు జిందాబాద్ అనే టైటిల్ పెట్టామని పేర్కొన్నారు. సొసైటీలో ఆడవారికి దక్కే కంఫర్ట్ గాని, న్యాయం కానీ, సింపతీ కానీ మగాడికి దక్కట్లేదు అనే టాపిక్ ను సెటైరికల్ టోన్ లో డీల్ చేస్తూ ఔట్ అండ్ ఔట్ కామెడీ జెనరేట్ చేశాం .హీరోయిన్ లక్ష్మీ దుర్గ మాట్లాడుతూ.. మగాళ్లు జిందాబాద్ సినిమా అందరికీ నచ్చుతుందని, తనను నమ్మి మొదటి సినిమాగా అవకాశం ఇచ్చిన నిర్మాతలకు థాంక్స్ చెప్పారు. హీరో శ్రీ నందు మాట్లాడుతూ మగాళ్లు జిందాబాద్ ఈ టైటిల్ చాలామందిలో ఆలోచనలను రేకెత్తిస్తుంది. మరికొందరికి నవ్వు తెప్పిస్తుంది. ఆడవాళ్లను డామినేట్ చేయడానికి ఈ టైటిల్ పెట్టలేదు. మగవాళ్ళ భావాలు, బాధలు, కష్టాలు చెప్పుకోవడానికి చాలామంది ఆలోచిస్తారు. అలాంటి వారి కోసమే ఈ టైటిల్ అనే హీరో శ్రీ నందు తెలిపారు.

# వెస్టిండీస్ వన్డే సిరీస్‌కు భారత్ జట్టులో 8 మందిపై వేటు

ఆట



## బుమ్రా, కిషన్, అయ్యర్ ఔట్
## రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కుల్‌దీప్ యాదవ్ పదిలం

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో ఈ నెల 27న తిరువనంతపురం వేదికగా ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం భారత జట్టును బిసిసిఐ ఖరారు చేసింది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే ఈ సిరీస్ కోసం బిసిసిఐ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. టీమిండియా గత వన్డే సిరీస్‌తో పోల్చితే ఈ జట్టులో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. ఏకంగా 8 మంది ఆటగాళ్లను కొత్తగా జట్టులో చేర్చారు. ఈ ఏడాది జూలైలో ఇంగ్లండ్ పర్యటనలో భారత్ చివరిసారిగా వన్డే సిరీస్ ఆడిన సంగతి తెలిసిందే. జపాన్ వేదికగా జరిగే ఆసియా గేమ్స్ 2026లో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని భారత జట్టు బరిలోకి దిగుతుండటంతో ఈ మార్పులు అనివార్యమయ్యాయి.

ఆసియా గేమ్స్, వెస్టిండీస్‌తో వన్డే సిరీస్ ఒకే సమయంలో జరుగుతుండటంతో జట్టులో భారీ మార్పులు చేయాల్సి వచ్చింది. ఆసియా గేమ్స్‌లో అయ్యర్ సారథ్యంలో ఒక భారత జట్టు ఆడితే, మరోవైపు వెస్టిండీస్‌తో శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని మరో భారత జట్టు తలపడనుంది. వన్డే వైస్ కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్ అయ్యర్ అందుబాటులో లేకపోవడంతో ఆ బాధ్యతలను తిరిగి కేఎల్ రాహుల్‌కు అప్పగించారు. అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌కు అవకాశం కల్పించారు. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో భాగం కానీ ప్రముఖ ఆటగాళ్లు రవీంద్ర జడేజా, మహమ్మద్ సిరాజ్, రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ వన్డే జట్టులోకి తిరిగి వచ్చారు. వీరితో పాటు పంజాబ్ బ్యాటర్లు నమన్ ధీర్, జమ్మూ కశ్మీర్ పేసర్, రంజీ సెన్సేషన్ ఆకిబ్ నబీలకు తొలి సారి వన్డే పిలుపు దక్కింది. ఆసియా గేమ్స్ 2026 ఆడనున్న జస్‌ప్రీత్ బుమ్రా, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్‌లు వన్డే జట్టులో చోటు కోల్పోయారు. ఈ ఆరుగురితో పాటు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో జట్టులో ఉన్న హర్ష్ దూబే, ప్రిన్స్ యాదవ్‌లు కూడా వన్డే జట్టులో అవకాశాన్ని అందుకోలేకపోయారు. మరో ఏడుగురు మాత్రం వన్డే టీమ్‌లో తమ స్థానాన్ని నిలబెట్టుకున్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్, ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ తమ స్థానాలను పదిలం చేసుకున్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని అజిత్ అగార్కర్ సారథ్యంలోని సెలెక్షన్ కమిటీ ఈ మార్పులు చేసింది.



### ఆసియా గేమ్స్ మహిళల క్రికెట్..
## సెమీఫైనల్‌కు భారత్
### 5 ఓవర్లలో జపాన్ ఖతమ్

**నిస్షిన్ (జపాన్):** ఆసియా గేమ్స్ 2026 టోర్నీలో భారత మహిళల క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. నిస్షిన్‌లోని కోరోగి స్పోర్ట్స్ పార్క్‌లో శుక్రవారం ఆతిథ్య జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో భారత్ మహిళా జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జపాన్ మహిళల టీమ్ 19.5 ఓవర్లలో 57 పరుగులకు ఆలౌటైంది. శ్రీచరణి(4/10) నాలుగు వికెట్లతో సత్తా చాటగా, షెఫాలీ వర్మ(2/13)) రెండు వికెట్లు, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ తలో వికెట్ తీసారు. అనంతరం భారత్ 5 ఓవర్లలోనే 2 వికెట్లకు 59 పరుగులు చేసి గెలుపొందింది. షెఫాలీ వర్మ(40) టాప్ స్కోరర్‌గా నిలవగా, రిచా ఘోష్(12) దూకుడుగాఆడింది. ఆదివారంజరిగే రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడనుండగా, శ్రీలంకతో పాకిస్థాన్ ఆడనుంది. బంగ్లాదేశ్ ఒక్కమ్యాచ్ ఆడకుండానే సెమీస్‌కు అర్హత సాధించింది. చైనాతో ఆడాల్సిన క్వార్టర్ ఫైనల్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో మెరుగైన ర్యాంక్ కలిగిన బంగ్లాదేశ్ టోర్నీలో ముందడుగు వేసింది. శ్రీలంకపై పాకిస్థాన్, బంగ్లాదేశ్‌పై భారత్ విజయం సాధిస్తే ఫైనల్లో దాయాదుల మధ్య పోరు జరిగే వీలుంటుంది. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏకపక్ష విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే.

## యూత్ వన్డేలో భారత్ విజయం
### ఏడు రన్స్ తేడాతో ఆస్ట్రేలియా ఓటమి



**రాజ్‌కోట్:** గుజరాత్‌లోని నిరంజన్ షా స్టేడి యంలో శుక్రవారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి యూత్ వన్డే మ్యాచ్‌లో భారత్ స్వల్ప తేడాతో విజయం సాధించింది. శుక్రవారం వర్షం కారణంగా కుదించబడిన తొలి యూత్ వన్డేలో, ఆల్‌రౌండర్ యశ్‌బర్ధన్ చౌహాన్ అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరచగా, భారత్ ఆస్ట్రేలియాను 7 పరుగుల తేడాతో ఓడించింది. వర్షం కారణంగా ఇరు జట్లకు 20 ఓవర్లకు కుదించబడిన మ్యాచ్‌లో, తొలుత బ్యాటింగ్ చేసిన భారత అండర్19 జట్టు 182/6 పరుగుల బలమైన స్కోరును నమోదు చేసింది. చౌహాన్ (54) స్కోరింగ్‌లో ముందున్నాడు. ఆల్‌రౌండర్ ఆర్యవీర్ (28) ఆరంభంలోనే మంచి వేగాన్ని అందించాడు. ఇన్నింగ్స్ చివర్లో, వికెట్ కీపర్‌బ్యాటర్ అన్వయ్ మరింత దూకుడుగా మారి 38 పరుగులు చేశాడు. 12వ ఓవర్‌లో 88/4తో కష్టాల్లో ఉన్న భారత్‌ను, ద్రవిడ్, చౌహాన్ కలిసి ఐదవ వికెట్‌కు కీలకమైన 69 పరుగుల భాగస్వామ్యంతో గట్టెక్కించారు. ఆస్ట్రేలియా తరఫున ఆఫ్ స్పిన్నర్ ఎలీ బ్రెయిన్ 2 వికెట్లు తీశాడు. 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న ఆస్ట్రేలియా తమ టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ల పటిష్టమైన సహకారంతో గట్టి పోటీ ఇచ్చింది. కెప్టెన్ జాక్ జోస్నెక్ (55) జట్టును పోటీలో నిలబెట్టాడు. ఆస్ట్రేలియాకు 11 బంతుల్లో 24 పరుగులు అవసరమైన తరుణంలో జోస్నెక్ 25 బంతుల్లో తన అర్థ శతకాన్ని పూర్తి చేసుకున్నప్పటికీ ఆ తర్వాత బంతికే ఔటయ్యాడు. ఆఖరి ఓవర్‌లో 11 పరుగులు అవసరమైనప్పుడు, కుడిచేతి వాటం పేసర్ మోహిత్ ఉల్వా కేవలం మూడు పరుగులు మాత్రమే ఇచ్చి భారత్‌కు ఉత్కంఠభరితమైన విజయాన్ని అందించాడు.




### ఓపెన్‌లో ఇండొనేసియాపై
## భారత్ గెలుపు
### ఒలింపియాడ్‌లో మహిళల చేతిలో ఫిన్లాండ్ చిత్తు

**ఉజ్బెకిస్తాన్:** సమర్‌కండ్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్ రెండవ రౌండ్‌లో ఓపెన్ మరియు మహిళల విభాగాలలో భారత్ విజయాలు నమోదు చేసింది, అయితే ఈ రెండు జట్ల ప్రదర్శనలు విభిన్నంగా ఉన్నాయి. ఓపెన్ విభాగంలో శుక్రవారం ఇండోనేషియాపై జరిగిన మ్యాచ్‌లో 2.51.5 తేడాతో విజయం సాధించడానికి భారత్ కష్టపడాల్సి వచ్చింది. ప్రారంభ రౌండ్‌లో ఆర్. ప్రజ్ఞానంద, సుసాంటో మెగరాంటోతో నల్ల పావులతో సుదీర్ఘంగా ఆడి ఎండ్‌గేమ్‌లో 79 ఎత్తుల తర్వాత డ్రా అయింది. ఆరిఫ్ అబ్దుల్ హాఫీజ్‌పై తెల్ల పావులతో ఆడిన నిహాల్, భారత్‌కు తొలి విజయాన్ని అందించాడు. చివరి దశలలో వ్యూహాత్మకంగా ఆటపై పట్టు సాధించిన నిహాల్ 37.ఎన్‌సి5+ ఎత్తు తర్వాత హాఫీజ్ వైదొలగడంతో వరుసగా రెండో విజయం సాధించాడు. నల్ల పావులతో ఆడుతున్న డి. గుకేష్, ఐఎం సత్రియా దుతా కహాయాను ఓడించలేకపోయాడు. గుకేష్ పదేపదే క్వీన్ చెక్‌లను ఉపయోగించి గేమ్‌ను నిలబెట్టే ప్రయత్నంలో 51.క్యూడి1+ తర్వాత గేమ్ డ్రాగా ముగించాడు. నాయక బుద్ధిధర్మతో జరిగిన విదిత్ గుజరాతీ ఆట కూడా డ్రాగా ముగిసింది. తెల్ల పావులతో ఆడుతున్న విదిత్, 34.హెచ్3 తర్వాత పాయింట్‌ను పంచుకోవడానికి అంగీకరించే ముందు స్థితికి చేరుకున్నాడు. దీంతో ఒకవిజయం, మూడుడ్రాలతో భారత్ ఈమ్యాచ్‌ను 2.51.5 తేడాతో కైవసం చేసుకుంది. ఇక ఫిన్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళలు 3.50.5 తేడాతో సునాయాసంగా గెలిచారు. కోనేరు హంపి ఆ రౌండ్‌లో ఆడకపోవడంతో, వైశాలి టాప్ బోర్డ్‌ను ఆక్రమించింది. కానీ అనస్తాసియా కీనానెన్ ఆమెకు గట్టిపోటీనివ్వడంతో 88ఎత్తులతర్వాత డ్రాగా ముగిసింది. ఇక దివ్యదేశ్‌ముఖ్ 38 ఎత్తులలో జోహన్నా పాసికంగస్‌టెల్లాను ఓడించగా, వాంతికాఅగర్వాల్ కేవలం 22 ఎత్తులలోనే సారాఒలివియా సిప్పోలాను ఓడించి మ్యాచ్‌లో అత్యంత వేగవంతమైన విజయాన్ని నమోదు చేసింది. సవితా శ్రీ బి31 ఎత్తులలో హెల్జా లెహ్టినెన్‌ను ఓడించి, భారత్‌కు 3.50.5 తేడాతో ఘన విజయాన్ని అందించింది.




### ఆసియా క్రీడలు టెన్నిస్..
## క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ నిష్క్రమణ
### ఇండొనేసియా 0-2తో గెలుపు



**నాగోయా:** జయ్ మీనా, యోగేష్ చౌదరి, ఆర్యన్ ఠాకూర్, అనికేత్ పటేల్, ఓం యాదవ్‌లతో కూడిన భారత పురుషుల సాఫ్ట్ టెన్నిస్ జట్టు, క్వార్టర్ ఫైనల్స్‌లో ఇండోనేషియా చేతిలో 0-2 తేడాతో ఓటమి పాలై, ఆసియా గేమ్స్ 2026 ప్రచారాన్నిముగించింది. నాగోయాలో శుక్రవారం జరిగిన తొలి పురుషుల డబుల్స్ టైలో జయ్, యోగేష్, టియో హుటౌరుక్, ఫెర్నాండో సాంగర్‌ల చేతిలో 2-5 తేడాతో ఓడిపోగా, ఆ తర్వాత ఆర్యన్‌ఠాకూర్, బాగస్ ప్రదేవ చేతిలో 3-4 తేడాతో పరాజయం పాలయ్యాడు. ఈఓటమితో, 2026 ఆసియాక్రీడలలో భారత పురుషుల జట్టు ప్రయాణం ముగిసింది. అయితే, భారత అథ్లెట్లకు పోటీ కొనసాగుతోంది. ఈ నెల 22న జయ్, ఆర్యన్ పురుషుల సింగిల్స్‌లో పోటీపడనున్నారు. కాగా భారత పురుషుల జట్టు లావోస్‌పై 3-0 తేడాతో ఘన విజయంతో తమ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత గ్రూప్ టాపర్ అయిన చైనీస్ తైపీ చేతిలో 0-3 తేడాతో ఓటమి చవిచూసింది. నాకౌట్ బెర్త్‌ను ఖాయం చేసుకోవడానికి తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి కాగా, భారత్ బలంగా స్పందించి మంగోలియాను 3-0 తేడాతో ఓడించి, మూడు మ్యాచ్‌ల నుంచి నాలుగు పాయింట్లతో చివరి ఎనిమిది జట్లలోకి దూసుకెళ్లింది.

# ఎన్ఎస్ఇ ఐపిఒకు అనూహ్య స్పందన: 100శాతం సాధించిన లక్ష్యం




**ముంబయి, సెప్టెంబరు 18:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ప్రక్రియ ప్రారంభమైన రెండో రోజునే ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన వచ్చింది. ఈ ఐపీఓ ప్రారంభమైన రెండు రోజుల్లోనే 100 శాతానికి పైగా భర్తీ అయింది. ప్రస్తుతం ఈ ఐపీఓ మొత్తం 2.04 రెట్లు పైగా సబ్‌స్క్రైబ్ కాగా, రిటైల్ కోటా కూడా పూర్తిగా నిండిపోయింది. దరఖాస్తు చేసుకోవడానికి సోమవారం వరకు గడువు ఉండటంతో ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. ఈ ఐపీఓలో రిటైల్ కేటగిరీ 1.07 రెట్లు, క్యూఐబీ కోటా 3.70 రెట్లు, ఎన్ఐఐ కోటా 2.07 రెట్ల చొప్పున సబ్‌స్క్రిప్షన్ సాధించాయి. ఈనెల 17న ప్రారంభమైన ఈ పబ్లిక్ ఇష్యూలో రిటైల్ ఇన్వెస్టర్లు 21 వరకు బిడ్ దాఖలు చేసే అవకాశం ఉంది. కంపెనీ ఇన్వెస్టర్ల కోసం ఈనెల 16నే ఈ ఇష్యూను తెరిచి, ఆ ద్వారా రూ. 6,746.18 కోట్లను సమీకరించింది. ఒక కంపెనీ స్టాక్ మార్కెట్లోకి కొత్తగా ప్రవేశించడానికి ముందు, ఆ షేర్లకు అనధికారికంగా జరిగే కొనుగోలు, అమ్మకాల మార్కెట్‌ను గ్రే మార్కెట్ అంటారు. ప్రస్తుతం దీనికి గ్రే మార్కెట్‌లో క్షీణత కనిపిస్తుంటంతో ఇన్వెస్టర్లలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఒక దశలో ఈ ఐపీఓ రూ. 310 వరకు పలికింది. అయితే ప్రైస్ బ్యాండ్ వెల్లడైన తర్వాత ఇది క్రమంగా తగ్గుతూ వచ్చింది. నివేదికల ప్రకారం గురువారం రూ. 142 వద్ద ఉన్న గ్రే మార్కెట్ ప్రైస్, ప్రస్తుతం రూ. 105కి పడిపోయింది. ఇక ఈ ఐపీఓ ప్రైస్ బ్యాండ్‌ను రూ. 1,700 నుంచి రూ. 1,785 మధ్య కంపెనీ నిర్ణయించింది. ఒక లాట్‌లో 8 షేర్లు ఉండటంతో, ఇన్వెస్టర్లు కనీసం రూ. 14,280 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ప్రతి షేరుపై రూ. 170 రాయితీని ప్రకటించారు. ఈ ఐపీఓ మొత్తం పరి మాణం రూ. 22,561.57 కోట్లుగా ఉంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ కింద వస్తుండగా ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 12.64 కోట్ల షేర్లను విక్రయిస్తున్నారు. ప్రారంభంలో ఈ ఇష్యూ సైజు రూ. 30వేల కోట్లుగా ఉండగా దానిని సవరించారు. సోమవారం వరకు ట్రేడింగ్ ముగిసే సమయానికి తుది ఫలితాలపై మరింత స్పష్టత రానుంది.






# సెన్సెక్స్‌డౌన్,నిఫ్టీ అప్: వారాంతంలో మిశ్రమంగా మార్కెట్లు



**ముంబయి,సెప్టెంబరు 18:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, గ్లోబల్ బాండ్ ఈల్డ్స్ సాఫ్ట్‌గా ఉండటం శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లపై పెట్టుబడిదారుల సెంటిమెంట్‌కు మద్దతునిచ్చాయి. భారత 2026-27 ఆర్థిక సంవత్సరపు జీడీపీ వృద్ధి అంచనాను 6 శాతం నుంచి 7 శాతానికి పెంచుతూ మూడీస్ నిర్ణయం తీసుకోవడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచింది. మెటల్, రియల్టీ షేర్లు రాణించగా ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 19.63 పాయింట్లు తగ్గి 74,294.96 వద్ద ముగిసింది. మరోవైపు నిఫ్టీ 50 సూచీ 75.80 పాయింట్లు లాభపడి 23,346.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీకి భారతి ఎయిర్‌టెల్ 3.12 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.52శాతం, బజాజ్ ఫైనాన్స్ 2.49 శాతం చొప్పున పెరిగి మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.30 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈలో మొత్తం 2,714 షేర్లు లాభాల్లో ముగియగా, 1,618 షేర్లు నష్టాలను చవిచూశాయి. మరో 228 షేర్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. కమోడిటీ మార్కెట్లో 2026 నవంబర్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.68 డాలర్లు తగ్గి 103.14 డాలర్లకు చేరింది. భారత 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.17 శాతం పెరిగి 7.063 శాతానికి చేరింది. గత సెషన్‌లో ఇది 7.051 శాతంగా ఉంది.రూపాయి స్వల్ప లాభంవిదేశీ మారకద్రవ్య మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. పాక్షికంగా కన్వర్టిబుల్ రూపాయి 95.8950 వద్ద ట్రేడవుతూ కనిపించింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 95.8975 వద్ద ముగిసింది.ఎంసీఎక్స్‌లో 2026 అక్టోబర్ 5 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ 0.76 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,138కు చేరాయి.లాభపడిన షేర్లుస్పైస్‌జెట్‌వేస్ ఎయిర్ సర్వీసెస్: 5.70 శాతం పెరిగింది.జీపీటీ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ 4.97 శాతం లాభపడింది.కాంకార్డ్ బయోటెక్ 2.66 శాతం పెరిగింది. గుజరాత్ థెమిస్ బయోసిన్ 2.13 శాతం లాభపడింది. అయితే ఒన్‌ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్ 0.96 శాతం తగ్గింది.రెస్పాన్సివ్ ఇండస్ట్రీస్: 2.26 శాతం క్షీణించింది.

## రూ.12.12 లక్షల కోట్లకు పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ఆదాయం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 13 శాతం పెరిగి రూ.12.12 లక్షల కోట్లకు చేరాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు శుక్రవారం విడుదల చేసిన గణాం కాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇదే సమయం లో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 15 శాతానికి పైగా పెరిగి రూ.14.3 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు 19.48 శాతం పెరిగి సుమారు రూ. 5.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్‌యూఎఫ్) నుంచి వచ్చిన వసూళ్లు 6 శాతం పెరిగి రూ.6.16 లక్షల కోట్లకు పైగా చేరాయి. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) వసూళ్లలోనూ భారీ పెరుగుదల కనిపించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 53 శాతం పెరిగి రూ.40,214 కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్ల జారీ కూడా 29 శాతానికి పైగా పెరిగి రూ.2.2 లక్షల కోట్లను దాటింది. మరోవైపు సెప్టెంబర్ 17 వరకు అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరిగి రూ.5.22 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 18 శాతం పెరిగి రూ.4.16 లక్షల కోట్లుగా, నాన్‌కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 9.24 శాతం పెరిగి రూ.1.06 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక ఏప్రిల్‌జూలై మధ్య నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సం వత్సర లక్ష్యంలో ఇది 26.8శాతం. గత ఏడాది ఇదే కాలం లో ద్రవ్యలోటు రూ.4.7లక్షల కోట్లు ఉండగా ఈసారి కొంత తగ్గింది. 2026-27లో ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని కేంద్ర లక్ష్యంగా ఉంది.

## టాటాసన్స్ వివాదంతో క్షీణించిన టాటాగ్రూప్ షేర్లు

**ముంబయి, సెప్టెంబరు 18:** టాటా గ్రూప్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్ కొనసాగింపుపై నెలకొన్న వివాదం ఆ గ్రూప్ కంపెనీల షేర్లపై ప్రభావం చూపుతోంది. శుక్రవారం ఉదయం ట్రేడింగ్‌లో టాటా గ్రూప్ కంపెనీల షేర్లలో భారీగా అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో కొన్ని షేర్లు ఏకంగా 8 శాతం వరకు పడిపోయాయి. ఉదయం 9.40 గంటల సమయంలో టాటా కెమికల్స్ షేరు 8శాతం క్షీణించి రూ.716.65వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ షేరు 5 శాతం వరకు పడిపోయి రూ.682.55కు చేరింది. టీసీఎస్ షేరు 3.41శాతం నష్టపోయి.


SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఇమెయిల్ : crpd@sbi.co.in
అప్లై చేయడానికి QR స్కాన్ చేయండి

కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు కాంట్రాక్టు ప్రాతిపదిక న క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2026-27/23

| పదవి పేరు | ఖాళీ | 31.07.2026 నాటికి వయస్సు (సంవత్సరాలు) | |
|---|---|---|---|
| | | కనీసం | గరిష్ట |
| జోనల్ హెడ్ (రిటైల్) | 1 | 35 | 50 |
| రీజినల్ హెడ్ (ఆర్‌హెచ్) | 5 | 35 | 50 |
| రిలేషన్‌షిప్ మేనేజర్-టీమ్ లీడ్ | 24 | 28 | 42 |
| ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్ (ఐఎస్) | 9 | 28 | 42 |
| ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ (ఐఓ) | 4 | 28 | 40 |
| వీపీ వెల్త్ | 91 | 26 | 42 |
| ఏవీపీ వెల్త్ | 73 | 23 | 35 |

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ **https://sbi.bank.in/web/careers/current-openings** లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తుని నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలని నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు - **"CONTACT US" —> "Post Your Query"** లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ **(https://bank.sbi.in/web/careers/post-your-query)** లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : **04.09.2026** నుండి **25.09.2026** వరకు.

స్థలం: ముంబై
తేదీ: 04.09.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.